అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 07-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 158
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50



న్యూఢిల్లీ: 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల జాబితాను రాష్ట్రపతి ముర్ముకు అందజేస్తున్న భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు

షరతులు వర్తిస్తాయి...

బీజేపీకి నితీశ్ మెలిక

"పదేండ్లపాటు తిరుగులేని అధికారంలో ఉన్న బీజేపీలో మూడోసారి గెలిచామన్న సంతృప్తి ఎక్కడా కనిపించటం లేదు. ఓ వైపు తగ్గిన మోడీ చరిష్మా.. మరోవైపు ఎన్డీఏ కూటమిలో ఇతర పార్టీలు పెడుతున్న మెలికలు కమలం పార్టీలో కలకలం రేపుతున్నాయి"

సంకటంలో మోడీ హ్యాట్రిక్ గెలుపు



న్యూఢిల్లీ: చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా తయారయ్యింది బీజేపీ పరిస్థితి. బొటాబొటిన సాధారణ మెజారిటీ వచ్చినా.. వారి పరువు కాస్త సంకీర్ణం చేతిలో కీలుబొమ్మలా మారబోతోంది. ఇది కమలం పెద్దల్ని కలవరపెడుతోంది. రెండ్రోజుల్లో మోడీ 3.0కు సిద్ధం కాబోతున్న తరుణంలో జేడీయూ, ఎల్జేపీ తెరపైకి కొన్ని డిమాండ్లను తీసుకువచ్చాయి.

కేంద్రంలో తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు జేడీయూ,ఎల్జేపీ మద్దతు కీలకమైన నేపథ్యంలో జేడీయూ పార్టీ అధికార ప్రతినిధి కెసి త్యాగి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రక్షణ దళాల రిక్రూట్‌మెంట్ కోసం కేంద్రం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకాన్ని సమీక్షించాలని కోరారు. అగ్నివీర్ స్కీమ్ పట్ల ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారని చెప్పుకొచ్చారు. ఈ పథకంపై ప్రజలు లేవనెత్తిన లోటుపాట్లను వివరంగా చర్చించి వాటిని చక్కదిద్దాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. బీహార్‌కు ప్రత్యేక హెూదా డిమాండ్ చేశారు. ఈ విషయం ప్రధాని మోడీకి తెలుసని చెప్పుకొచ్చారు. కుల ఆధారిత జనాభా గణనకు తన మద్దతును పునరుద్ఘాటించారు. "దేశంలో ఏ పార్టీ కూడా కుల ప్రాతిపదికన ...13లో

జేడీయూ డిమాండ్లు ఇవే..

- అగ్నివీర్ పథకంపై సమీక్షించాలి
- దేశవ్యాప్తంగా కులగణన చేయాలి
- బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి
- యూసీసీ ప్రభావిత వర్గాలపై చర్చించాలి

ముందు నుయ్యి...వెనుక గొయ్యి

ఈసారి బీజేపీ మిత్రపక్షాలపైనే ఆధారపడి ఉంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ (272) కంటే ఎక్కువ (293) సీట్లు సాధించడంలో ఎన్డీఏ విజయం సాధించింది. అయితే బీజేపీ సొంతంగా మెజారిటీని పొందలేక పోయింది. అందుకే సీట్ల వారీగా అతి పెద్ద పార్టీగా అవతరించినా మిత్రపక్షాల పైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత టీడీపీ (చంద్రబాబు నాయుడు) 16 సీట్లతో రెండో స్థానంలో ఉంది. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ 12 స్థానాలతో మూడోదిగా ఉంది.

స్టాక్ మార్కెట్‌లో అతిపెద్ద కుంభకోణం

ఐదు కోట్ల ఇన్వెస్టర్లను ముంచారు



మోడీ, షాలే కారణం

బూటకపు ఎగ్జిట్ పోల్స్‌తోనూ ప్రభావం

జేపీసీ విచారణకు రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ : బీజేపీ నేతల వల్లే స్టాక్ మార్కెట్లలో అతిపెద్ద పతనం చోటు చేసుకుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. జూన్3న మార్కెట్ల క్షీణత వెనుక నరేంద్ర మోడీ, అమిత్‌షా, నిర్మలా సీతారామన్ ఉన్నారని విమర్శించారు. స్టాక్ మార్కెట్‌లోనే అతి పెద్ద మోసం గుట్టు విప్పాలంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్టాక్ మార్కెట్ చరిత్రలోనే ఇటీవలి పతనం అతిపెద్ద కుంభకోణమని అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలు షేర్లలో పెట్టుబడులు పెట్టాలంటూ స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా సూచనలిచ్చారని, ఫలితంగా రిటైల్ ఇన్వెస్టర్లు లక్షల కోట్ల రూపాయలను పోగొట్టుకున్నారని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బూటకపు ఎగ్జిట్ పోల్స్ తర్వాత స్టాక్ మార్కెట్లు ఎగిశాయని, జూన్ 4న ఫలితాల తర్వాత కుప్పకూలాయన్నారు. దీంతో లక్షల కోట్ల రూపాయల సామాన్యుల సొమ్ము పెద్దలకు చేరిందని ఆయన ఆరోపించారు. "ఎన్నికల సందర్భంగా ప్రధాని, కేంద్ర హోం మంత్రి, ఆర్థిక మంత్రి స్టాక్ మార్కెట్‌పై వ్యాఖ్యలు చేయడాన్ని మేం తొలిసారిగా గమనించాం. స్టాక్ మార్కెట్ అత్యంత వేగంగా పెరుగుతోందని ...13లో

చంద్రబాబుకు రేవంత్ శుభాకాంక్షలు

విభజన సమస్యలు పరిష్కరించుకుందామని సూచన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభినందించారు. ఏపీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకుందామనీ, అందుకు సహకరించాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మధ్యాహ్నం మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఫలితాలపై సమీక్ష జరిగింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విప్ రాంచంద్రనాయక్, నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అదే సమావేశం నుంచి రేవంత్ రెడ్డి చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు.

సీఎంను కలిసిన కొత్త ఎంపీలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ఎంపీలు...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఉన్నారు.

ఉరిమిన వర్షం

పిడుగులు పడి ఆరుగురు కన్నుమూత



నవతెలంగాణ-విలేకరులు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలులతో వర్షం కురవడంతో పిడుగులుపడి ఆరుగురు మృతిచెందగా, ఒకరికి గాయాలయ్యాయి. కొన్ని మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గావ్‌కు చెందిన దంపతులు ఆనక సంతోష్(27), స్వప్న గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందారు. పొలంలో పని ముగించుకొని ఇంటికి వద్దామనుకునే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దాంతో పొలంలోనే గుడిసెలో తలదాచుకున్నారు. ఇదే సమయంలో గుడిసెపై పిడుగు పడి ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన రైతు మూడపల్లి ప్రవీణ్(28) తోటలోకి వెళ్లాడు. పని చేస్తుండగా ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం శమ్నపూర్ గ్రామానికి చెందిన శెట్టిపోయిన సిద్ధయ్య (50), ఉడంగుల నందు (22) బుధవారం సాయంత్రం గుడిసె కప్పడానికి ...13లో

మూగజీవాల మృత్యువాత

ఇజ్రాయిల్ ఉన్మాదం

గాజాలో పాఠశాలపై సైనిక దాడి

23 మంది మహిళలు, చిన్నారులు సహా 68 మంది మృతి





గాజా : అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. హమస్ సాయుధులను అంతమొందించే పేరుతో అమాయకులైన పాలస్తీనియన్ పౌరులపై మారణకాండ సాగిస్తోంది. సెంట్రల్ గాజాలో నిర్వాసితులైన పాలస్తీనియన్లు తలదాచుకున్న పాఠశాల భవనంపై గురువారం తెల్లవారు జామున ఇజ్రాయిల్ బలగాలు దాడి చేయడంతో 68మంది మరణించారు. వీరిలో 23 మంది మహిళలు, పిల్లలు వున్నారని స్థానిక ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. కాగా ఈ దాడిలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. సెంట్రల్ గాజాలో కొత్తగా వైమానిక, పదాతి దాడులు ప్రారంభిస్తున్నామని మిలటరీ ప్రకటించిన నేపథ్యంలోనే ఈ దాడి చోటు చేసుకుంది. స్కూలు దాడి జరిగిన ప్రాంతం నుండి 30వరకు మృత దేహాలు వచ్చాయని, ఒక ఇంటిపై విడిగా జరిగిన మరో దాడిలో మరణించిన ఆరుగురి మృత దేహాలు కూడా వచ్చాయని డేర్ అల్ బాలాహ్‌లోని అల్ అక్సా మార్టియర్స్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న ఈ స్కూలుపై తమ యుద్ధ విమానాలు దాడి చేశాయని ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. అయితే తమ సైనిక కార్యకలాపాల కోసం హమాస్, ఇస్లామిక్ జిహాద్‌లు ఆ స్కూలును ఉపయోగించేవని ఇజ్రాయిల్ మిలటరీ పేర్కొంది. ఇందుకు సంబంధించి ...13లో


రెండో ఓటే లెక్క..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితంపై వీడని ఉత్కంఠ



- మ్యాజిక్ ఫిగర్ 1,55,095 ఓట్లు ఎవరికీ రాని వైనం
- ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మొదటి ప్రాధాన్యత ఓట్లతో తేలని ఫలితం..!
- లెక్కింపు సరిగా లేదని బీఆర్ఎస్ అభ్యంతరం
- విధులకు ఆటంకం కలిగించారని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిపై కేసు నమోదు

వివరాలు 5లో



ఆశలపల్లకిలో..

మంత్రి పదవులపై బీజేపీ ఎంపీల గంపెడాశలు

తెలంగాణకు రెండు మంత్రిపదవులంటూ చర్చ

- ముందువరుసలో ప్రస్తుత మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల, బండి, లక్ష్మణ్
- తనకూ అర్హతలున్నాయంటున్న కొండా
- మహిళా కోటాలో దక్కుతుందనే ఆశలో డీకే
- మాజీ సీఎం కేసీఆర్‌ను ఎదురొడ్డి నిలిచిన తనకే వస్తుందన్న ఆశలో రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

9వ తేదీన ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత క్యాబినెట్ తొలి లిస్టులో తెలంగాణ నుంచి ఒక పేరు కచ్చితంగా ఉంటుందనీ, ఆ తర్వాత మరొకరికి అవకాశం దక్కుతుందనే ప్రచారం బీజేపీ శ్రేణుల్లో జోరుగా సాగుతున్నది. తొలివిడతలో ప్రస్తుత కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వైపే బీజేపీ మొగ్గుచూపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆయనతో పాటు ఈటల రాజేందర్ పేరు కూడా బలంగా వినిపిస్తున్నది. తెలంగాణ ఉద్యమకారుడు, బలమైన బీసీ నేత, సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరిలో 3 లక్షలకుపైగా భారీ మెజార్టీతో గెలుపొందటం, మోడీ, అమిత్‌షాతో నేరుగా సత్సంబంధాలుండటం వంటివి ఈటల రాజేందర్‌కు సానుకూల అంశాలుగా మారనున్నాయి. వీరిద్దరితో పాటు మరో సీనియర్ నేత డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా రేసులో ముందువరుసలో ఉన్నారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో కిషన్‌రెడ్డితో పాటు మిగతా సీనియర్ నేతలు తమ నియోజకవర్గాల్లో ప్రచారంలో బిజీగా ఉండటంతో లక్ష్మణ్ వ్యవహారాలన్నింటినీ చక్కబెడుతూ పార్టీ శ్రేణులను ముందుకు నడిపించారనే ప్రచారముంది. దీనికి తోడు కీలకమైన బీజేపీ పార్లమెంటరీ బోర్డులో ఆయన సభ్యులుగా ఉన్నారు. ఇక తెలంగాణలో బీజేపీ క్షేత్రస్థాయిలో విస్తరించడానికి, ఈ ఊపు రావడానికి తాను ఎంతో కృషి చేశాననీ, ఈ నేపథ్యంలో తనకు కూడా మంత్రి పదవి దక్కుతుందనే ఆశలో బండి ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి కొట్లాడిన చరిత్ర తనకుందనీ, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గాలున్న మెదక్ పార్లమెంట్ స్థానంలో ఎదురొడ్డి గెలిచిన తనకు మంత్రి అవకాశాన్ని పార్టీ ఇస్తుందనే ఆలోచనలో రఘునందన్‌రావు ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షున్ని మార్చే సమయంలో తనకు ఆ బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరిన విషయం విదితమే. మహిళా కోటాలో, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నుంచి గెలుపొందిన తనకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశలో డీకే అరుణ ఉన్నారు. తనకూ కేంద్ర మంత్రి అయ్యే అర్హతలున్నాయనీ, అంతిమంగా పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటానని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా తన కోరికను బాహాటంగానే వెలిబుచ్చారు. వీరంతా ఎవరికి వారే తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తమ కంటే తమకే మంత్రి పదవి దక్కబోతుందంటూ ఎవరి సానుకూలతలను వారు ప్రచారం చేసుకుంటున్నారు. అనుకున్నట్టుగానే కిషన్‌రెడ్డికే మంత్రి పదవి దక్కుతుందా? బీసీ కోటాలో ఈటలను వరిస్తుందా? మిగతా ఎంపీల ఆశలు ఫలిస్తాయా? తొలి విడతలో ఒక్కరితోనే మోడీ సర్కారు సరిపెడుతుందా? దక్షిణాదికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనలో భాగంగా రెండు బెర్తులనూ ఒకేసారి భర్తీ చేస్తుందా? అనే ఉత్కంఠకు తెరపడాలంటే రెండు,మూడు రోజులు వేచిచూడాల్సిందే.

తెలంగాణ నుంచి గెలుపొందిన బీజేపీ ఎంపీలు ఆశలపల్లకిలో ఊరేగుతున్నారు. వారికి రాజ్యసభ సభ్యులు, బీజేపీ పార్లమెంట్ బోర్డు మెంబర్ కె.లక్ష్మణ్ కూడా తోడయ్యారు. ఎంపీలంతా నాకంటే నాకే మంత్రి పదవి దక్కబోతున్నదని సన్నిహితుల ద్వారా, మీడియా ద్వారా లీకులిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న తెలంగాణపై మరింత ఫోకస్ పెట్టి బలపడాలనే ఉద్దేశంతో ఈసారి మోడీ క్యాబినెట్‌లో రెండు బెర్తులు తెలంగాణ ఎంపీలకు దక్కబోతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో హాట్‌హాట్‌గా నడుస్తున్న నేపథ్యంలో ఎవరికి వారే తమ ప్రయత్నాల్లో మునిగిపోయారు. ప్రధాని మోడీ, అమిత్‌షా, ఆ పార్టీ అధ్యక్షులు నడ్డా, ఇతర జాతీయ నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.



పాపం పసివాళ్లు

ఒకే గదిలో నాలుగు అంగన్‌వాడీ సెంటర్లు

అదే గదిలో వంట సరుకులు..వంట

ఎనిమిదేండ్లుగా అక్కడే..

ఈ విద్యా సంవత్సరంలోనైనా విముక్తి కలిగేనా?

నవతెలంగాణ - ముస్తాబాద్

పసివాళ్లు.. ప్రశాంతంగా ఆడుతూపాడుతూ గడిపేందుకు.. పిల్లలు పడుకునేందుకు విశాలంగా ఉండాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు.. ఇరుకు గదుల్లో.. అదీ ఒకే గదిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను నడిపిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఎనిమిదేండ్లుగా అక్కడే చిన్నారులు సతమతమవుతున్నారు. ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా పిల్లలకు చిన్న వయస్సు నుండే బలమైన పౌష్టిక ఆహారంతోపాటు మంచి విద్యాబుద్ధులు అలవడేలా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. కానీ సొంత భవనాలు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో, అద్దె గదుల్లో ఒక్కో చోట రెండు, నాలుగేసి సెంటర్లతో నెట్టుకొస్తున్నారు. ఆ కేంద్రాలకు ప్రభుత్వం అందించే సరుకులు కూడా అదే గదిలో భద్రపరచడంతో చిన్నారులు, టీచర్లు, ఆయాలు నానా తంటాలు పడుతున్నారు. సొంత భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రారంభించిన భవనాల పనులను కూడా కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో 22గ్రామాలు ఉండగా, అంగన్వాడీ ...13లో

నేటి నుంచి ప్రజావాణి పున:ప్రారంభం

- రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తామని ప్రజావాణి ఇన్‌చార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వరకు దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రజావాణిలో అర్జీల స్వీకరణ కార్యక్రమం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని కోరారు. కార్యక్రమానికి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

8న నేషనల్ లోక్ అదాలత్

- టీఎస్ఎల్ఎస్ఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ లోక్ అదాలత్‌ను ఈ నెల 8న నిర్వహిస్తున్నట్టు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్ హైకోర్టు నుంచి తాలుకాస్థాయి న్యాయస్థానాల వరకు అన్ని స్థాయిల కోర్టుల్లో ఉంటుందని చెప్పారు. అదాలత్‌లో సివిల్ కేసులతో పాటు కాంపౌడబుల్ క్రిమినల్ కేసుల్లో రాజీ కుదుర్చనున్నట్టు వెల్లడించారు. ఎలాంటి రుసుం లేకుండా ఈ సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తమ కేసులను సెటిల్ చేసుకునేందుకు వ్యక్తిగతంగా కానీ లేదా వర్చువల్ పద్ధతిలో కానీ హాజరయ్యే వెసులుబాటు ఉందని స్పష్టం చేశారు. కేసులున్న వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టభద్రుల ఓట్ల లెక్కింపులో అవకతవకలు

- సీఈఓ వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నాయని సీఈఓ వికాస్ రాజ్‌కు గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, లీగల్ సెల్ సభ్యురాలు లలితా రెడ్డి ఫిర్యాదు చేశారు. ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్‌కు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. మూడో రౌండ్‌లో 533 నాలుగో రౌండ్‌లో 170 పైచిలుకు ఓట్ల లీడ్‌లో బీఆర్ఎస్ ఉన్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి వచ్చిన ఆధిక్యాన్ని లిస్టులో తీన్మార్ మల్లన్నకు చూపిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సీఈవో స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నీట్‌లో శ్రీగోసలైట్స్ ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ఫలితాల్లో విజయవాడకు చెందిన శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ మేరకు ఆ సంస్థ చైర్మెన్ నరేంద్రబాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ఫలితాల్లో ఎస్ మల్లిఖార్జునరావు 706 మార్కులు, జి పూజిత 705 మార్కులు, ఎన్ రోహిత్‌సాయి 705 మార్కులను సాధించి రికార్డు సృష్టించారని వివరించారు. కె సంజోగ్ నాయుడు 711 మార్కులు, గోమేధికం నయన్ 705 మార్కుల, సరాబు శ్రీ నిఖిల్, నాము అశ్రిత్, ఎం మయూఖ్‌శర్మ 700 మార్కులను సాధించి విజయకేతనం ఎగరేశారని తెలిపారు. సాధారణ స్కూళ్లలో చదివిన సామాన్య విద్యార్థులను తాము ర్యాంకర్లుగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.

నీట్‌లో ఆకాశ్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ఫలితాల్లో ఆకాశ్ విద్యాసంస్థకు చెందిన 15 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ మేరకు ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ చీఫ్ అకడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనురన్ ఘోష్ 716 పర్సెంటైల్ స్కోర్‌తో 77వ ర్యాంకును సాధించారని తెలిపారు. ప్రణవ్ లకినపల్లి 711 స్కోర్‌తో 306 ర్యాంకు, రిజ్వాన్ షేక్ 710 స్కోర్‌తో 549 ర్యాంకు, జయంత్ 706 స్కోర్‌తో 755 ర్యాంకు పొందారని వివరించారు.

కేంద్రంలో కొత్త ప్రభుత్వం

- రైతులతో చర్చలకు సమయం ఇవ్వాలి : రాకేష్ తికాయత్

ముజఫర్‌నగర్ : కేంద్రంలో ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా... వారు రైతులతో చర్చలకు సమయం ఇవ్వాలని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నాయకులు రాకేష్ టికాయత్ తెలిపారు. 'దేశంలో సమస్యలు ఉన్నప్పుడు ఆందోళనలు (నిరసనలు) రేగుతాయి. ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేసినా వారు చర్చల కోసం సమయం ఇవ్వాలి' అని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తికాయత్ తెలిపారు. నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం)లో బీకేయూ కూడా ఒక భాగం.

ఏపీ గవర్నర్‌కు 175 మంది ఎమ్మెల్యేల జాబితా అందజేత

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల



అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన 175మంది ఎమ్మెల్యేల జాబితాను ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా గురువారం అందజేశారు. అనంతరం గవర్నర్ కార్యాలయం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్, అదనపు సిఇఓలు పి.కోటేశ్వరరావు, ఎమ్ఎన్ హరీందర్‌ప్రసాద్, కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్, జాయింట్ సిఇఓ ఎ.వెంకటేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ రవీందర్‌కుమార్ ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికలకోడ్) అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ఈ ప్రవర్తనా నియమావళి ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ముగిసిన 48గంటల వరకు అమల్లో ఉందని తెలిపారు. రాష్ట్రంలో 25 పార్లమెంట్, 175 శాసనసభ నియోజకవర్గాలకు నూతనంగా ఎన్నికైన వారి జాబితాను ఖరారు చేయడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును గురువారం సాయంత్రం 6 గంటల నుంచి నిలిపివేశామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే ప్రాధాన్యం

- ఆదిశలోనే ఢిల్లీలో పని
- ఎంపీలకు బాబు దిశానిర్దేశం
- 12న ప్రమాణస్వీకారం చేస్తానని వెల్లడి



అమరావతి: ఢిల్లీలో రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని ఎంపిలకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ ఎంపీలు కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోలేదని అన్నారు. దానికి భిన్నంగా టీడీపీ ఎంపీలు వ్యవహ రించాలని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా పని చేయాలని అన్నారు. 'స్టేట్ ఫస్ట్' నినాదంతో పని చేయాలన్నారు. ప్రజలు తమకు అనుకూలంగా భారీ తీర్పు ఇచ్చారని, అయితే ఈ తీర్పుతో ఎవరూ ఆకాశంలో ఎగరొద్దని చెప్పారు. నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు విని యోగించాలని సూచించారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా భారీ మూల్యం చెల్లించుకో వాల్సి వస్తుందని, జగన్ విషయంలో అదే జరిగిందని చెప్పారు. ఈ అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవా లన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ నెల 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వస్తారని చెప్పారు.

బ్యూరోక్రాట్ల పాలన ఉండదు

తాను అధికారుల మాటలే వింటానని అపవాదు ఉందని, ఇక నుండి ఆ పరిస్థితి ఉండదని చెప్పారు. 'రాష్ట్రంలో బ్యూరోక్రాట్‌ల పాలన ఉండదు. అన్ని విషయాలు నేనే వింటా' అని అన్నారు. 'ఇక నుండి మారిన చంద్రబాబుని చూస్తారు' అని అన్నారు. ఎంపిలందరూ తరచూ తనను కలవాలని, తాను బిజీగా ఉన్నా పక్కకు వచ్చి మాట్లాడి వెళ్తానని చెప్పారు. ఇక నుంచి ప్రతి అంశం తానే వింటానని, తానే చూస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా కలిసి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు కలిసి కార్యకర్తలు, నేతలకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ ఐదేండ్లు నేతలు, కార్యకర్తలు తనకోసం ప్రాణాలిచ్చారని, కత్తి మీద పెట్టినా పార్టీని, తనను వీడలేదన్నారు. అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ తలొగ్గలేదని చెప్పారు. కార్యకర్తల ఇబ్బందులు మనోవేదనను కలిగించాయన్నారు.

ఈ సమావేశంలో టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పెమ్మసాని చంద్రశేఖర్, కేశినేని చిన్ని, కృష్ణప్రసాద్, ఎం భరత్, పుట్టా మహేష్ యాదవ్ ప్రత్యక్షంగా పాల్గొనగా, మిగిలిన ఎంపీలు జూమ్ యాప్ ద్వారా పాల్గొన్నారు.

11న టీడీఎల్‌పీ

తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష (టీడీఎల్‌పీ) సమావేశం ఈ నెల 11వ తేదీన జరగనుంది. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకోనున్నారు. అదేవిధంగా మంత్రుల జాబితా కూడా అదే రోజు వెల్లడించే అవకాశం ఉంది.

ఢిల్లీకి చంద్రబాబు


చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని ఎన్‌డీఏ మిత్రపక్షాలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవనున్నారు. ఈ బృందంలో చంద్రబాబు కూడా ఉంటారు.

పార్లమెంట్ ఆవరణ నుంచి గాంధీ, అంబేద్కర్, శివాజీ విగ్రహాల తొలగింపు

- విమర్శల వెల్లువ



న్యూఢిల్లీ : పార్లమెంట్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీతో పాటు మరికొందరి విగ్రహాలను పాత బిల్డింగ్ సమీపంలో ఉన్న లాన్‌లోకి తరలించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహారాణ ప్రతాప్, గిరిజన నాయకుడు బిర్సా ముండా వంటి విగ్రహాలన్నింటినీ ఇప్పుడు పాత పార్లమెంట్ భవనం, పార్లమెంట్ లైబ్రరీ మధ్య ఉన్న లాన్‌లో ఉంచారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందిస్తూ 'ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను పార్లమెంట్ హౌస్ ముందు ఉన్న ప్రాధాన్యతా స్థలాల నుంచి తొలగించారు. ఇది దారుణం' అని చెప్పారు.



మహారాష్ట్రలోని ఓటర్లు బిజెపికి ఓటు వేయలేదనే కారణంతోనే శివాజీ, అంబేద్కర్ విగ్రహాలను పార్లమెంట్ ఆవరణ నుంచి తొలగించారని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా విమర్శించారు. 'ఒక్కసారి ఆలోచించండి. వారికి 400 సీట్లు ఇస్తే.. రాజ్యాంగాన్ని విడిచిపెడతారా..?' అని ఖేరా ప్రశ్నించారు.

కేంద్రమంత్రి అయ్యే అర్హతలున్నాయ్

- బీఆర్ఎస్సే కాదు కాంగ్రెసోళ్లూ ఓటేశారు
- అందుకే ఇంత పెద్ద మెజార్టీ
- కేసీఆర్ కంటే రేవంత్ పాలనే నయం
- రాజకీయాలు పక్కనబెట్టి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తా : చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర మంత్రి అయ్యే అర్హతలు తనకున్నాయనీ, మంత్రి అయితే కొన్ని సానుకూలతలు, ప్రతికూలతలుంటా యని చేవెళ్ల ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతిమంగా పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ వాళ్లే కాదు కాంగ్రెసోళ్లూ కూడా తనకు ఓటేసి ఆదరించారనీ, అందుకే ఇంత పెద్ద మెజార్టీ వచ్చిందని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం కంటే రేవంత్‌రెడ్డి సర్కార్ నయమని కితాబిచ్చారు. కేసీఆర్ పాలనలో మాదిరిగా పోలీసులు వ్యవహరించలేదన్నారు. ఐదేండ్లు రాజకీయాలను పక్కకు బెట్టి రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేస్తామనీ, కేంద్రం నుంచి తన వంతుగా సహకారాన్ని అందిస్తానని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్ర ప్రభుత్వ మెడకు తగులుకున్నాయన్నారు. ఎంపీ అయ్యాక ఆయన తొలిసారి హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను బీజేపీ రాష్ట్ర నాయకులు జంగయ్య యాదవ్ సత్కరించారు. కేంద్రం సపోర్టుతో తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి, వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ విస్తరణకు కృషి చేస్తాననీ, 400 గ్రామాలకుపైగా ఎంపీ ల్యాండ్స్ అందేలా చూస్తానని హామీనిచ్చారు. ఇండియాలో బెస్ట్ ఎంపీగా చేవెళ్ల నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని నొక్కి చెప్పారు. మూడు నెలలు క్యాంపెయిన్, 400 టీమ్‌లతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం తనకు ఉపయోగపడిందన్నారు. 700 గ్రామాల్లో సర్పంచులను గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్రంలోని మళ్లీ మోడీ సర్కార్ వస్తే ఎన్‌ఆర్‌సీ తెచ్చి ముస్లింలను దేశం నుంచి వెళ్లగొడుతుందనీ, మతపరంగా చిన్నగా చూస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీల మనస్సుల్లో విషం నింపిందని విమర్శించారు. హైదరాబాద్-బీజాపూర్ హైవే ద్వారా చేవెళ్ల 30 నిమిషాల్లోల చేరేలా కృషి చేస్తానన్నారు. తాండూరులో పొల్యూషన్ నివారణకు కృషి చేస్తానని హామీనిచ్చారు. టమాటా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కాళేశ్వరానికి రిపేర్లు చేయడం సరిగాదనీ, దానిపై ఏం చేయాలనే దానిపై త్వరలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. ఒకవేళ తాను కేంద్ర మంత్రి అయితే 10 నెలలపాటు ఢిల్లీలో ఉండాల్సి వస్తుందనీ, కేవలం 2 నెలలే తన నియోజకవర్గ ప్రజలతో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. తనకు కొన్ని సబ్జెక్టులపై అపారమైన నాలెడ్జి ఉందనీ, మంత్రి అయితే దాన్ని దేశం ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లోగానీ, కమిటీల మీటింగ్‌ల్లోగాని తాను వంద శాతం హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. అయితే, అంతిమంగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.

సూడాన్‌లోని ఒక గ్రామంపై మిలటరీ బలగాల దాడి

- వందమంది వరకు గ్రామస్తులు మృతి

ఖార్టూమ్ : సెంట్రల్ సూడాన్‌లోని ఒక గ్రామంపై పేరా మిలటరీ ఆర్ఎస్ఎఫ్ బలగాలు దాడి చేసి వందమంది వరకు ప్రజలను మట్టుబెట్టాయని స్థానిక ప్రజాస్వామ్య అనుకూల కార్యకర్తలు తెలిపారు. సూడాన్ ఆర్మీతో ఏడాదికి పైగా యుద్ధాన్ని సాగిస్తున్న ఆర్ఎస్ఎఫ్ భారీగా శతఘ్నులను మోహరించి వద్ అల్ నూరా గ్రామంలో ఈ కిరాతకానికి దిగిందని వద్ మదాని ప్రతిఘటనా కమిటీలు సోషల్ మీడియాలో పోస్టు పెట్టాయి. మూకుమ్మడిగా ఖననం చేసేందుకు తరలిస్తున్న డజన్ల సంఖ్యలోని మృతదేహాల ఫోటోలను ఈ కమిటీలు సోషల్ మీడియాలో షేర్ చేశాయి. సాయం కావాలని కోరినా సూడాన్ ఆర్మీ పట్టించుకోవడం లేదని తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా మహిళలు, పిల్లలు, వృద్ధులే బాధితుల్లో వున్నారని డార్ఫర్ ప్రావిన్స్ గవర్నర్ మిని అరకో తెలిపారు. ఆర్ఎస్ఎఫ్ తరచుగా గ్రామాలకు గ్రామాలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతూ వుంటుంది. కాగా తాము తీవ్రవాద స్థావరాలపైనే దాడులు చేశామని ఆర్ఎస్ఎఫ్ బుధవారం ఒక ప్రకటన చేసింది. అందులో పౌరులెవరూ మరణించలేదని తెలిపింది. కానీ ఒక పద్ధతి ప్రకారమే ఆర్ఎస్ఎఫ్ ఈ దాడులకు పాల్పడుతుందని, ఇవన్నీ నేరపూరితమైన చర్యలేనని వద్ మదానీ ప్రతిఘటనా కమిటీలు తెలిపాయి.

బర్డ్ ఫ్లూ వైరస్‌తో మెక్సికోలో వ్యక్తి మృతి



మెక్సికో సిటీ : బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్2) వైరస్ సంక్రమించడంతో ఒక వ్యక్తి మెక్సికోలో మరణించాడని, అయితే ఆ వ్యక్తికి అప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలు వున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రకటించింది. అయితే ఈ వైరస్ వల్ల సాధారణ ప్రజానీకానికి వున్న ముప్పు చాలా తక్కువని పేర్కొంది. జ్వరం, శ్వాస సరిగా తీసుకోకపోవడం, వాంతులు, విరోచనాలు, వికారం వంటి లక్షణాలతో బాధపడుతూ ఏప్రిల్‌లో మెక్సికో సిటీలో 59ఏళ్ళ వ్యక్తి మరణించాడని బుధవారం ఒక ప్రకటనలో డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. ఈ లక్షణాలు తీవ్రమవడానికి ముందు మూడు వారాలుగా ఆ వ్యక్తి ఇతర సమస్యలతో మంచానికే పరిమితమయ్యారని ఆ వ్యక్తి బంధువులు తెలిపారు. కిడ్నీ వైఫల్యం, షుగర్, రక్తపోటు వంటి సమస్యలతో ఆ వ్యక్తి బాధపడుతున్నారని మెక్సికో ప్రజారోగ్య విభాగం తెలిపింది. ఏప్రిల్ 24న ఆస్పత్రికి వచ్చారని, అదే రోజు మరణించాడని పేర్కొంది.. తొలిగా జరిపిన పరీక్షల్లో గుర్తు తెలియని ఫ్లూ అని వచ్చిందని, దానిపై వారాల తరబడి ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయగా బర్డ్ ఫ్లూ వైరస్‌గా నిర్ధారణ అయిందని డబ్ల్యుహెచ్ఓ పేర్కొంది. ఇతరత్రా గల అనారోగ్య సమస్యల వల్ల ఈ వైరస్ లక్షణాలు మరింత ఉధృతంగా వున్నాయని అమెరికాకు చెందిన ఆరోగ్య నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. అయతే ఈ వ్యక్తికి అసలు ఈ వైరస్ ఎలా సంక్రమించిందన్నది పెద్ద సమస్యగా వుందన్నారు. ఆ వ్యక్తితో సంబంధాలు కలిగిన వారిని పరీక్షించామని, వారికి ఈ వైరస్ సోకినట్లు వెల్లడి కాలేదని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది.

కంగనా రనౌత్‌కు అవమానం

- చెంపదెబ్బ కొట్టిన మహిళా సిఐఎస్ఎఫ్



న్యూఢిల్లీ : సినీనటి, బిజెపి నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపి కంగనా రనౌత్‌కు తీవ్ర అవమానం ఎదురయింది. చండీగఢ్ విమానాశ్రయంలో సిఐఎస్ఎఫ్‌కు చెందిన ఒక మహిళా కానిస్టేబుల్ కంగనా రనౌత్‌ను చెప్పుతో చెంపదెబ్బ కొట్టారు. ఈ విషయాన్ని ఎంపి స్వయంగా ఒక వీడియో సందేశం ద్వారా వెల్లడించారు. 'భద్రతా తనిఖీ సమయంలో ఈ సంఘటన జరిగింది. నేను తనిఖీలకు వెళ్ళినప్పుడు ప్రక్కనే ఉన్న క్యాబిన్ నుంచి వచ్చిన మహిళా సిఐఎస్ఎఫ్ అధికారి నన్ను దుర్భాషలాడారు. నన్ను చెప్పుతో చెంపదెబ్బ కొట్టారు. ఎందుకు అలా చేశావని అడగ్గా, దానికి ఆమ రైతుల నిరసనలకు మద్దతుగా కొట్టినట్లు సమాధానం ఇచ్చింది' అని కంగనా తెలిపారు. తాను క్షేమంగానే ఉన్నానని, అయితే పంజాబ్‌లో పెరుగుతున్న ఉగ్రవాదాన్ని ఎలా ఎదుర్కోవాలన్నదే తన ఆందోళనని చెప్పారు.కాగా, ఈ విషయాన్ని మొహాలీ జిల్లా పోలీసులు కూడా ధ్రువీకరించారు.

అయితే తమకు ఫిర్యాదు అందలేదని, సిఐఎస్ఎఫ్ తన స్థాయిలో దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కాగా, మహిళా కానిస్టేబుల్‌ను సిఐఎస్ఎఫ్ సస్పెండ్ చేసింది. అలాగే కానిస్టేబుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసే పనిలో ఉన్నామని సిఐఎస్ఎఫ్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు.

పని చేయని మోడీ ప్రచారం

- దేశవ్యాప్తంగా 151 నియోజకవర్గాల్లో ప్రసంగాలు
- ఎన్డీఏ గెలిచింది 85 సీట్లే
- తగ్గిన మోడీ స్ట్రైక్ రేట్
- 56 శాతానికే పరిమితం
- కేరళ, తమిళనాడులో ప్రధాని ప్రభావం శూన్యం
- వెల్లడిస్తున్న గణాంకాలు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా మోడీ మీదనే ఆధారపడిన బీజేపీకి షాకింగ్ ఫలితాలు వచ్చాయి. గతంతో పోల్చుకుంటే ఎంపీ స్థానాలు 303 నుంచి 240 వరకు పడిపోయాయి. దీంతో కేంద్రంలో స్వంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక చతికలపడిపోయింది. ఫలితంగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మిత్రపక్షాల అవసరం మోడీకి అనివార్యమైంది. దీనిని బట్టి చూస్తే మోడీ ప్రచారం బీజేపీకి కలిసిరాలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పలు నియోజకవర్గాల్లో మోడీ పర్యటించి, సభలు, సమావేశాలు నిర్వహించినా.. ఫలితాలు ఆశించినంతగా రాలేదని ఎన్నికల ఫలితాలను రాజకీయ విశ్లేషకులు చూపెడుతున్నారు. మార్చి 31 నుంచి మే 30 మధ్య.. మోడీ దేశవ్యాప్తంగా 151 నియోజకవర్గాలలో బహిరంగ సభలు నిర్వహించారు. వీటిలో ఎన్డీఏ 85 స్థానాల్లో విజయం సాధించింది. 66 నియోజకవర్గాల్లో ఓటమిని చవి చూసింది. అంటే.. కాషాయకూటమి తరఫున మోడీ స్ట్రైక్ రేట్ 56 శాతం(గెలిచిన సీట్లు)గా ఉన్నది.

ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో(యూటీ) పర్యటించారు. ఆయన 66 నియోజకవర్గాల్లో.. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి తరఫున ప్రచారం చేశారు. అయితే, ఇండియా కూటమి 32 స్థానాల్లో విజయం సాధించింది. అంటే.. 48 శాతం సీట్లను ఇండియా కూటమి నెగ్గగలిగింది. అయితే, కాంగ్రెస్ తన లోక్‌సభ స్థానాలను బీజేపీ కంటే ఎక్కువ మెజార్టీతో గెలుచుకోవటం విశేషం.

2019 ఎన్నికలతో పోలిస్తే మోడీకి స్ట్రైక్ రేట్ ఈ సారి తగ్గింది. గత లోక్‌సభ ఎన్నికల్లో.. ప్రధాని మోడీ 103 నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించగా.. ఎన్డీఏ 17 స్థానాల్లో మాత్రమే ఓడిపోయింది. స్ట్రైక్ రేట్ 85 శాతంగా ఉన్నది.

పెద్ద ఎదురుదెబ్బలు

మహారాష్ట్ర, యూపీ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, కేరళ, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో మోడీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, 2014 నుంచి పదేండ్ల పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉన్న యూపీలో.. ఈ సారి మోడీ అత్యధిక బహిరంగ సభలను నిర్వహించారు. 23 నియోజకవర్గాల్లో ఆయన తిరిగితే.. దక్కింది కేవలం 10. అంటే, 13 స్థానాల్లో కాషాయకూటమి ఓటమిని మూటగట్టుకున్నది. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ప్రచారం చేసిన స్థానాల్లో ఆరింటిని మాత్రమే కాషాయకూటమి పోగొట్టుకున్నది. ఈ సారి ఎన్నికల్లో మోడీ ప్రచారం చేసిన స్థానాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లను కోల్పోవటం కాషాయపార్టీకి మింగుడుపడటంలేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఇక యూపీ తర్వాత.. పశ్చిమ బెంగాల్‌కు మోడీ ప్రాధాన్యతనిచ్చారు. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాలలో 19 బహిరంగ సభలు నిర్వహించాడు. అయితే వాటిలో 12 స్థానాలలో బీజేపీ ఓడిపోయింది. మహారాష్ట్రలో ప్రధాని బహిరంగ సభలు నిర్వహించిన 18 నియోజకవర్గాల్లో 14 స్థానాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఓడిపోయింది. రాజస్థాన్‌లో మోడీ బహిరంగ సభలు నిర్వహించిన ఎనిమిది నియోజకవర్గాల్లో మూడు స్థానాల్లో మాత్రమే బీజేపీ కూటమి విజయం సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీఏ క్లీన్ స్వీప్ చేసిన సమయంలో.. మోడీ రాష్ట్రంలో ఐదు బహిరంగ సభలు నిర్వహించారు.

పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి బీజేపీ కూటమికి మరొక ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల సీజన్‌లో మోడీ ఈ రెండు రాష్ట్రాలలో మూడు చొప్పున బహిరంగ సభలు నిర్వహించారు. అయితే అందులో ఐదు నియోజకవర్గాల్లో కూటమి ఓడిపోయింది. కేరళ, తమిళనాడులో.. ఐదు సమావేశాలు జరిగినప్పటికీ మోడీ స్ట్రైక్ రేట్ సున్నాగా ఉన్నది. తెలంగాణలో మోడీ ర్యాలీ నిర్వహించిన ఐదు నియోజకవర్గాల్లో మూడింటిలో ఎన్డీఏ ఓడిపోయింది.


ఇతర రాష్ట్రాల్లో ఇలా..

బీహార్ (13), కర్నాటక (8)లలో మోడీ పర్యటించగా.. నాలుగింటిలో ఎన్డీఏ ఓటమి చెందింది.స్వంత రాష్ట్రం గుజరాత్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ సాధించలేకపోయింది. ఇక్కడ ఆరు బహిరంగ సభలు జరిగినప్పటికీ బీజేపీ బనస్కాంతలో ఓడిపోయింది.

రాహుల్ గాంధీ దృష్టి సారించిన ప్రాంతాలు

రాహుల్ గాంధీ బహిరంగ సభల్లో ఎక్కువ భాగం ఆయన పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఆరు రాయ్‌బరేలీలో, రెండు వాయనాడ్‌లో జరిగాయి. రెండింటిలోనూ భారీ మెజార్టీతో ఆయన విజయం సాధించాడు. యూపీలో, రాహుల్ గాంధీ బహిరంగ సభలు నిర్వహించిన 14 సెగ్మెంట్లలో ఆరింటిలో ఇండియా కూటమి ఓడిపోయింది. కేరళలో ఏడు నియోజకవర్గాల్లో ఏడు బహిరంగ సభలు నిర్వహించగా.. ఆయన పార్టీ కొట్టాయంలో కేరళ కాంగ్రెస్ చేతిలో ఓడిపోయింది. మోడీతో పోలిస్తే రాహుల్ గాంధీకి వంద శాతం స్ట్రైక్‌రేట్ ఉన్న రాష్ట్రాలు పంజాబ్, జార్ఖండ్‌లు కావటం గమనార్హం. ఇక 130 నియోజకవర్గాలను కలిగి ఉన్న బీహార్, మహారాష్ట్ర, కర్నాటక వంటి రాష్ట్రాలలో రాహుల్ గాంధీ 14 సెగ్మెంట్లలో బహిరంగ సభలు నిర్వహించారు. వీటిలో ఆరింటిలో ఇండియా కూటమి ఓడిపోయింది. ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ నాయకుడి ట్రాక్ రికార్డ్ అధ్వాన్నంగా ఉన్నది. అక్కడ రాహుల్ అనేక నియోజకవర్గాలలో 14 బహిరంగ సభలు నిర్వహించాడు. కానీ ఇండియా కూటమి ఒక్కటి కూడా గెలవకపోవటం గమనార్హం.

నువ్వా.. నేనా..?



పార్టీ	గెలుపొందిన సీట్లు
బీజేపీ	240
కాంగ్రెస్	99
ఎస్పీ	37
ఏఐటీసీ	29
డీఎంకే	22
టీడీపీ	16
జేడీ(యూ)	12
ఎస్ఎస్(యూబీటీ)	9
ఎన్‌సీపీ (ఎస్పీ)	8
ఇతరులు	71

- సంకీర్ణం దిశగా సాగిన పోలింగ్
- ఏడు దశల్లో ఏన్డీయే, ఇండియా బ్లాక్‌కు వచ్చిన సీట్లు ఇలా...

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికలు దేశచరిత్రలోనే సుదీర్ఘంగా (ఏడు విడతలు) జరిగాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్డీఏకు దీటుగా ఈ సారి ఇండియా నిలిచింది. మొదటి, చివరి దశ ఓటింగ్‌కు మధ్య 44 రోజుల విరామం.. తర్వాత ఫలితాలు వెల్లడయ్యాయి. మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19న నిర్వహించగా, చివరి దశ ఓటింగ్ జూన్ 1తో ముగిసింది. ఈ దశల్లో మొత్తం 64.2 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఏప దశలో ఎన్డీఏ, ఇండియా ఎన్ని సీట్లు సాధించాయో తెలుసుకుందాం!

- **మొదటి దశలో...** ఏప్రిల్ 19న 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే ఈ దశ, రెండో దశలో ఇన్నర్ మణిపూర్ స్థానానికి ఓటింగ్ జరిగింది. దీంతో 101 స్థానాల్లో మాత్రమే ఓటింగ్ పూర్తయింది. ఈ 101 సీట్లలో ఎన్డీఏ 33 సీట్లు గెలుచుకోగా, ఇండియా బ్లాక్ 64 సీట్లు సాధించుకుంది. ఇతరులకు 4 సీట్లు వచ్చాయి.
- **రెండో దశలో..** ఏప్రిల్ 26న 88 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ దశలో ఎన్డీఏ 53 స్థానాలు, ఇండియా బ్లాక్ 34 స్థానాలను గెలుచుకున్నాయి. ఇతరులు ఒక సీటు మాత్రమే గెలుచుకున్నారు.
- **మూడో దశలో..** మే 7న 94 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇందులో ఎన్డీయే 66 సీట్లు గెలుచుకోగా, ఇండియా బ్లాక్ 26 సీట్లు గెలుచుకుంది. ఇతర పార్టీలు రెండు సీట్లు సాధించాయి.
- **నాల్గో దశలో..** మే 13న 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. వీటిలో 60 సీట్లను ఎన్డీయే గెలుచుకోగా ఇండియా బ్లాక్ 31 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇతర పార్టీలు ఐదు స్థానాల్లో విజయం సాధించాయి.
- **ఐదో దశలో..** మే 20న 49 స్థానాలకు పోలింగ్ జరిగింది. వీటిలో ఎన్డీయే 23 సీట్లు ,ఇండియా బ్లాక్ 24 సీట్లు గెలుచుకుంది. ఇతరులకు రెండు సీట్లు వచ్చాయి.
- **ఆరో దశలో..** మే 25న 58 స్థానాలకు పోలింగ్ జరిగింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 37 సీట్లు, కాంగ్రెస్ నేతృత్వంలోని భారత్ 21 సీట్లు గెలుచుకున్నాయి. ఈ దశలో ఈ రెండు మినహా మరే పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది.
- **ఏడో దశలో..** చివరి దశలో జూన్ 1న 57 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ దశలో ఎన్డీయే 20 సీట్లు గెలుచుకోగా, ఇండియా బ్లాక్ 34 సీట్లు గెలుచుకుంది. ఇతర పార్టీలకు మూడు సీట్లు వచ్చాయి.

2024 ఎన్నికల ఫలితాల ముఖ్యాంశాలు

అతి స్వల్ప విజయం
శివసేన (షిండే వర్గం) అభ్యర్థి రవీంద్ర వైకర్ ఈ ఎన్నికల్లో అతి తక్కువ తేడాతో విజయం సాధించారు. మహారాష్ట్రలోని ముంబై నార్త్-వెస్ట్ స్థానం నుంచి శివసేన (ఠాక్రే వర్గం) అభ్యర్థి అమోల్ గజానన్ కీర్తికర్‌పై 48 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

అతిపెద్ద విజయం
ఇండోర్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి శంకర్ లాల్వానీ 11,75,092 ఓట్ల తేడాతో భారీ విజయం సాధించారు. అతని తర్వాత, అసోంలోని ధుబ్రి స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రకీబుల్ హసన్ రెండవ అతిపెద్ద విజయం సాధించారు. అతను ఏఐయూడీఎఫ్‌కు చెందిన బద్రుద్దీన్ అజంను 10,12,476 ఓట్ల తేడాతో ఓడించాడు.

రిజర్వ్‌డ్ స్థానాలపై విజయం
లోక్‌సభలోని 543 సీట్లలో 156 షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) రిజర్వ్ చేయబడ్డాయి. ఇందులో ఎన్డీయే 58, భారత్ 93 గెలుచుకున్నాయి. అదే సమయంలో, షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) రిజర్వ్ చేయబడిన 68 సీట్లలో, ఎన్డీఏ 45 , భారత్ 18 స్థానాలను గెలుచుకుంది.

ఏ ప్రాంతంలో ఎవరిది గెలుపు..
తూర్పున 142 సీట్లలో, ఎన్డీఏ 86, ఇండియా 52 సీట్లు గెలుచుకుంది. నార్త్‌లోని 126 సీట్లలో ఎన్‌డిఎ 59, ఇండియా 61 సీట్లు గెలుచుకున్నాయి. దక్షిణాదిలో 131 సీట్లలో ఎన్‌డీఏ 50 సీట్లు, భారత్ 76 సీట్లు గెలుచుకున్నాయి. పశ్చిమాన ఉన్న 143 సీట్లలో 97 సీట్లు ఎన్డీఏకి, 44 సీట్లు భారత్‌కు వచ్చాయి.

మన ఎంపీలు చదువులో వెనుకే..

- 19 శాతం మంది 5 నుంచి 12వ తరగతి వరకే..
- ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు..



న్యూఢిల్లీ : తాజా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు చదువులో వెనుకంజలో ఉన్నారు. కొంతమంది నిరక్షరాస్యులు కూడా ఉన్నా, వారు గెలవలేదు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఈ తరహా అభ్యర్థుల సంఖ్య తగ్గిందనే చెప్పవచ్చు. ఎక్కువ మంది డిగ్రీ, ఆపై అర్హత కలిగినవారున్నారు. న్యాయవాదులు, డాక్టరేట్లు చదివిన వారున్నారు. కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయమే వృత్తిగా ఉన్నవారు కూడా ఉన్నట్లు తేలింది.

ఏడీఆర్ నివేదిక ప్రకారం... 18వ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో 19 శాతం (105 మంది) విజేతల విద్యా అర్హతలు 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకే. 77 శాతం (420 మంది) డిగ్రీ లేదా అంతకంటే పై చదువులు చదివిన వారు కూడా ఉన్నారట. పదిహేడు మంది డిప్లొమా హోల్డర్లు, ఒకరు చదువుకోలేదని తెలిపింది. నిరక్షరాస్యులుగా ప్రకటించుకున్న 121 మంది అభ్యర్థులు ఎన్నికల్లో ఓడిపోయారు. 5వ తరగతి వరకు చదువుకున్న వారు ఇద్దరు విజేతలు కాగా, నలుగురు 8వ తరగతి వరకు, 34 మంది 10వ తరగతి, 65 మంది 12వ తరగతి వరకు చదువుకున్నారు.

థింక్ ట్యాంక్ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ చేసిన మరో విశ్లేషణ ప్రకారం.. 543 మంది ఎంపీలలో వ్యవసాయం, సామాజిక సేవలు వృత్తులుగా ఉన్నవారు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి 91 శాతం, మధ్యప్రదేశ్ నుంచి 72 శాతం, గుజరాత్ నుంచి 65 శాతం మంది ఎంపీలు వ్యవసాయం వృత్తిగా ఉన్నవారున్నారు. ఈ లోక్‌సభకు ఎన్నికైన ఎంపీలలో 7 శాతం మంది న్యాయవాదులు, 4 శాతం మంది వైద్యులు ఉన్నారు.

అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు కలిగిన ఎంపీల శాతం 1 వ లోక్‌సభ నుంచి 11వ లోక్‌సభ (1996-98) వరకు క్రమంగా పెరిగింది. దీంతో పాటు కాలేజీ విద్య లేని ఎంపీల శాతం కూడా పెరిగింది. అయితే, ఈ సంఖ్య 17వ లోక్ సభలో 27 శాతం నుంచి 18వ లోక్ సభలో 22 శాతానికి తగ్గిందని ఈ నివేదిక తెలిపింది. ముగ్గురు మహిళలు సహా 5 శాతం మంది ఎంపీలు డాక్టరేట్ డిగ్రీలు కలిగి ఉన్నారని తేలింది. 8,390 మంది అభ్యర్థుల్లో 121 మంది నిరక్షరాస్యులుగా, 359 మంది 5వ తరగతి వరకు చదువుకున్నట్లు ప్రకటించారు.

అధికారిక సమాచారం ప్రకారం, 647 మంది అభ్యర్థులు 8 వ తరగతి వరకు తాము చదివామని నివేదించారు. మొత్తం 1,303 మంది అభ్యర్థులు పాఠశాల విద్యను పూర్తి చేసినట్టు ప్రకటించారు. 1,502 మంది అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తయిందని ప్రకటించారు. డాక్టరేట్ విద్యనభ్యసించిన వారు 198 మంది అభ్యర్థులు ఉన్నారు.

మడతపెట్టి...

- బీజేపీకి తలసరి ఆదాయం దెబ్బ
- అల్పాదాయ రాష్ట్రాల్లో తగ్గిన ఓట్లు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని.. అభివృద్ధిలో వెనక్కి తిరిగి చూసేది లేదని ప్రధాని నరేంద్ర మోడీ పదేపదే చేసిన ప్రకటనలు అల్పాదాయం కలిగిన ప్రాంతాల్లో ఆ పార్టీకి సెగ పెట్టాయి. తలసరి ఆదాయాలు తగ్గిన రాష్ట్రాల్లో బీజేపీకి భారీగా ఓట్లు తగ్గాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో బీజేపీ ఓట్ల శాతానికి గండి పడింది. 2019 లోక్‌సభ ఎన్నికల నుంచి తలసరి ఆదాయంలో తక్కువ వృద్ధి రేటును కలిగి ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి నష్టం జరిగిందని ఆంగ్ల మీడియాలో రిపోర్టులు వచ్చాయి. భారత ఎన్నికల సంఘం డేటా, రాష్ట్రాల నుండి తలసరి నికర రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (ఎన్ఎస్‌డీపీ) డేటాతో పోల్చినప్పుడు పలు ఆశ్చర్యకర అంశాలు వెల్లడయ్యాయి.

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ పోటీ చేసిన చోట ఆ పార్టీకి తొమ్మిది శాతం ఓట్లు తగ్గాయి. ముఖ్యంగా బీహార్, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, చండీగఢ్, కేరళ, సిక్కిం, అండమాన్ అండ్ నికోబర్ ఐలాండ్‌లో ఇది స్పష్టంగా కనబడింది. ప్రతీ ఏడాది తలసరి ఆదాయం పెరుగుదల ఆధారంగా మూడు భాగాలుగా విభజించగా.. ఇందులో 2 శాతం లోపు, మధ్యస్థంగా 2.1-4 శాతం, 4 శాతం ఎగువన నమోదయిన రాష్ట్రాలను పరిశీలనకు తీసుకున్నారు. కాగా కొన్ని రాష్ట్రాలు 2023-24కు సంబంధించిన ఎన్ఎస్‌డీపీని లెక్కించలేదు. కాగా 2018-19 నుంచి 2022-23 నాటి తలసరి ఆదాయాలను విశ్లేషించగా.. తక్కువ ఆదాయాలు కలిగిన చోట బీజేపీకి భారీ నష్టమే జరిగింది.'లసరి ఆదాయం 2 శాతం దిగువన ఉన్న హర్యానాలో బీజేపీకి ఓటింగ్ 12.1 శాతం తగ్గింది. జార్ఖండ్‌లో 7 శాతం, ఉత్తరాఖండ్‌లో 4.9 శాతం, బీహార్‌లో 3.6 శాతం, ఢిల్లీలో 2.5 శాతం, మహారాష్ట్రలో 1.6 శాతం చొప్పున బీజేపీ ఓట్లకు ఎసరు పడింది. కాగా 2.1-4 శాతం మధ్య తలసరి ఆదాయం పెరిగిన తెలంగాణలో 15.4 శాతం, పంజాబ్‌లో 8.9 శాతం, మిజోరంలో 1 శాతం చొప్పున ఓట్లు పెరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో 1.9 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 8.6 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 13.3 శాతం చొప్పున ఓట్లు తగ్గాయి. తలసరి ఆదాయం 4 శాతం ఎగువన పెరిగిన ఆంధ్రప్రదేశ్‌లో 10.3 శాతం, తమిళనాడులో 7.6 శాతం, ఒడిస్సాలో 6.4 శాతం చొప్పున ఓట్లు పెరగ్గా.. గుజరాత్‌లో 1.2 శాతం, కర్నాటకలో 5.6 శాతం, రాజస్థాన్‌లో 9.9 శాతం, అరుణచల్ ప్రదేశ్‌లో 10 శాతం చొప్పున తగ్గాయి. తలసరి ఎన్ఎస్‌డీపీ వృద్ధి రేటు 4 శాతానికి పైగా ఉన్న తొమ్మిది రాష్ట్రాల్లో ఓట్ల వాటా పెరిగింది. గుజరాత్, రాజస్థాన్, కర్నాటక, అరుణాచల్ ప్రదేశ్, వాటి తలసరి ఆదాయంలో అధిక వద్ధి రేటు ఉన్నప్పటికీ బీజేపీ ఓట్ల వాటాలో తగ్గుదల కనిపించింది. స్థూలంగా ఆర్థికంగా వెనుకబడిన లేదా గడిచిన ఐదేండ్లలో తలసరి ఆదాయాలు అంతంత మాత్రమే పెరిగిన చోట బీజేపీకి గట్టి దెబ్బనే తగిలిందని స్పష్టమవుతోంది.

దేశ చరిత్రలోనే అత్యంత ద్వేషపూరిత ప్రసంగాలు

లోక్‌సభ ఎన్నికల్లో ఇదీ మోడీ తీరు
అయినా పని చేయని ప్రధాని ప్రచారం

కాషాయ కూటమిని నమ్మని ప్రజలు
ఆశించిన స్థాయిలో దక్కని సీట్లు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లతో కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటమే లక్ష్యంగా మోడీ ప్రచారపర్వంలోకి దిగారు. తొలి దశలో 'చార్ సౌ పార్' నినాదాన్ని ప్రతి ఎన్నికల సభలోనూ వినిపించారు. అయితే, ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించకపోవటంతో మోడీ కొత్త నినాదాన్ని ఎత్తుకున్నారు. అవే, విద్వేషపూరిత మత రాజకీయాలు. వాస్తవానికి, మత రాజకీయాలు మోడీకి కొత్తేమీ కాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నుంచి మొన్నిటి ఎన్నికల ప్రచారం వరకు ఆయనలో ఈ మత విద్వేషం నిండుకొని ఉన్నదని రాజకీయ విమర్శకులు అంటున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలోనూ ఆయన ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారనీ, అయితే ఆ ప్రచారం మోడీకి ఎదురు దెబ్బ తగిలేలా చేసిందని వారు చెప్తున్నారు.

ఏప్రిల్ 21 న రాజస్థాన్‌లోని బన్స్వారాలో కాంగ్రెస్ ఒక మతానికి అనుకూలంగా వ్యవహరిస్తుందని మోడీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టించాయని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందూ మహిళల మంగళసూత్రాలను లాక్కొని వేరొక వర్గం వారికి అప్పగించడం ద్వారా సంపద ఈక్విటీ ఆలోచనలను అమలు చేస్తుందని ఆ సమయంలో ప్రధాని ఆరోపించారు. మోడీ చెప్పింది నిజం కానప్పటికీ (కాంగ్రెస్ స్పష్టంగా అలాంటి వాగ్దానమేమీ చేయలేదు).. హిందూ మహిళ వివాహానికి సంబంధించిన భావోద్వేగ చిహ్నాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని వారు అంటున్నారు. అంతే కాదు. మోడీ సదరు వర్గాన్ని "చొరబాటుదారులు", "ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్నవారు" అని కూడా అభివర్ణించటం విదితమే. అయితే, మోడీ ఈ విధంగా చేసిన విద్వేష ప్రసంగాలు మాత్రం ఏ మాత్రమూ పని చేయలేదనీ, ఓటర్లను అంతగా ప్రభావితం చేయలేదని మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాలను చూస్తే అర్థమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. విద్వేష ప్రసంగం చేసిన రాజస్థాన్‌లోని బన్స్వారాలో బీజేపీ ఘోరంగా ఓడిపోయిందనీ, విజేత కంటే 2.5 లక్షల ఓట్ల తేడాతో వెనుకబడి ఉన్నదని ఎన్నికల గణాంకాలను విశ్లేషకులు చెప్తున్నారు. "మోడీ పాలనలో దశాబ్ద కాలంగా బీజేపీ తన హిందుత్వ భావజాలాన్ని పదునైన ఎన్నికల సాధనంగా ఉపయోగించుకున్నది. ఈ సాధనంతో భారత్‌లోని అత్యంత పేద, అత్యంత దుర్బలమైన సమూహాలలో ఒకటైన ఒక వర్గాన్ని మోసగించింది. నైతికంగా ఇలాంటి రాజకీయాలు అసహ్యకరమైనప్పటికీ.. కొన్ని సందర్భాలలో బీజేపీకి ఓట్లను రాల్చాయి. కానీ బన్స్వారా లాంటి ప్రాంతాల్లో మాత్రం ఫలితాలు షాకిచ్చాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన లౌకిక భారతదేశంలో.. అత్యంత మతపరమైన ఎన్నికల ప్రచారాన్ని మోడీ నిర్వహించటం దురదృష్టకరం. అయితే, ఈ ప్రచారంతో బీజేపీకి సీట్లు భారీగానే తగ్గాయి" అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

"భారత్‌లోని అనేక ప్రాంతాలలో హిందుత్వానికి శక్తివంతమైన ఆకర్షణ ఉందనడంలో సందేహం లేదు. కొంత వరకు ఇది బీజేపీకి ముందే ఉన్న ఆలోచన. బీజేపీ హిందుత్వ సెంటిమెంట్‌ను రగిల్చినపుడు, భారత్‌లోని ఓటర్లలో ఒక ముఖ్యమైన వర్గం కాషాయపార్టీకి అనుకూలంగా మారిపోతుంది. సమస్యలు మాత్రం మూలకు పడిపోతాయి. ప్రభుత్వం ఏమి చేసింది అన్న ప్రశ్నలు ఉత్పన్నం కావు. అజెండా మొత్తం హిందూత్వనే అవుతుంది. అయితే, ఈ ఎన్నికలలో మోడీ చేసిన మతతత్వ ప్రకటనలను కనీసం ఈ వర్గమైనా హర్షించి ఉండకపోవచ్చు" అని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

జీవనోపాధి దేవాలయాలు

యూపీలోని అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని బీజేపీ ఎక్కువగా ప్రచారం చేసుకున్నది. ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో అయోధ్య భాగమై ఉన్నది. ఈ ఏడాది జనవరిలో మోడీ ఆలయాన్ని ప్రారంభించాడు. దీనికి సంబంధించి మీడియాలో విపరీత ప్రచారం జరిగింది. అయితే, సదరు నియోజకవర్గాన్నే బీజేపీ కోల్పోవటం గమనార్హం. ఫైజాబాద్‌లో చాలా మంది దళితుల ఓట్లు రామ మందిరంపై కాకుండా కూడు, గూడు, గుడ్డ వంటి ఇతర సమస్యలపై ఆధారపడి ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్-లోకినితి థింక్‌ట్యాంక్ ముందస్తు ఎన్నికల సర్వేలో కేవలం 8 శాతం మంది ఓటర్లు అయోధ్యలోని కొత్త ఆలయాన్ని తమ ప్రాథమిక సమస్యగా చెప్పారు. అయితే, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించే వారు ప్రధానంగా ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగలేదని ప్రజలు చెప్తున్నారు. ఈ విషయంలో మోడీ సర్కారు విఫలమైంటున్నారని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు.

కొత్తగా ఎన్నికైన ఎంపీల్లో 46 శాతం మందిపై క్రిమినల్ కేసులు

- అందులో 170 మందిపై తీవ్ర నేరం కేసులు
- 27 మంది దోషులు : ఏడీఆర్ వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికైన 543 మంది ఎంపీల్లో సుమారు 46 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడిఆర్) స్పష్టం చేసింది. అంటే దాదాపు 251 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. దీంట్లో 27 మంది దోషులుగా ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. దిగువ సభకు ఎన్నికైన అభ్యర్థుల్లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు ఉన్నవారు నమోదు కావడం ఇదే మొదటిసారి. 233 మంది ఎంపీలు తమపై కేసులు ఉన్నట్లు ప్రకటించారు. అయితే 2014లో 185 మంది, 2009లో 162 మంది, 2004లో 125 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. 2009 నుంచి క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల సంఖ్య 55 శాతం పెరిగినట్లు ఆ సంస్థ డేటా పేర్కొంది.

ఈ ఏడాది గెలిచిన 251 మందిలో 170 మంది ఎంపీలపై తీవ్రమైన నేరం కేసులు ఉన్నాయి. హత్య, హత్యాయత్నం, లైంగికదాడులు, కిడ్నాప్, మహిళలపై నేరాలు ఉన్నట్లు ఎడిఆర్ తెలిపింది. 2019లో 159 మంది ఎంపీలపై ఆ కేసులు ఉండేవి. 2009 నుంచి సీరియస్ క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల సంఖ్య 124 శాతానికి పెరిగినట్లు ఎడిఆర్ తన నివేదికలో తెలిపింది. 27 మంది ఎంపీలు తమపై ఉన్న క్రిమినల్ కేసుల నుంచి నిర్దోషులుగా తేలినట్లు ప్రకటించారు. ఐపీసీలోని సెక్షన్ 302 కింద మర్డర్ కేసు బుక్ అయినట్లు నలుగురు ఎంపీలు పేర్కొన్నారు. ఐపీసీలోని 307 సెక్షన్ కింద 27 హత్యాయత్నం కేసులు ఉన్నట్లు తెలిపారు.

మహిళలపై నేరాలకు పాల్పడిన వారు 15 మంది ఉన్నారు. ఇద్దరిపై ఐపీసీ 376 సెక్షన్ కింద అత్యాచార ఆరోపణలు ఉన్నాయి. నలుగురిపై కిడ్నాప్ కేసులు, విద్వేష ప్రసంగాలకు చెందిన 43 కేసులు ఉన్నట్లు ఎడిఆర్ తెలిపింది. 2024 ఎన్నికల్లో క్రిమినల్ కేసులు ఉన్న వారిలో నెగ్గిన శాతం 15.3 శాతంగా ఉన్నట్లు తెలుస్తోంది.

తాజా ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన ఆ పార్టీలో 94 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 99 సీట్లు గెలిచిన కాంగ్రెస్‌లో 49 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ తెలిపింది. 37 సీట్లు గెలిచిన ఎస్పీలో 21 మందిపై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి.

తృణమూల్, డీఎంకే పార్టీల్లో 13 శాతం నేరస్తులు, టీడీపీలో 8 శాతం నేరస్తులు, శివసేనలో ఐదు శాతం క్రిమినల్ కేసులు ఉన్న నేతలు ఉన్నట్లు ఎడిఆర్ పేర్కొంది. బీజేపీకి చెందిన 63 మంది, కాంగ్రెస్‌కు చెందిన 32 మంది, ఎస్పీకి చెందిన 17 మందిపై సీరియస్ క్రిమినల్ కేసులు ఉన్నాయి.

నవతెలంగాణ

పుస్తకాలు దీపాలవంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది - డా॥ బి.ఆర్.అంబేద్కర్

దెబ్బకు దెబ్బ అంటున్న పుతిన్!

సంపాదకీయం

తమ భూభాగాలపై దాడులు చేసేందుకు పశ్చిమ దేశాలు ఆయుధాలను ఇస్తే వాటిపై దాడులకు తాము కూడా ఇతరులకు అస్త్రాలను అందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ హెచ్చరించాడు. తామిచ్చిన ఆయుధాలను ఆత్మరక్షణతో పాటు రష్యా మీద ఎదురుదాడులు చేసేందుకు సైతం వినియోగించుకోవచ్చని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు పవర్ పట్టా ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ సంక్షోభంలో పశ్చిమదేశాల కారణంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో కరీబియన్ ప్రాంతంలో మిలిటరీ విన్యాసాలు జరిపేందుకు రష్యా వైమానిక, నౌకా దళం వెళుతున్నట్లు అమెరికా అధికారులు చెప్పారు.పశ్చిమ దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిన ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ తమ పౌరులను అష్టకష్టాలకు గురిచేస్తున్నాడు. పశ్చిమదేశాల కుట్రను తమ భూభాగం మీద సాగనివ్వను అనే ఒక్క హామీని ఇచ్చి ఉంటే రష్యా మిలిటరీ చర్య అసలు జరిగి ఉండేదే కాదు. శాంతి సభ పేరుతో ఉక్రెయిన్‌కు మద్దతుగా పశ్చిమ దేశాల తలపెట్టిన సమావేశాన్ని దెబ్బతీసేందుకు రష్యాకు సాయం చేస్తున్నట్లు జెలెన్‌స్కీ చైనా మీద ఆరోపణలకు దిగటం అర్థరహితం. తమ సార్వభౌమత్వానికే ముప్పు తలెత్తితే అణ్వాయుధాలను ఉపయోగించేందుకు కూడా వెనుకాడబోమని, నాటో కూటమి దేశాలపై దాడులకు వీలుగా తమ దగ్గర ఉన్న దీర్ఘశ్రేణి ఆయుధాలను ఇతర దేశాలకు అందచేస్తామని సెంట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థికవేదిక వార్షిక సమావేశాల సందర్భంగా ప్రతినిధులతో పుతిన్ చెప్పాడు.

పశ్చిమ దేశాల ఇటీవలి చర్యలు ఉక్రెయిన్ పోరులో ప్రత్యక్షంగా పాల్గొనటమేనని, అదే పద్ధతిలో వ్యవహరించే హక్కును తాము అట్టిపెట్టుకుంటామని అన్నాడు. అమెరికా జనాలు ఎవరిని ఎన్నుకున్నా వారితో కలిసిపనిచేస్తామని, ఎన్నికల తరువాత ఏదో మార్పు వస్తుందని తాము అనుకోవటం లేదన్నాడు. ఉక్రెయిన్ వద్ద 1,300 మంది తమ సైనికులు బందీలుగా ఉంటే తమ వద్ద 6,400 వారి మిలిటరీ సిబ్బంది ఉన్నట్లు పుతిన్ చెప్పాడు. కరీబియన్ ప్రాంతానికి వెళుతున్న రష్యా నౌకాదళం క్యూబా, వెనెజులా రేవుల్లో లంగరు వేయవచ్చని భావిస్తున్నట్లు అమెరికా అధికారులు చెప్పారు.ఈ ప్రాంతంలో విన్యాసాలు జరపటం రష్యాకు కొత్త కాదని అయితే, ఉక్రెయిన్‌కు అమెరికా ఇస్తున్న మద్దతుకు ప్రతిగా, తమ నౌకాదళం సత్తా ఏమాత్రం తగ్గలేదని లోకానికి వెల్లడించేందుకు విన్యాసాలను తలపెట్టినట్లు అమెరికా భావిస్తున్నది. మూడో వంతు నల్లసముద్ర రష్యా నౌకలను నాశనం చేసినట్లు గతంలో ఉక్రెయిన్ చెప్పుకున్నది. అంతర్జాతీయ దళాల్లో అనేక దేశాలు మిలిటరీ విన్యాసాలు జరుపుతున్నాయి. వాటికి ఆ ప్రాంత దేశాల అనుమతులు లేదా భాగస్వామ్యంతో నిమిత్తం లేదు. బాల్‌టాప్స్ పేరుతో రష్యా ముంగిట బాల్టిక్ సముద్రంలో 1971 నుంచి అమెరికాతో సహా నాటో దేశాలు ప్రతిఏటా తమ బలాన్ని వెల్లడించేందుకు విన్యాసాలు జరుపుతున్నాయి.ఈనెల 7 నుంచి 20వరకు అమెరికా సప్తమనౌకా దళంతో అనేక దేశాలు భాగస్వాములు కానున్నాయి.

పశ్చిమదేశాలు పంపే ఆయుధాలతో పాటు వాటి వినియోగంపై శిక్షణకు ఎవరినైనా పంపితే ఎవరికీ మినహాయింపు ఉండదని వారు ఫ్రెంచి వారు మరొకరు ఎవరైనా కావచ్చు, వారి మీద దాడులు జరుపుతామని రష్యా హెచ్చరించింది. త్వరలో ఫ్రాన్సు నుంచి శిక్షకులు తమదేశానికి రానున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించిన పూర్వరంగం, బ్రిటన్ వెయ్యి డ్రోన్లను పంపుతున్న సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. బహిరంగంగా వెల్లడించనప్పటికీ ఇప్పటికే కొన్ని దేశాల నుంచి వచ్చిన వారు రహస్యంగా శిక్షణ ఇస్తున్నట్లు గతంలోనే వార్తలు వెలువడ్డాయి. అవసరమైతే తమ మిలిటరీని పంపుతామని ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ గతంలో ప్రకటించాడు. ఇప్పటికే అమెరికా నుంచి వచ్చిన ఆయుధాలను తమ సరిహద్దుకు అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యా నగరం బెల్‌గోరోడ్ మీద ఉక్రెయిన్ ప్రయోగించినట్లు వార్తలు వచ్చాయి.ఉక్రెయిన్ ఏ రోజు ఏ లక్ష్యాల మీద దాడులు చేసేదీ ప్రతిరోజూ తమకెలా తెలుస్తుందని, అసలు తామిచ్చిన వాటిని ఉపయోగించిందీ లేనిదీ కూడా తమకు తెలియదని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ అమాయకత్వం నటించాడు.పాలస్తీనా ప్రాంతమైన గాజాలో సాధారణ పౌరులపై మారణకాండ జరుపుతున్న దుష్ట ఇజ్రాయిల్‌ను నిస్సిగ్గుగా సమర్ధిస్తున్న అమెరికా ఇంతకంటే వేరే విధంగా ప్రవర్తిస్తుందని ఎలా అనుకోగలం?



ఉక్రెయిన్ ఏ రోజు ఏ లక్ష్యాల మీద దాడులు చేసేదీ ప్రతిరోజూ తమకెలా తెలుస్తుందని, అసలు తామిచ్చిన వాటిని ఉపయోగించిందీ లేనిదీ కూడా తమకు తెలియదని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ అమాయకత్వం నటించాడు.పాలస్తీనా ప్రాంతమైన గాజాలో సాధారణ పౌరులపై మారణకాండ జరుపుతున్న దుష్ట ఇజ్రాయిల్‌ను నిస్సిగ్గుగా సమర్ధిస్తున్న అమెరికా ఇంతకంటే వేరే విధంగా ప్రవర్తిస్తుందని ఎలా అనుకోగలం?

మోడీ హ్యాట్రిక్కులు... ఇండియా సవాలు


తెలకపల్లి రవి

'భారత దేశానికి మరోసారి ప్రజాస్వామ్యంలోకి పాస్‌పోర్టు లభించింది' అని ఒక ఇంగ్లీషు పత్రికా సంపాదకులు రాసిన మాట 2024 ఎన్నికల తీర్పుకు పూర్తిగా వర్తిస్తుంది. ఒక విధంగా దేశంలో ప్రజాస్వామి కంగా ఆలోచించే వారందరి మనోభావనను ప్రతిబింబిస్తుంది. కార్పొరేట్ కాషాయ కూటమి కుటిల ప్రచారాలను ప్రచారార్భాటాలను తోసి పుచ్చి లౌకిక ప్రజాస్వామిక భారతం నిలదొక్కుకుంది. ఈ విజయం సంపూర్ణ మైంది కాకపోవచ్చు గాని సుస్పష్టమైంది.క్రికెట్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌లా ఈ ఆటలో 'ఇండియా' వేదిక కీలక స్ఫూర్తిని కలిగించింది. అజేయుడుగా, అప్రతిహత నేతగా చిత్రించబడిన ప్రధాని నరేంద్ర మోడీ మనుగడకోసం ఇతరులపై ఆధారపడ వలసిన స్థితికి తెచ్చింది. ఇది భారత ప్రజల లౌకిక ప్రజాస్వామిక చైతన్యం మాత్రమే.మోడీనే మోసి మోసి అలసిపోయిన బడా మీడియా కలలోనైనా ఊహించలేని ఘట్టమిది. దేశవ్యాపితంగా ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడా చెప్పని స్థాయిలోకి ఆయన్ను ఆయన పార్టీని పడగొట్టిన శక్తులు ప్రజలే. భారత రాజ్యాంగ రక్షణ అనే అంశాన్ని కేంద్రబిందువుగా చేసే బదులు మతత త్వం అధీకృత దురభిమానం, ఏకీకృత కేంద్రం, ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే పన్ను ఒకే రేషను వంటి ఒకే నినాదంతో అనేక వైవిధ్యాలను చాపచుట్టే కుటిల దాడిని నిరోధించిన ఈ తీర్పులో నిజంగా భారత దేశ బహుళత్వమే సుసంపన్న వైవిధ్యమే గోచరిస్తుంది. దేశ చిత్రపటాన్ని మోడీ ముఖచిత్రంగా మార్చేసిన వైపరీత్యానికి తెరదిగింది, బలహీనపడిన మోడీ మళ్లీ అధికారంలోకి అనే శీర్షికలు గెలిచి ఓడిన విశ్వగురుడి పరిస్థితిని ప్రతిబింబించాయి.



నైతిక పరాజయం

సీట్ల అంకెలు ఎలావున్నా ఈ తీర్పు మోడీ నైతిక సైద్ధాంతిక పరాజయం. ఇప్పటికీ కొన్ని సంపాదకీయాలు, కొందరు మేధావులు దీన్ని మోడీకి ఆమోదంగా అదే సమయంలో బలమైన ప్రతిపక్షానికి మద్దతుగా రెండు రకాల చూపించడం హాస్యాస్పదం. ఇవి రెండూ వేర్వేరు కోణాలు. పశ్చిమ దేశాల్లో కొన్ని సంప్రదాయాల ప్రకారమైతే ఓడిపోయిన నేత ముందు వైదొలగాలి. తొలి అవకాశం ప్రతిపక్షానికి ఇచ్చి వారు కాదంటేనే మళ్లీ ఓడిపోయిన వారికివ్వాలి. ఇండియా వేదిక నేతలు మోడీ దిగిపోవాలనీ తమను ముందుగా ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరలేదంటే వాస్తవికతే కారణం. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామనీ వారు ప్రకటించారు. ఫాసిస్టుల పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పుగా దీన్ని పరిగణించాలని, దేశంలో భిన్నత్వాన్ని గుర్తించాలనీ, ప్రజాస్వామిక విలువలను గౌరవించాలని తేల్చిచెప్పారు. పూర్తి సమైక్యతతో సంయుక్త ప్రకటన వ్యాఖ్యలు చేసి ఐక్యత చాటిచెప్పారు. 240 పైగా స్థానాలతో ఇండియా వుంటే 293 స్థానాలు తెచ్చుకున్న ఎన్‌డిఎకు అధికృత వుంది గనక ఇలా చేయడం అర్థం చేసుకోదగిందే. ఇండియాలో 99 స్థానాలతో కాంగ్రెస్ దాదాపు 40 శాతం వుంటే మిగిలిన పార్టీలు అరవైశాతం స్థానాలు కలిగివుండటం దాని బహుళత్వానికి ఉదాహరణ, భౌగోళికంగానూ విభిన్న ప్రాంతాలు ఇందులో వున్నాయి. ఈ విధమైన పరిస్థితి ముందుగా వారు ఊహించలేదంటే ఏకపక్ష దృష్టికోణమే కారణం, వ్యూహకర్తగా కొనియాడబడే ప్రశాంత్‌కిశోర్ కూడా చివరి వరకూ బీజేపీ గతంలో ఉన్న స్థానాలే తెచ్చుకుంటుందనీ, దీనిపై ఇక చర్చలు విశ్లేషణలు దండగమారి వ్యవహారమనీ కొట్టిపారేశారు. మరోవైపున యోగేంద్ర యాదవ్ వదిలిపెట్టిన సెఫాలజీని తిరిగి చేపట్టి బీజేపీ మెజార్టీ కోల్పోతున్నదని ముందే అంచనా వేశారు. రాజ్యాంగం రాష్ట్రాల హక్కులు,లౌకిక తత్వం, రైతాంగ ఉద్యమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు కాకుండా కేవలం వ్యక్తిగతమైన, ఉద్వేగభరితమైన అంశాలే ఓటర్లను నడిపిస్తాయనే అంచనాతో ఊదరగొట్టారు. కానీ ఓటర్ల తీర్పు చూస్తే ఇవన్నీ ప్రభావం చూపించాయని అర్థమవుతుంది.

ప్రాంతాల వారీ ఫలితాలు

ఉత్తరాన పశ్చిమాన బీజేపీ ప్రాబల్యం తగ్గలేదనీ దక్షిణాన తూర్పున మాత్రమే ఇతరుల ప్రభావం అధికమనీ ప్రశాంత్‌కిశోర్ కీలక వాదన. 2024లో ఉత్తరాన యాభై వరకూ తగ్గితే మిగిలిన చోట్ల అవి భర్తీ అవుతాయని ఆయన చెబుతూ వచ్చారు.ఇప్పుడు ఆయన చెప్పిన రెండు వైపులా బీజేపీ దారుణంగా దెబ్బతిని పోయింది. ఉత్తర భారతంలో మోడీ స్వయంగా పోటీ చేయడమే గాక ఆయనకు దీటైన ప్రధాని అభ్యర్థిగా చెలామణి అయ్యే యోగి ఆదిత్యనాథ్ పాలించే యూపీలో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది.అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట ప్రచారం ప్రతిపక్షాలు వ్యతిరేకమనే ముద్ర ఆదుకోలేకపోయింది. యూపీలో ప్రతిపక్షాల ముందంజ బీజేపీ కుంభస్థలాన్ని బద్దలు కొట్టడంలాంటిదే. ఇక్కడ గతంలో దానికి సొంతంగా 62 స్థానాలు వస్తే ఈ సారి 33కు పడిపోయాయి. గతంలో ఐదు స్థానాలే వచ్చిన ఎస్‌పి ఇప్పుడు 37తో మొదటిస్థానంలోకి వచ్చింది. ములాయం మరణానంతరం అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఇదే పెద్ద విజయం. బీఎస్పీ వేరుగా పోటీ పెట్టి పూర్తిగా ఓడిపోయినా దాని వల్లనే 16 స్థానాలు బీజేపీకి పోయాయి. లేకపోతే ఈ సంఖ్య మరింత అధికంగా ఉండేది. బీహార్‌లోనూ కొంత ఫలితం వచ్చింది. ఇక బీజేపీ కుట్రలతో ప్రలోభాలతో ప్రాంతీయ పార్టీలన్నిటినీ చీల్చిన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపి కాంగ్రెస్ కూటమి పైచేయి సాధించి సీట్లు తెచ్చుకున్నది. బీజేపీ 9 సీట్లకు పరిమితమైంది. ఇక్కడ ప్రకాశ్‌అంబేద్కర్ విబిఎ పార్టీ వల్ల నాలుగు స్థానాల్లో ఎన్‌డిఎ గెలవగలిగింది. ఇక ఆ పార్టీ దక్షిణాన భర్తీ చేసుకోవచ్చన్న అంచనా విఫలమైంది. కాంగ్రెస్ పాలిత తెలంగాణలోనూ, కర్నాటకలోనూ 17 స్థానాలతో బలం కొంత కాపాడుకున్నా కాంగ్రెస్ గతంలో వలే ఒకస్థానానికి పరిమితం కాకుండా తొమ్మిదికి పెరిగింది. బీఆర్‌ఎస్, పరోక్షంగా టీడీపీ, జెడిఎస్ ప్రత్యక్షంగా తోడు కాకపోతే బీజేపీ స్థానాలు మరింత తగ్గివుండేవి. కేరళలో సినిమా నటుడు సురేష్‌గోపీ ఒక్కస్థానం తెచ్చుకున్నా యూడీఎఫ్ 18, ఎల్‌డీఎఫ్ 1 అయ్యాయి. అయినా ఇక్కడ బీజేపీ విజయం తీవ్ర పరిణామంగానే పరిశీలకులు భావిస్తున్నారు. దీన్నుంచి తగిన పాఠాలు తీసుకుంటానని ఎల్‌డిఎఫ్ ప్రకటించింది. తమిళనాడులోనూ డిఎంకె నాయకత్వంలో ఇండియా తుడిచి పెట్టేసింది.మొత్తంపైన గతంలో దక్షిణాన ఎన్‌డిఎకు 30 సీట్లు ఉంటే ఇప్పుడు 41కి చేరాయి. మరో వంక ఇండియాకు గతంలో 58 వుంటే ఇప్పుడు 74కు చేరాయి.ఇక తూర్పున ఒరిస్సాలో అధికారం,ఆధిక్యత రెండూ దక్కినా బెంగాల్‌లో బీజేపీ గతంలోని స్థానాలు 12కు తగ్గాయి. టిఎంసివి 29కి పెరగ్గా కాంగ్రెస్ ఒకటి తెచ్చుకుంది. మమతాబెనర్జీ మళ్లీ ఇండియా వేదికలోకి సూటిగా ప్రవేశించారు.ఇలా మొత్తమ్మీద చూస్తే అన్ని ప్రాంతాల్లోనూ బీజేపీ దూకుడుకు కళ్లాలు పడ్డాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలలో బీజేపీతో ముఖాముఖి పోటీలో కాంగ్రెస్ స్థానాలు గతంలో కంటే బాగానే పెరిగాయి. కానీ ఇంకా పెరిగివుంటే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఇప్పటికీ 11 రాష్ట్రాలలో దానికి ప్రాతినిధ్యం లేదు. కానీ 2009 తర్వాత మళ్లీ ఇప్పడే 99 సీట్లతో వందకు చేరువైంది. ఒక విధంగా ఇది 1990లో బీజేపీ 88 స్థానాలు తెచ్చుకుని పెరిగిన పరిస్థితిలాంటిదేనని పరిశీలకుల మాట. రాహుల్‌గాంధీ యాత్రలు, కార్యక్రమాలు పార్టీలో కదలిక తేవడమేగాక 'ఆప్' కూడా కూటమితో కలసి రావడం తోడైంది. బీహార్‌లో ఆర్జేడి కూడా ముఖ్యపాత్ర వహించింది. ఈ విధంగా మొత్తం పైన ఎవరూ ఊహించని విధంగా ఇండియా వేదిక బీజేపీ ఎన్‌డిఎకు దీటుగా నిలిచిందంటే ప్రజల మద్దతే కారణం.

వామపక్షాలు

వామపక్షాలకు కూడా గతం కంటే ప్రాతినిధ్యం పెరిగింది. సీపీఐ(ఎం) నాలుగు స్థానాలు, సీపీఐ రెండు స్థానాలు తెచ్చుకోగా చాలా ఏండ్ల తర్వాత సీపీఐ(ఎంఎల్) సభలో మళ్లీ ప్రవేశించింది. కేరళలో సీపీఐ(ఎం) ఒకే స్థానం గెలవడం నిరుత్సాహం కలిగించింది.2019లో అలప్పుజ వస్తే ఈసారి అల్తూర్‌లో విజయం లభించింది. రాజస్థాన్ నుంచి సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడైన అమర్ రామ్ ఎన్నిక కావడంతో పాతికేళ్ల తర్వాత హిందీ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం దక్కినట్టయింది. సీపీఐ (ఎంఎల్) కూడా బీహార్‌నుంచి రెండు స్థానాలు తెచ్చుకో గలిగింది. అయినా ఇంకా చేయాల్సింది చాలా ఎక్కువ.

కలవని పార్టీలు కనుమరుగు

దేశంలో ఇంత తీవ్ర రాజకీయ సమరం జరుగుతుంటే తమ స్థానిక అవసరాలే కీలకంగా భావించి రెండు కూటముల వైపు రాకుండా ఉండిపోయిన పార్టీలు దాదాపు సీట్ల పట్టికనుంచి అదృశ్యమయ్యాయి. వాటిలో బీఎస్పీ ముఖ్యమైంది. బీఆర్‌ఎస్‌గా మారి దేశరాజకీయాలనే ప్రభావితం చేస్తామన్న కేసీఆర్ స్వంత నియోజకవర్గం లాంటి మెదక్ కూడా గెలవలేకపోయారు. వైసీపీ 22నుంచి నాలుగు స్థానాలకు పరిమితమైంది, అన్నాడిఎంకె కూడా మొత్తగా మాయమైపోయింది.ఒరిస్సాలో బీజేడీ కూడా బీజేపీ విషయంలో ఊగిసలాడి చివరకు అధికారం పోగొట్టుకోవడమేగాక లోక్‌సభ ప్రాతినిధ్యం కూడా పోగొట్టుకుంది. భవిష్యత్తులో ఈ పార్టీల వైఖరి ఎలా ఉంటుందనేది చూడాల్సిందే.

ఉద్యమాల ప్రభావం

ఉద్యమాలకూ ఎన్నికలకూ సంబంధం ఉండదనే సిద్ధాంతాలు కూడా ఈ ఫలితాలతో తారుమారయ్యాయి. రైతాంగ ఉద్యమం నడిచిన చోట్ల బీజేపీకి తీవ్రమైన దెబ్బతగిలింది. మొత్తంగా వాతావరణంలో మార్పు తేవడంలోనూ ఆ ప్రభావం పడింది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, యూపీ పశ్చిమ ప్రాంతంలో బీజేపీ ఓటమికి ఈ ఉద్యమమే కారణంగా భావిస్తున్నారు.రాజ్యాంగం రిజర్వేషన్లు, ఆర్థిక అసమానతలు,నిరుద్యోగం వంటి అంశాలను చర్చలోకి తేవడానికి ఆవర్గాలను ఆకర్షించడానికి కారణమయ్యాయి. మైనార్టీలలో వచ్చిన మార్పు యూపీ ఫలితంలో కీలక పాత్ర వహించింది. సమాఖ్య వ్యవస్థను కాపాడుకోవాలనే కోణం ప్రస్ఫుటమైంది.మత సామరస్యం, జాతీయ సమైక్యతకు ఇవన్నీ దోహదపడే అంశాలుగా నిలిచాయి.

బీజేపీ కుస్తీ


బీజేపీ అంతర్గతంగా ఈ తీర్పు తర్వాత కుదుపులకు గురైంది. మోడీ కాకుండా అమిత్‌షాను, నితిన్ గడ్కరీని ప్రధానిని చేస్తారనే కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఏకవ్యక్తి కేంద్రంగా పనిచేసే మోడీ మిశ్రమ ప్రభుత్వాన్ని నడపగలరా? అనే సందేహాలు కూడా మీడియా బాహాటంగానే వ్యక్తం చేసింది. ఒక విధంగా ఇది కార్పొరేట్ వర్గాల భావనల ప్రతిబింబం కావచ్చు.సరిగ్గా ఈ కారణం వల్లనే మోడీ ఉండాలనే నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. గతంలో అనేకసార్లు రాజకీయ విన్యాసాలు చేసిన చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ వంటివారిపై ఆధారపడవలసి రావడంతో మోడీ ప్రభుత్వ సుస్థిరత కూడా ప్రశ్నార్థకంగా మారింది. వారిలో నితీశ్ ఇండియాతో కూడా చర్చలు జరుపుతున్నారనే కథనాలు, తేజస్వితో కలసి విమానంలో రావడం సంశయాలు పెంచింది. అయితే తాము ఎన్‌డిఎలోనే ఉంటామని చెప్పడమే గాక త్వరగా మోడీని గద్దెక్కించాలని నితీశ్ హడావుడి పెట్టారంటున్నారు. మోడీ హ్యాట్రిక్ సందడి ఈ విధంగా పరిణమించడం ప్రజల తీర్పు దెబ్బ ఏమిటో చెబుతుంది. కానీ ఒకసారి అధికార పీఠం స్థిరపడ్డాక ఆయన లేదా ఆ పార్టీ ధోరణి ఎలా ఉంటుందనేది కూడా అనుమానమే. ఎందుకంటే ఇక్కడిదాకా తెచ్చిన కార్పొరేట్ శక్తులు తమ ప్రయోజనాల కోసం ఎంతైనా ఒత్తిడి తెస్తుంటాయి. మరోవైపున నిరుత్సాహానికి గురైన సంఘ్‌పరివార్ కూడా అంత సులభంగా మారే ప్రసక్తి ఉండదు. ఇందులో మరిన్ని మలుపులు వచ్చినా ఆశ్చర్యపోవనవసరం లేదు.

బీజేపీ అంతర్గతంగా ఈ తీర్పు తర్వాత కుదుపులకు గురైంది. మోడీ కాకుండా అమిత్‌షాను, నితిన్ గడ్కరీని ప్రధానిని చేస్తారనే కథలు ప్రచారంలోకి వచ్చాయి. ఏకవ్యక్తి కేంద్రంగా పనిచేసే మోడీ మిశ్రమ ప్రభుత్వాన్ని నడపగలరా? అనే సందేహాలు కూడా మీడియా బాహాటంగానే వ్యక్తం చేసింది. ఒక విధంగా ఇది కార్పొరేట్ వర్గాల భావనల ప్రతిబింబం కావచ్చు.సరిగ్గా ఈ కారణం వల్లనే మోడీ ఉండాలనే నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. గతంలో అనేకసార్లు రాజకీయ విన్యాసాలు చేసిన చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ వంటివారిపై ఆధారపడవలసి రావడంతో మోడీ ప్రభుత్వ సుస్థిరత కూడా ప్రశ్నార్థకంగా మారింది. వారిలో నితీశ్ ఇండియాతో కూడా చర్చలు జరుపుతున్నారనే కథనాలు, తేజస్వితో కలసి విమానంలో రావడం సంశయాలు పెంచింది.

ఉత్తర భారతంలో మోడీ స్వయంగా పోటీ చేయడమే గాక ఆయనకు దీటైన ప్రధాని అభ్యర్థిగా చెలామణి అయ్యే యోగి ఆదిత్యనాథ్ పాలించే యూపీలో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నది.అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట ప్రచారం ప్రతిపక్షాలు వ్యతిరేకమనే ముద్ర ఆదుకోలేకపోయింది. యూపీలో ప్రతిపక్షాల ముందంజ బీజేపీ కుంభస్థలాన్ని బద్దలు కొట్టడంలాంటిదే. ఇక్కడ గతంలో దానికి సొంతంగా 62 స్థానాలు వస్తే ఈ సారి 33కు పడిపోయాయి. గతంలో ఐదు స్థానాలే వచ్చిన ఎస్‌పి ఇప్పుడు 37తో మొదటిస్థానంలోకి వచ్చింది. ములాయం మరణానంతరం అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఇదే పెద్ద విజయం. బీఎస్పీ వేరుగా పోటీ పెట్టి పూర్తిగా ఓడిపోయినా దాని వల్లనే 16 స్థానాలు బీజేపీకి పోయాయి. లేకపోతే ఈ సంఖ్య మరింత అధికంగా ఉండేది. బీహార్‌లోనూ కొంత ఫలితం వచ్చింది. ఇక బీజేపీ కుట్రలతో ప్రలోభాలతో ప్రాంతీయ పార్టీలన్నిటినీ చీల్చిన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపి కాంగ్రెస్ కూటమి పైచేయి సాధించి సీట్లు తెచ్చుకున్నది.

రచయిత అర్నాల్డ్, తను ఎవరి గురించైతే ఈ గ్రంథం ప్రకటిస్తున్నాడో ఆ మహనీయుని పట్ల తన గౌరవ భావాన్ని అత్యున్నత స్థాయిలో వ్యక్తం చేశాడు. MOST EXALTED ORDER OF THE STAR OF INDIAగా చెప్పాడు "కాలం గడిచిపోతుంది.గీతాలకీ గీతం లాంటి ఈ కావ్యాన్ని అందించినందుకు. భారతీయ ప్రేమికుణ్ణయిన నన్నూ, నా ఈ రచనను ప్రజలు గుర్తుంచుకుంటారని విశ్వసిస్తున్నాను. నేను వారి జ్ఞాపకాలలో నిలుస్తానని ఆశిస్తున్నాను-" అని ఎడ్విన్ అర్నాల్డ్ తన ముందుమాట ముగింపులో రాసుకున్నాడు. ఈ రచయితకు బుద్ధుడి పట్ల, బుద్ధుడు ప్రపంచానికి అందించిన సందేశం పట్ల ఎంత ఉన్నతమైన గౌరవ భావం, ప్రేమ ఉన్నాయో ఆ మాటల్లో వ్యక్తం అయ్యింది. విశాల హృదయంతో ఓపెన్ మైండ్‌తో రాసిన ఈ మాటల్లో నిజాయితీ ఉంది. భారతీయ అనువాదకులపై ఎంత లేదన్నా, ఎంతో కొంత మనువాద సంప్రదాయాల ప్రభావం ఉండి ఉంటుంది కదా? అందుకే వారు బుద్ధుణ్ణి 'ఆసియా ఖండపు వెలుగు' అని సగర్వంగా చెప్పకోలేక పోయారేమో!

సర్ ఎడ్విన్ అర్నాల్డ్ రచన: ద లైట్ ఆఫ్ ఆసియా


డాక్టర్ దేవరాజు మహారాజు


బ్రిటీష్ కవి, జర్నలిస్ట్ ఎడ్విన్ అర్నాల్డ్ 1879లో 'ద లైట్ ఆఫ్ ఆసియా' అనే గ్రంథం EPIC POEM: LIFE AND TEACHINGS OF GOUTHAMA BUDDHA ప్రకటించాడు. చరిత్రలో ఇది ఒక మహోన్నత ఘట్టం. ఒక విదేశీయుడు ప్రపంచ పరిజ్ఞానంతో తిరిగి వచ్చి, బుద్ధుడి గురించి అధ్యయనం చేసి - అతణ్ణి 'ఆసియా ఖండపు వెలుగు'గా ప్రకటిస్తూ ఇంగ్లీషులో ఒక ఉద్గ్రంథం ప్రకటించడమంటే ఏదో అల్లాటప్పా విషయం కాదు కదా? ఆయన అలా ప్రకటించినపుడు ఆసియాలో అబ్రహం, మూసా, ఈసా, మహ్మద్‌ల ప్రాబల్యమే కాదు, బ్రాహ్మణార్యుల ముప్పయి మూడు కోట్ల దేవీ దేవతలు కూడా ఉన్నారు. వారందరినీ కాదని ఎడ్విన్ అర్నాల్డ్ బుద్ధుడి గురించి రాశాడు. పైగా ఎప్పుడు రాశాడూ? అంటే- బ్రాహ్మణార్యుల కుట్రల వల్ల బుద్ధుడు నేల మీది కన్నా భూమి పొరల్లో ఎక్కువగా పాతుకుపోయిన సమయంలో రాశాడు. ఎక్కడ ఏ చిన్నపాటి తవ్వకం జరిగినా, బయట పడే శిధిలాలు ఇది బుద్ధ దేశమని గొంతెత్తి చెబుతున్న కాలంలో రాశాడు. అబద్ధాల వైపు ముఖం తిప్పుకునే వారిని నిజాలు చూడమంటూ, బుద్ధఘోష వినమంటూ - బౌద్ధ శిల్పాలు, స్తూపాలు, శిలా ఫలకాలు ప్రతిధ్వనిస్తున్న సమయంలో రాశాడు. అర్నాల్డ్ రచన - లైట్ ఆఫ్ ఆసియా కావ్యంతో ప్రభావితులు కాని ఆనాటి స్వాతంత్ర్య సమర యోధులు/దేశ నాయకులు లేరంటే అతిశయోక్తి కాదు. ఎడ్విన్ అర్నాల్డ్ (10 జూన్ 1832-24 మార్చి 1904) తన ఇరవై అయిదవ యేట 1956లో ఇండియా వచ్చి, యువకుడిగా ఆ వయసులోనే పూనా కాలేజికి ప్రిన్సిపాల్ అయ్యాడు. తర్వాత కాలంలో అది దక్కన్ కాలేజిగా మారింది. తనకు ఉన్న పరిధిలోనే బాలికల విద్యను ప్రోత్సహించాడు. ఛాందస సంప్రదాయ విద్యా విధానాన్ని మార్చడానికి ప్రయత్నించాడు.

బుద్ధుడి కాలం, అశోకుడి కాలం గడిచిపొయ్యాక ప్రపంచంలో అనేక పరిణామాలు జరుగుతూ వచ్చాయి. ఆసియా దేశాలలో బౌద్ధం బలంగా ఉన్నా, యూరోప్ దేశాలకు అది అందాల్సినంత అందలేదు. కారణం బౌద్ధాన్ని వాళ్ల అర్థం చేసుకునే భాషలో ఎవరూ చెప్పలేదు. సర్ ఎడ్విన్ అర్నాల్డ్ ఆ లోటు తీర్చాడు. 'ద లైట్ ఆఫ్ ఆసియా' శీర్షికతో బుద్ధుడి జీవిత చరిత్రకు కావ్య రూపమిచ్చాడు. బుద్ధుడి గొప్పతనాన్ని ఆధునిక ప్రపంచానికి చాటి చెప్పాడు. 'బుద్ధిస్ట్ హిస్టోగ్రఫీ'గా అది ప్రపంచ పాఠకుల మన్ననలు పొందింది. సామాజిక సమానత్వానికి వివిధ దేశాల్లో జరిగిన ఉద్యమాలకు ఆ పుస్తకం స్ఫూర్తినిచ్చింది. కవులకు, కళాకారులకు, చిత్రకారులకు, చలనచిత్ర దర్శకులకు ఎంతో మందికి ఎన్నో రకాలుగా అది ఉత్తేజాన్నిచ్చింది. 1927లో 'లైట్ ఆఫ్ ఆసియా' ఇంగ్లీషు మూల గ్రంథం ఇంగ్లాండులో అరవై, అమెరికాలో వంద పునర్ముద్రణలు జరిగి, ప్రపంచవ్యాప్తంగా తన రికార్డును తానే అధిగమిస్తూ పాఠకులకు అందింది. మరొక విశేషమేమంటే దాదాపు అన్ని ప్రపపంచ భాషల్లోకి ఈ గ్రంథం అనువాదమైంది. భారత దేశం బౌద్ధ దేశమనీ, బుద్ధుడు ఆసియా ఖండపు వెలుగు - అనే అభిప్రాయం స్థిరపడింది. ఏ కొందరో ఆ విషయం దాచిపెట్టాలని చూసినా ఆ వెలుగును అడ్డుకోలేక పోయారన్నది నిజం!

THE LIGHT OF ASIA - THE POEM THAT DEFINED THE BUDDHA అనే శీర్షికతో కాంగ్రెస్ కేంద్ర మాజీ మంత్రి జైరామ్ రమేశ్ 2021లో ఒక పుస్తకమే ప్రచురించాడు. ఇందులో అర్నాల్డ్ పుస్తకం సాధించిన విజయం గూర్చి -తొలి డైరెక్టర్ జర్నల్ ఆఫ్ ఆర్కియాలజీ అలెగ్జాండర్ కన్నింగ్‌హోమ్ గూర్చి వివరంగా రాశాడు. బుద్ధ గయను మనువాదులు అక్రమంగా ఆక్రమించుకోవడం గురించి, వివాదాస్పద అంశాల గురించీ చర్చించాడు. అయోధ్య- బాబ్రీ మసీదు వివాదానికంటే చాలా ఏళ్ళకు ముందు బ్రాహ్మణార్యులు బుద్ధగయను కూడా ఎలా వివాదం చేశారో జైరామ్ రమేశ్ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. మహాబోధి సొసయిటీకి చెందిన అనగరిక ధర్మపాల సహాయంతో వివాదాస్పదమైన బుద్ధగయను ఎడ్విన్ అర్నాల్డ్ ఆ రోజుల్లో దర్శించాడు. అది బౌద్ధులకు దక్కాలని వాదించాడు. అందుకు కృషి చేశాడు కూడా! ఇక్కడ సింహళ భిక్కు అనగరిక ధర్మపాల గురించి ఒక విషయం చెప్పకోవాలి. 1893లో షికాగోలో జరిగిన 'వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రిలిజియన్స్'కు ఆహ్వానించబడ్డ ధర్మపాల, అక్కడ థేరవాదం గురించి, ముఖ్యంగా దక్షిణ ప్రాంతపు బౌద్ధం గురించి మాట్లాడాడు. సభికుల్ని అమితంగా ఆకర్షించాడు. ధర్మపాల, వివేకానందుల కలయిక అక్కడే జరిగింది. హిందూయిజం గురించి మాట్లాడిన వివేకానందుడి గురించే మనవాళ్ళు మనకు చెపుతూ వచ్చారే గాని, ధర్మపాల గురించి ఎందుకు చెప్పలేదూ? ఇలాంటివన్నీ ఒక్క వ్యాసంలో రావు-మరోసారి మరో వ్యాసంలో రాస్తాను. 'ద లైట్ ఆఫ్ ఏసియా' పుస్తకాన్ని ఆధారం చేసుకుని, 1925లో ఇంగ్లీషు - జర్మన్ భాషలలో అదే టైటిల్ తో ఒక చలన చిత్రం రూపొందింది. దాన్ని ఫ్రాంజ్ జస్టన్ (బవేరియా-సర్మన్) ; హిమాంశురాయ్ (బెంగాల్ - బ్రిటీష్ ఇండియా)లు కలిసి దర్శకత్వం వహించారు. ఇది అప్పటి జైపూర్ మహారాజు సహాయం సహకారాలతో ఇండోయూరోపియన్ ప్రొడక్షన్‌గా దాన్ని చిత్రీకరణ లాహోర్‌లో జరిగింది.

రచయిత అర్నాల్డ్, తను ఎవరి గురించైతే ఈ గ్రంథం ప్రకటిస్తున్నాడో ఆ మహనీయుని పట్ల తన గౌరవ భావాన్ని అత్యున్నత స్థాయిలో వ్యక్తం చేశాడు. MOST EXALTED ORDER OF THE STAR OF INDIAగా చెప్పాడు "కాలం గడిచిపోతుంది.గీతాలకీ గీతం లాంటి ఈ కావ్యాన్ని అందించినందుకు. భారతీయ ప్రేమికుణ్ణయిన నన్నూ, నా ఈ రచనను ప్రజలు గుర్తుంచుకుంటారని విశ్వసిస్తున్నాను. నేను వారి జ్ఞాపకాలలో నిలుస్తానని ఆశిస్తున్నాను-" అని ఎడ్విన్ అర్నాల్డ్ తన ముందుమాట ముగింపులో రాసుకున్నాడు. ఈ రచయితకు బుద్ధుడి పట్ల, బుద్ధుడు ప్రపంచానికి అందించిన సందేశం పట్ల ఎంత ఉన్నతమైన గౌరవ భావం, ప్రేమ ఉన్నాయో ఆ మాటల్లో వ్యక్తం అయ్యింది. విశాల హృదయంతో ఓపెన్ మైండ్‌తో రాసిన ఈ మాటల్లో నిజాయితీ ఉంది. భారతీయ అనువాదకులపై ఎంత లేదన్నా, ఎంతో కొంత మనువాద సంప్రదాయాల ప్రభావం ఉండి ఉంటుంది కదా? అందుకే వారు బుద్ధుణ్ణి 'ఆసియా ఖండపు వెలుగు' అని సగర్వంగా చెప్పకోలేక పోయారేమో!

ప్రపంచ భాషలతో పాటు అర్నాల్డ్ పంచిన వెలుగు మన భారతీయ భాషల్లో కూడా ప్రసరించింది. తెలుగులో దాసు శ్రీరాములు అనే కవి 1905లో "సంగీత రస తరంగం అను బుద్ధ నాటకం" శీర్షికతో రాయడం ప్రారంభించాడు. అది పూర్తి కాకుండానే అనారోగ్యంతో మరణించాడు. అప్పుడు ఆయన కుమారుడు దాసు నారాయణరావు తన తండ్రి అసంపూర్ణంగా వదిలేసిన రచనను పూర్తి చేసి 1907లో ఇద్దరి పేర్లతో ప్రకటించాడు. వీరు కృష్ణా జిల్లా కురాద గ్రామానికి చెందినవారు. ఇది అప్పట్లో మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది.భారతీయ భాషల్లో వచ్చిన అనువాదాలు చాలావరకు ఒక పరిధిలో 'బుద్ధుడి చరిత్రగా' మాత్రమే ఉండి పొయ్యాయి. మళయాళ, తమిళ అనువాదాలు మాత్రం 'లైట్ ఆఫ్ ఆసియా' అనే శీర్షికతోనే వెలువడ్డాయి, అసలు ఆ శీర్షికే బుద్ధుడి జీవితాన్ని చాటి చెపుతూ ఉంటే, భారతీయ భాషల అనువాదకులు ఆ విషయం ఎందుకు గ్రహించలేక పొయ్యారూ? లేదా వారు కరుడు గట్టిన వైదిక సంప్రదాయులైనందువల్ల ఆ మాట గర్వంగా చెప్పకోవడానికి సంకోచించారా? 1922లో రామచంద్ర శుక్లా అనే పండితుడు లైట్ ఆఫ్ ఏసియాను తన బ్రిజ్ భాషలోకి అనువదించాడు. అప్పటికి హిందీ ఇంకా పూర్తిగా అభివృద్ధి కాలేదు. దానిపేరు ఉన్నది ఉన్నట్లుగా పెట్టకుండా 'బుద్ధ చరిత్ర' అని అన్నాడు. సంకుచిత స్వభావాలు ఎలా ఉంటాయో చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా దొరుకుతాయి. రామచంద్ర శుక్లా బనారస్ హిందూ యూనివర్సిటీలో హిందీ విభాగం అధిపతి. హిందీ సాహిత్య చరిత్రను 1929లో నమోదు చేశాడు.



ఎదుగుతున్న దశలో సమాజ స్థితి గతుల్ని పరిశీలించడం, ప్రపంచంలో ఇంత దుఃఖం: వేదన ఎందుకు ఉన్నాయని తనలో తానే ప్రశ్నించుకోవడం; సమాధానాలు అన్వేషించుకోవడం మొదలైన విషయాలు రాశాడు. తర్వాత అధ్యాయాల్లో - కొన్నేళ్లు ధ్యానం మీద ధ్యాస పెట్టి సమాధిలో కూర్చుని తీవ్రమైన ఆలోచనల్లో పడిపోవడం... ఆ క్రమంలో అర్యస్టాంగ మార్గం/అష్టసమ్యన్ మార్గాన్ని (పాలి: అరియ అత్తాంగిక మగ్గ) కనుక్కోవడం- సంసార బంధనాల్లోంచి విముక్తమై నిర్వాణను సాధించడం ఎలాగని బుద్ధుడు తపన పడడం గురించి వివరంగా రాశాడు. ఆ తర్వాత అధ్యాయాల్లో సమ్యక్ సంబుద్ధ ఎలా సాధించాడో వివరించాడు. అలాగే బుద్ధుడి బోధనల గురించి కొంత చర్చించాడు.

ఎడ్విన్ అర్నాల్డ్, లైట్ ఆఫ్ ఏసియాలోని తొలి అధ్యాయాలలో బుద్ధుడి జీవిత చరిత్రను వివరించాడు. కపిలవస్తు యువ రాజు సిద్ధార్థుడిగా నేపాల్‌లోని లుంబిని వనంలో జన్మించడం: ఎదుగుతున్న దశలో సమాజ స్థితిగతుల్ని పరిశీలించడం, ప్రపంచంలో ఇంత దు:ఖం: వేదన ఎందుకు ఉన్నాయని తనలో తానే ప్రశ్నించుకోవడం; సమాధానాలు అన్వేషించుకోవడం మొదలైన విషయాలు రాశాడు. తర్వాత అధ్యాయాల్లో - కొన్నేళ్లు ధ్యానం మీద ధ్యాస పెట్టి సమాధిలో కూర్చుని తీవ్రమైన ఆలోచనల్లో పడిపోవడం... ఆ క్రమంలో అర్యస్టాంగ మార్గం/అష్టసమ్యన్ మార్గాన్ని (పాలి: అరియ అత్తాంగిక మగ్గ) కనుక్కోవడం- సంసార బంధనాల్లోంచి విముక్తమై నిర్వాణను సాధించడం ఎలాగని బుద్ధుడు తపన పడడం గురించి వివరంగా రాశాడు. ఆ తర్వాత అధ్యాయాల్లో సమ్యక్ సంబుద్ధ ఎలా సాధించాడో వివరించాడు. అలాగే బుద్ధుడి బోధనల గురించి కొంత చర్చించాడు. సరిగా అర్థంచేసుకోవడం, సరిగా ఆలోచించడం, సరిగా సంభాషించడం, సరైన చర్యలు చేపట్టడం, సరైన జీవన విధానాన్ని రూపొందించుకోవడం, సరైన కృషి చేయడం, వివేకాన్ని కలిగి ఉండడం. ధ్యాస సరైన వాటిపై కేంద్రీకరించడం - ఇవన్నీ పాటించిన వారి జీవితం ప్రశాంతంగా గడవకుండా ఎలా ఉంటుంది?

విశ్వజనీయమైన ప్రేమ, జాలి, కరుణల అవసరాన్ని బుద్ధుడు గ్రహించినట్టే ఎడ్విన్ అర్నాల్డ్ కూడా గ్రహించాడు. అందుకే ఆ విషయాలన్నింటినీ తన రచనలో పొందుపరిచాడు. బుద్ధుడి ప్రియ శిష్యుడైన ఆనందుడి గురించి, ముఖ్య అనుచరులైన సరిపుట్ట, మొగ్గల్లనల గురించి, ఆయన కుమారుడు రాహుల్ గురించి, భార్య యశోధర గురించి కూడా వివరించాడు. ఆయన బోధనలు వినడానికి వచ్చే అనుచరగణం గురించి కూడా పుస్తకంలో నమోదు చేశాడు. ఎడ్విన్ స్వయంగా కవి గనుక ఈ గ్రంథంలోని సరళతకు, పదలాలిత్యానికీ ప్రపంచ పాఠకులు ముగ్ధులయ్యారు. 19వ శతాబ్దంలో సాహిత్య ప్రపంచానికి అర్నాల్డ్ అందించిన గొప్ప కావ్యంగా అది క్లాసిక్స్ లిస్ట్‌లో చేరింది. అందుకే ప్రపంచ పాఠకలోకం ఆయనకు జేజేలు పలికింది. భారత దేశం ప్రపంచానికి చూపిన బౌద్ధ మార్గాన్నీ, బుద్ధుడి జ్ఞానోదయాన్ని పశ్చిమ దేశాలకు పరిచయం చేసి, వారి ఆలోచనల్ని మలుపుతిప్పిన వాడిగా సర్ ఎడ్విన్ అర్నాల్డ్‌ను ఆగామి కాలాలలో కూడా ప్రజలు గుర్తుంచుకుంటారు.

(జూన్ 10 సర్ ఎడ్విన్ అర్నాల్డ్ జయంతి)

- సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవశాస్త్ర వేత్త (మెల్బోర్న్ నుంచి)

నవతెలంగాణ
శుక్రవారం 07 జూన్ 2024

దెబ్బతిన్న గ్రామీణ రోడ్లకు మరమ్మతులు

- పీఆర్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, ఇతర పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క చెప్పారు. సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులను ఉపయోగించి గ్రామీణా రహదారుల అభివద్ధి కోసం కషి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖపై డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం మంత్రి సమీక్ష చేశారు. ఈసందర్భంగా గ్రామీణ రహదారులు, వాటి పరిస్థితిపై ఆరా తీశారు. మరమ్మతులు, నిధులు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. పంచాయతీలు, స్థానిక సంస్థలలో వివిధ అభివద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే మౌలిక సదుపాయాల కోసం కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. పెండింగ్ పనుల్లో నాణ్యత పెంచేలా త్వరితగతిన చర్యలు తీసుకుని పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయితీ రాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై రేవంత్ ఆరోపణలు నిరాధారం

- సీఎం సొంత గ్రామంలో బీజేపీకి ఆధిక్యత... బదిలీ చేశారా? : డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు తమ పార్టీ ఓట్లను బీజేపీకి బదిలీ చేయించారంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో బీజేపీకి ఆధిక్యత వచ్చిందంటూ ...మరి ఆ ఓట్లు రేవంత్ రెడ్డి బదిలీ చేయించినట్టా? అని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం గెలిచిన కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 30 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకున్నారనీ, అదే నియోజకవర్గంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 22 వేలకు పడిపోయాయని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినట్టే మెజారిటీ వస్తే మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేవారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఓట్లను బదిలీ చేసి బీజేపీ అభ్యర్థి డి.కె.అరుణను గెలిపించారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి పేలుతున్న ప్రేలాపనలు అడలేక మద్దెల ఓటు అన్నట్టుగా ఉన్నాయని ఎర్రోళ్ల ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ను విమర్శించడం మానుకుని ఆరు నెలల పాలనలోనే 8 ఎంపీ సీట్లకే కాంగ్రెస్ పరిమితమయిందో సమీక్షించుకోవాలని సూచించారు.

నవీన్ కుమార్ రెడ్డికి అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్ కుమార్ రెడ్డిని పలువురు బీఆర్ఎస్ నేతలు అభినందించారు. గురువారం ఆయన హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌కు వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు దేవీప్రసాదరావు, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్సీగా తన గెలుపుకు సహకరించిన పార్టీ అధిష్టానానికి, నాయకులకు నవీన్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సీఎం ఆమోదం రాగానే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి ఆమోదం రాగానే షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలను రూపొందించి రేవంత్‌రెడ్డికి విద్యాశాఖ పంపించిన సంగతి విదితమే. దానికి ఆమోదం లభించాల్సి ఉన్నది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు తొమ్మిదేండ్లుగా పదోన్నతుల కోసం, ఆరేండ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించి సజావుగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాలన్నీ కోరుతున్నాయి.

నేటి నుంచి ప్రపంచ వరి సదస్సు

- హైదరాబాద్‌లో రెండ్రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న 30 దేశాల ప్రతినిధులు
- వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారులు, రైతులు కూడా..

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రపంచ వరి సదస్సు శుక్రవారం నుంచి రెండు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనుంది. 30 దేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారులు, రైతులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. అంతర్జాతీయ సరకుల సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సదస్సులో అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థల కన్సార్షియం, భారతదేశ వరి పరిశోధన సంస్థ, ఉత్తర్ ప్రదేశ్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఒడిశా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతదేశ వరి ఎగుమతిదారుల సమాఖ్య ఫిక్కీ తదితర సంస్థల ప్రతినిధులు కూడా పాలుపంచుకోనున్నారు. గ్లోబల్ రైస్ సమ్మిట్‌కు భారత్ అతిథ్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణను దీనికి వేదికగా ఎంచుకున్నారు. ప్రపంచంలో బియ్యం వినియోగం ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో వరి పంట ప్రాధాన్యతను పెంచడంతోపాటు విస్తీర్ణాన్ని వృద్ధి చేయడం ద్వారా ఆహార భద్రత, సాగుకు సాంకేతిక సాయం, బియ్యం మార్కెటింగ్‌ను విశ్వవ్యాప్తం చేయడం, ఎగుమతుల పెంపు అనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. వరిసాగులో ఎరువుల వాడకం తగ్గింపు, వాతావరణ పరిస్థితులను అధిగమించేలా సాగు, సాంకేతిక వినియోగం వంటి అంశాలను సదస్సులో చర్చించనున్నారు.

బీజేపీ దూకుడుకు కళ్లెం

- జేడీయూ, టీడీపీ మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటు : న్యూడెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ, ఫాసిస్టు పోకడలకు, బీజేపీ దూకుడుకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కళ్లెం వేశారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీకి 370, ఎన్డీయేకు 400కిపైగా సీట్లు అనే నినాదంతో మైండ్‌గేమ్ ఆడిన మోడీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. బీజేపీకి 240 సీట్లు, ఎన్డీయేకు 291 సీట్లు మాత్రమే వచ్చాయని వివరించారు. ఇండియా కూటమికి 233 సీట్లొచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి బలమైన శక్తిగా అవతరించిందని వివరించారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే జేడీయూ, టీడీపీ మద్దతు అనివార్యమని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు తప్పవని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలనీ, వాటి కోసం ఉద్యమించాల్సిన కర్తవ్యం, సాధించుకోవాల్సిన అవసరం ప్రజల ముందు ఉందని పేర్కొన్నారు. హరించబడుతున్న ప్రజాస్వామిక హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

'రెండో ఓటే' లెక్క..!

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితంపై వీడని ఉత్కంఠ
- మ్యాజిక్ ఫిగర్ 1,55,095 ఓట్లు ఎవరికీ రాని వైనం
- ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మొదటి ప్రాధాన్యత ఓట్లతో తేలని ఫలితం..!
- లెక్కింపు సరిగా లేదని బీఆర్ఎస్ అభ్యంతరం
- విధులకు ఆటంకం కలిగించారని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిపై కేసు నమోదు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/మిర్యాలగూడ

ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితంపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం అనిశెట్టి దుప్పలపల్లి గోదాములో రెండో రోజు గురువారం రాత్రి వరకు లెక్కింపు కొనసాగుతుంది. పోలై చెల్లిన ఓట్లలో 50 శాతానికి ఒక ఓటు అధికంగా సాధించిన అభ్యర్థిని విన్నర్‌గా ప్రకటిస్తారు. కానీ గురువారం రాత్రి వరకు మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఆ మొత్తాన్ని ఏ అభ్యర్థి సాధించలేదు. ఈ నేపథ్యంలో రెండో ప్రాధాన్యత ఓటును పరిగణలోకి తీసుకొని లెక్కింపు ప్రారంభించారు. కాగా, 4 రౌండ్ల లెక్కింపు పూర్తి కాగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఆధిక్యతతో ఉన్నారు. రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఉండగా, నాలుగో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి అశోక్ కుమార్ ఉన్నారు. ప్రతి రౌండ్‌లో 96 వేల ఓట్లను లెక్కించారు.

మొదటి రౌండ్‌లో..

మొత్తం 96,097 ఓట్లు లెక్కించగా అందులో చెల్లిన ఓట్లు 88,369, చెల్లని ఓట్లు 7728 ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 36,210, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి 28,540, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి 11,395, ఓట్లు లభించాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి అశోక్ కుమార్ కు 9109 ఓట్లు లభించాయి. ఈ మొదటి రౌండులో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 7670 ఓట్లు ఆదిక్యత లభించింది.

తొలి ప్రాధాన్యత ఓట్లతో తేలని విజేత..

నాలుగో రౌండ్ పూర్తయ్యాక వెలువడిన ఫలితాలను బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనివార్యమైంది. కాగా, మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు పోటాపోటీగా తలపడ్డాయి. మొదటి ప్రాధాన్యతలో ఏ ఒక్కరికీ గెలుపు కోటాకు సరిపడా ఓట్లు రాలేదు. దాదాపు 1,55,095 లక్షలు మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధిస్తేనే విజేతలుగా నిలిచే అవకాశం ఉన్నా ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాలేదు. కాగా, గత ఎన్నికల తరహాలోనే ఈ ఎలక్షన్స్ ఫలితం తేలడానికి నాలుగు రోజులు పట్టొచ్చని కౌంటింగ్ అధికారులు చర్చించుకుంటున్నారు.

రెండో ఓటుకు పోతే లాభనష్టాలపై బేరీజు..

రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించక తప్పలేదు. ఈ నేపథ్యంలో పార్టీలు, అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ తమకే ఎక్కువగా లభిస్తాయని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విశ్వాసంతో ఉండగా.. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి సైతం అంతే నమ్మకంతో ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఇతరులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన వారు రెండో ప్రాధాన్యత తనకే వేసిఉంటారని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీకి తొలి ప్రాధాన్యత ఓటు వేసినవారిలో ఎక్కువ మంది రెండో ప్రాధాన్యత ఓటు బీఆర్ఎస్‌కే వేశారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. గతంలోలాగే ఎలిమినేషన్ ప్రక్రియ వరకు కౌంటింగ్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. దీన్ని బట్టి ఫలితం శుక్రవారం లేదా శనివారం వెలువడే ఛాన్స్ ఉంది.

లెక్కింపు సరిగా లేదన్న బీఆర్ఎస్ అభ్యర్థి

మూడవ రౌండ్‌లో లెక్కింపు సరిగా జరగలేదని 1100 ఓట్లు లెక్కించకుండానే కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ చూపించారని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక అభ్యర్థికి మేలు చేసే విధంగా కౌంటింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారని రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆరోపించారు. నాలుగో రెండు కౌంటింగ్ నిలిపివేయాలని కోరారు. దీంతో నాలుగో రౌండ్ కౌంటింగ్ రాత్రి 9 గంటల వరకు ప్రారంభించలేదు. ఓటమిని జీర్ణించుకోలేకనే ఎన్నికల అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తెలిపారు. దాంతో గురువారం సాయంత్రం కౌంటింగ్ కేంద్రాల వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. కౌంటింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తమ విధులకు ఆటంకం కలిగించారని ఏఆర్ఓ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చెల్లని ఓట్లతో అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

- మూడు రౌండ్లలోనే 23 వేలకు పైగా చెల్లని ఓట్లు
- బ్యాలెట్ పేపర్లపై చిత్ర విచిత్ర రాతలు

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపులో భారీగా చెల్లని ఓట్లు బయటపడుతుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొనగా.. మరోవైపు ఉన్నతంగా ఉండాల్సిన పట్టభద్రులు బ్యాలెట్ పేపర్లపై రాసిన చిత్ర విచిత్ర రాతలు విస్తుపోయేలా ఉన్నాయి. మూడు రౌండ్లలోనే చెల్లని ఓట్లు 23వేలకు పైగా నమోదయ్యాయి. ఇక బ్యాలెట్ పేపర్‌పై జై మల్లన్న, జై రాకేష్ రెడ్డి అంటూ కొందరు రాయగా, అభ్యర్థిని ప్రశంసిస్తూ కొందరు, ఆప్షన్ అంకె వేయకుండా కొందరు.. ఐ లవ్ యూ అంటూ మరికొందరు రాశారు. మరికొంత మంది పట్టభద్రులు ఫోన్ పే నెంబర్ వేశారు. మరికొందరు ఖాళీ బ్యాలెట్ పేపర్ కూడా వేశారు. ఇలాంటివన్నీ చెల్లని ఓట్లుగా పోతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. మొత్తంగా ఈ ఎన్నికల్లో పట్టభద్రుల అతి, అవగాహన లోపం.. బాధ్యతారాహిత్యం బయటపడింది.

రెండవ రౌండ్ లో...

రెండవ రౌండ్ లెక్కింపు పూర్తయ్యే సరికి కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 70,785, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డికి 56,114, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి 24,239 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి అశోక్ కుమార్‌కు 18,415 ఓట్లు లభించినట్టు అధికారులు ప్రకటించారు.

మూడవ రౌండ్‌లో..

మూడు రౌండ్లు పూర్తయ్యే వరకు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,06,234 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి 87,356 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి 34,516 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్ కుమార్‌కు 27,493 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 2,88,000 ఓట్లు చెల్లుబాటు కాగా 23,784 వేల ఓట్లు చెల్లుబాటు కాలేదు.

నాలుగో రౌండ్‌లో..

నాలుగో రౌండ్ ముగిసే సమయానికి కాంగ్రెస్‌కు 1,22,813 ఓట్లు, బీఆర్ఎస్‌కు 1,04,248, బీజేపీకి 43,313, స్వతంత్ర అభ్యర్థికి 29,697 ఓట్లు వచ్చాయి. కాగా, నాలుగు రౌండ్లు పూర్తయినా.. గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు 1,55,095 ఎవరికీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును చేపట్టారు.

గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్ పాసులు

టీజీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు వెల్లడి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ నెలవారి బస్ పాస్‌ను రూ.1900తో ప్రవేశపెట్టామని టీజీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాస్ ధర రూ.2530 ఉండగా 630 రూపాయలు తగ్గించి డిస్కౌంట్‌తో రూ.1900కే జారీ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ బస్సు పాస్‌తో గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులు సికింద్రాబాద్-పటాన్‌చెరువు(219 రూట్), బాచుపల్లి-వేవ్ రాక్ వయా జేఎన్‌టీయూ(195 రూట్) వరకు నడిచే రూట్‌లలో చెల్లుబాటు అవుతుందని తెలిపారు. గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లోనే కాకుండా ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో సిటీ సబర్బన్ లిమిట్స్ వరకు ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. ఈ బస్సు అత్యాధునిక హంగులతో పర్యావరణ పరిరక్షణ ప్రాతిపదికతో.. ఆహ్లాదకరమైన ప్రయాణ సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టామని చెప్పారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు పాస్ కలిగిన వారు రూ.20 కాంబినేషన్ టికెట్‌తో ఈ గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో ఒక ట్రిప్పులో ప్రయాణించొచ్చని, ఈ బస్సు పాసును గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని బస్సు పాస్ కేంద్రాల్లో జారీ చేస్తామని తెలిపారు. ప్రయాణికులు ఈ గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్ పాస్ పొంది.. సురక్షిత ఆహ్లాదకర ప్రయాణాన్ని పొందాలని, ఈ పాసు పుష్పక్ ఏసీ బస్సుల్లో చెల్లుబాటు కాదని పేర్కొన్నారు.



జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి

- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : సీఎస్‌కు కోదండరామ్, టీఎన్జీవో, టీజీవో నేతల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్



రాష్ట్రంలో ఉద్యోగులను సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో, టీజీవోలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి, త్రిసభ్య కమిటీ సభ్యులు జి చిన్నారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో టీజేఎస్ అధినేత కోదండరామ్, టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ డీఏలను ప్రకటించాలని కోరారు. ఆరోగ్యకార్డులు, 317 జీవో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు 144 మందిని వెనక్కి తేవాలని కోరారు. గచ్చిబౌలి ఇండ్ల స్థలాలు బీటీఎన్జీవో సొసైటీకి ఇప్పించాలని సూచించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. నూతన జిల్లాలకు అదనపు క్యాడర్ స్ట్రెంథ్‌ను మంజూరు చేయాలని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి సమావేశాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్, టీఎన్జీవో, టీజీవో నాయకులు శ్రీకాంత్, మల్లారెడ్డి, పరమేశ్వరరెడ్డి, నరహరిరావు, శ్రీనివాసమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గడ్డం జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ లాపై పోలీసులు అవగాహన పెంచుకోవాలి

- రాష్ట్ర డీజీపీ రవి గుప్తా
- ఐపీఎస్ అధికారులకు టీజీపీఏలో మూడు గంటల వర్క్‌షాపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వచ్చే నెల నుంచి అమలు కాబోతున్న కొత్త క్రిమినల్ లాపై ప్రతి పోలీసులు అవగాహన పెంచుకోవాలనీ, ఆ దిశగా ఐపీఎస్ అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ రవి గుప్తా కోరారు. గురువారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ(టీజీపీఏ)లో ఐపీఎస్ అధికారులకు కొత్త క్రిమినల్ లాపై నిర్వహించిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త క్రిమినల్ లా అమలు కాబోతున్నదనీ, ఈ చట్టాలపై సరైన అవగాహన కల్పించుకున్నప్పుడే ప్రజలకు తగిన విధంగా సేవలు పోలీసు శాఖ నుంచి అందగలవని డీజీపీ అభిప్రాయపడ్డారు. పాతచట్టాల స్థానంలో కొత్త న్యాయ సూత్రాలు అమల్లోకి రావడం దేశ కాలానుగుణమైన మార్పులకు అవసరంగా ఎంతో ఉపయోగకరమని ఆయన చెప్పారు. ఈ విషయంలో డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరూ కొత్త చట్టం పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల సమాజంలో న్యాయవంచితులకు సరైన మార్గ నిర్దేశం చేయగలుగుతామన్నారు. ఈ సందర్భంగా కొత్త క్రిమినల్ చట్టాలపై టీజీపీఏ రూపొందించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాపులో కొత్త చట్టంలోని అంశాలపై నల్సార్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు ఐపీఎస్ అధికారులకు అవగాహనను కల్పిస్తూ ప్రసంగించారు. అనంతరం ఐపీఎస్ అధికారులను గ్రూపులుగా విడదీసి వాటిపై చర్చలు జరిపి సందేహాలను కూడా అధికారులకు ప్రొఫెసర్లు నివృత్తి చేశారు. కార్యక్రమంలో టీజీపీఏ డైరెక్టర్ అభిలాషబిస్త్, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ తొలివిడతలో 76,720 మందికి సీట్ల కేటాయింపు

ఇంగ్లీష్ మాధ్యమంలో 72,431 మంది ప్రవేశం

- కామర్స్‌లో 28,655 మందికి కేటాయింపు
- 12 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు
- 70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు : బుర్రా వెంకటేశం, లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి తొలి విడత సీట్లను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి కేటాయించారు. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దోస్త్ తొలివిడతలో 1,04,784 మంది నమోదు చేసుకున్నారని వివరించారు. వారిలో 81,769 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని చెప్పారు. 76,290 మందికి సీట్లు కేటాయించామన్నారు. తక్కువ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసిన 5,479 మందికి సీట్లు కేటాయించలేదని వివరించారు. మొదటి ప్రాధాన్యత ద్వారా 55,124 మంది, రెండు, ఇతర ప్రాధాన్యత ద్వారా 21,166 మంది అభ్యర్థులు సీట్లు పొందారని చెప్పారు. 28,423 (37.26 శాతం) మంది అబ్బాయిలు, 47,867 (62.74 శాతం) మంది అమ్మాయిలు సీట్లు పొందిన వారిలో ఉన్నారని అన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంలోనే 72,431 మంది సీట్లు పొందారని అన్నారు. తెలుగు మాధ్యమంలో 3,314 మంది, హిందీ మాధ్యమంలో ఐదుగురు, ఉర్దూ మాధ్యమంలో 540 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఆర్ట్స్‌లో 7,766 (10.18 శాతం) మంది, కామర్స్‌లో 28,655 (37.56 శాతం) మంది, లైఫ్ సైన్సెస్‌లో 15,301 (20.06 శాతం) మంది, ఫిజికల్ సైన్సెస్‌లో 14,964 (19.61 శాతం) మంది, డేటా సైన్స్ ఏఐఅండ్ ఎంఎల్‌లో 2,502 (3.28 శాతం) మంది, డీ ఫార్మసీలో 90 (0.12 శాతం) మంది, ఇతర కోర్సుల్లో 7,012 (9.19 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. దోస్త్ పరిధిలో 886 కాలేజీల్లో 3,84,748 సీట్లున్నాయని చెప్పారు. తొలివిడతలో 76,290 మందికి సీట్లు కేటాయించామని అన్నారు. డిగ్రీ కాలేజీల్లో ఇంకా 3,08,458 సీట్లు మిగిలాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా రూ.500 లేదా రూ.వెయ్యి చెల్లించి శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈనెల 12 వరకు ఉందని చెప్పారు. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కాలేజీల్లో సీట్లు పొందిన వారు ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అర్హత పొందిన విద్యార్థులు సీటును రిజర్వ్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కోసం ఎలాంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని అభ్యర్థులు సీట్లు కోల్పోతారనీ, దోస్త్ రిజిస్ట్రేషన్ రద్దవుతుందని స్పష్టం చేశారు. దోస్త్ తొలివిడత, రెండో విడత, మూడో విడతలో సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 29 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని వివరించారు. రిపోర్టు చేయకుంటే ఆ సీటు రద్దవుతుందని చెప్పారు. దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందన్నారు. అందుకోసం తుది గడువు ఈనెల 14 వరకు ఉందని అన్నారు. ఈనెల 18న సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

యాజమాన్యాల వారీగా దోస్త్ సీట్ల కేటాయింపు

యాజమాన్యం	కాలేజీలు	సీట్ల సంఖ్య	కేటాయింపు
ప్రభుత్వ కాలేజీలు	126	53,760	12,094
ప్రభుత్వ (అటానమస్)	22	27,780	16,521
యూనివర్సిటీ (అటానమస్)	2	2,907	2,082
యూనివర్సిటీ కాలేజీలు	4	3,480	3,342
రైల్వే కాలేజీ	1	131	131
ఎయిడెడ్	26	11,010	4,086
ఎయిడెడ్ (అటానమస్)	3	1,320	913
ప్రయివేటు కాలేజీలు	699	2,80,240	35,574
ప్రయివేటు (అటానమస్)	3	4,120	1,547
మొత్తం	886	3,84,748	76,290

జేఎన్టీయూలోనూ పార్ట్‌టైం బీటెక్ : బుర్రా వెంకటేశం

జేఎన్టీయూ హైదరాబాద్‌లోనూ పార్ట్‌టైం బీటెక్‌లో చేరేందుకు అవకాశముందని బుర్రా వెంకటేశం అన్నారు. ఈసెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అందులో చేరేందుకు అర్హులని వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉన్న కోర్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఓయూలో ఉన్న ఈ విధానాన్ని జేఎన్టీయూహెచ్ లోనూ అమలు చేస్తున్నామని అన్నారు.

99.40 శాతం టాప్ మార్కులతో అలేఖ్యకు మహిళా వర్సిటీలో సీటు

ఇంటర్‌లో 99.40 శాతం టాప్ మార్కులతో తమ్మ అలేఖ్య తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో లైఫ్ సైన్స్‌లో సీటు పొందారని బుర్రా వెంకటేశం, లింబాద్రి చెప్పారు. 99.30 శాతం మార్కులతో కడం అంకిత, బానోతు అంజలి ఫిజికల్ సైన్స్‌లో, 99.20 శాతం మార్కులతో మునావర్ ఫాతిమా లైఫ్ సైన్స్‌లో, అవే మార్కులతో గునుగుంట్ల నమ్రత ఫిజికల్ సైన్స్‌లో, నూకల శివశంకర్, కొర్రా కౌసల్య ఆర్ట్స్‌లో సీట్లు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, కళాశాల విద్యాశాఖ జేడీలు జి యాదగిరి, రాజేందర్‌సింగ్, ఏజీవో పి బాలభాస్కర్, దోస్త్ అకడమిక్ కోఆర్డినేటర్ సౌందర్య జోసెఫ్, టెక్నికల్ కోఆర్డినేటర్ యమునారాణి, సీజీజీ ఏడీ గజేంద్రబాబు, దోస్త్ అడ్మిషన్ల కోఆర్డినేటర్ డి వసుంధర, హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ ఎం విజయరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా బ్యారేజీల మరమ్మతులు

- జులైలోగా పూర్తయ్యే అవకాశం
- ఈసారీ తొందరగా వరదలు
- నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన
- జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ కూడా
- అన్నారం, సుందిళ్లతో ఇబ్బంది లేదు
- మేడిగడ్డతోనే తంటా
- యంత్రాల కొరతతో ఆలస్యం
- ఆందోళనలో అధికారులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాష్ట్ర సాగునీటి, పారుదల శాఖ పర్యవేక్షణలో వర్కింగ్ ఏజెన్సీ లార్సన్ అండ్ టూబ్రో(ఎల్అండ్‌టీ) వేగంగా చేస్తున్నది. ప్రాజెక్టులోని మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్లల్లో మరమ్మతులు చోటుచేసుకుంటున్నాయి. అలాగే అటు కేంద్రం, ఇటు రాష్ట్రం నుంచి అధికారులు, నిపుణుల కమిటీలు, ఆయా సంస్థలు నిత్యం బ్యారేజీలను సందర్శిస్తూ పరీక్షలు చేస్తున్నాయి.

ఓ వైపు మరమ్మతులు జరుగుతుండగా, మరోవైపు పరీక్షలు నిర్వహిస్తుండటం గమనార్హం. పనులు గాడీన పడినట్టేనని ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ చెప్పారు. ఇదిలావుండగా కాళేశ్వరం విచారణ కోసం నియమించిన జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లో ఉండి విచారణ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఈనెలాఖరులోగా సర్కారుకు నివేదిక ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో జస్టిస్ ఘోష్ ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు, ఇతర అంశాలను ఇప్పటికే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసినట్టు తెలిసింది. అలాగే ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన జస్టిస్ ఘోష్, శుక్రవారం అన్నారం బ్యారేజీని, శనివారం సుందిళ్ల బ్యారేజీని స్వయంగా పరిశీలించనున్నారు. అలాగే సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం శుక్రవారం



మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనుల పరిశీలన కోసం వెళుతున్నారు. సాధారణ ఎన్నికల కోడ్‌ను గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తేయడంతో చేస్తున్న తొలి పర్యటన ఇదే.

జులైలోగా తాత్కాలిక మరమ్మతులు

బ్యారేజీలకు జరుగుతున్న వివిధ తాత్కాలిక మరమ్మతులు జులైలోగా పూర్తి కావచ్చని అధికారులు అంటున్నారు. శాశ్వత మరమ్మతులు చేయడానికి డిసెంబరు వరకు సమయం పట్టొచ్చనేది వారి అభిప్రాయం. అన్నారం, సుందిళ్లలో సులభంగానే పనులు పూర్తయ్యే అవకాశం ఉందని సాగు నీటి పారుదల ఇంజినీర్లు చెబుతున్నారు. కేవలం మేడిగడ్డలోనే సమస్యలున్నాయని అంటు న్నారు. ఆ బ్యారేజీ పగుళ్ల తీవ్రంగా ఉండటం,

గేట్లు మొరాయిస్తుండటంతో సమయం ఎక్కువ పడుతున్నదనే చెబుతు న్నారు. గురువారం మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్‌లోని 16, 17 నంబరు గేట్లను విజయ వంతంగా ఎత్తేశారు. మిగిలిన 18, 19, 20, 21 గేట్లను ఇంకా ఎత్తాల్సి ఉందనీ, వాటి పనులు సాగుతున్నాయని ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ అంటున్నారు. ఈ పనులు చేయడానికి కావాల్సిన యంత్రాల కొరత వర్కింగ్ ఏజెన్సీని వేధిస్తున్నదని తెలిసింది. వాటిని సమకూర్చుకునే ప్రయత్నాల్లో ఎల్అండ్‌టీ ఉంది. అవి త్వరలోనే అందుబాటులోకి రావొచ్చు. ఇందుకోసం దేశీయ సంస్థలతో సంప్రది స్తున్నట్టు సమాచారం. అలాగే విదేశాల నుంచి వేగంగా తెప్పించుకునే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. యంత్రాలు రాగానే రాత్రింభవళ్లూ పనులు చేసేందుకు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధి కారులు అంటున్నారు. ఈ మేరకు ఎల్అండ్‌టీ సమాయత్తమైందని చెబుతున్నారు. అయితే ఈవిషయంలో అధికా రులు కొంత ఆందోళనగానే కనిపిస్తున్నారు.

ఈసారీ తొందరగానే వరదలు

సాధారణంగా వర్షాలు మృగశిర కార్తెలో వస్తాయి. కాకపోతే ఈసారి ముందే వానలు పలకరించాయి. ఎల్‌నినో, లానినో ప్రభావంతో వర్షాలు ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రాణహిత నదిలో ఇప్పటికే కొంత ప్రారంభమైంది. గోదావరి నదికి జులైలో వరదలు వస్తాయని సాగునీటిపారుదల శాఖ చెబుతున్నది. ఈ తరుణంలో కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు వేగంగా చేపట్టాల్సి ఉంటుంది. ఈమేరకు వర్కింగ్ ఏజెన్సీకి సాగునీటి శాఖ అధికారులు పనుల షెడ్యూల్‌ను ఇచ్చినట్టు తెలిసింది. ఎప్పటిలోగా ఏఏ పనులు జరగాలి, నాణ్యత, ఇతర సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందనే విషయాలపై ఎప్పటికప్పుడు స్థానికంగా ఉండే సైట్ ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారు.

మరమ్మతుల ఖర్చెంత ?

కాళేశ్వరంలోని బ్యారేజీల మరమ్మతులకు ఎంత ఖర్చవుతుందనే అంచనాలు బయటకు పొక్కనీయడం లేదు. అటు ఎల్అండ్‌టీ గానీ, ఇటు సాగునీటిపారుదల శాఖ గానీ నోరు మెదపడం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం మొత్తం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో రూ.10 వేల కోట్లుగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు జ్యుడీషియల్ కమిషన్‌కు సైతం నివేదించారు. ఇప్పుడు గేట్లు, ఇతర పనుల కోసం ఎంత ఖర్చు పెడుతున్నారనే సంగతి రహస్యంగా ఉంది. ఈ విషయంపై అధికారులను అడిగితే 'అది మాకు సంబంధం లేదు..అది వర్కింగ్ ఏజెన్సీ చూసు కుంటుంది.. ఒప్పందంలో భాగంగా మరమ్మతుల ఖర్చు ఆ సంస్థ భరించాల్సిందే. పనులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయా ? లేదా ?, నాణ్యత ఇతర అంశాలను మేము ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాము' అని అధికారులు చెబుతున్నారు. సాంకేతికంగా కూడా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన
- నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల సందర్శన



నవతెలంగాణ- బేగంపేట్

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన చేయిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ నల్లగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్జేడి విజయలక్ష్మి, డీఈవో రోషిణి తదితర అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు తక్కువ అని, అనవసరంగా ఫీజుల రూపంలో డబ్బు పోగొట్టుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మంచినీళ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రయివేటు పాఠశాలల నుంచి ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లోకి పిల్లలను తీసుకొచ్చారని కమిషనర్ కొంత మంది తల్లిదండ్రులను అడగ్గా.. ప్రయివేటులో ఫీజులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ చేర్పిస్తున్నామని వారు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బోధన కూడా బాగుంటుందన్నారు. అలాగే కొంత మంది విద్యార్థులతో కమిషనర్ మాట్లాడి వివిధ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 1వ తరగతికి చెందిన హర్షిత అనే విద్యార్థిని 19వ టేబుల్ చెప్పడంతో ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ శౌరిని అభినందించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐవోఎస్ సుమన్, డిప్యూటీ ఈవో శ్రీధర్, హైస్కూల్ హెచ్ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పునరుద్ధరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఎలక్షన్‌కోడ్ కారణంగా వేలాది సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు నిలిచిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసి మధ్యలో నిలిపివేసిన సుమారు 60 వేల చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం చెక్కులు పంపిణీ చేయనున్నది.

జస్టిస్ ఘోష్ రాక
సాగునీటిశాఖ అధికారులతో భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు జ్యుడీషియల్ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. కోల్‌కతా నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చిన ఆయన, నేరుగా హోటల్ తాజ్ కృష్ణాకు చేరుకున్నారు. అక్కడే తొలుత సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో భేటీ అయ్యారు. అనంతరం కమిషన్ కార్యాలయానికి వచ్చి అధికారులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. ఇప్పటి వరకు జరిగిన జ్యుడీషియల్ కమిషన్ వ్యవహారాలను సమీక్ష చేశారు. శుక్రవారం అన్నారం బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నారు. శనివారం సుందిళ్ల బ్యారేజీని చూస్తారు. అక్కడి నుంచి ఆ సాయంత్రం నేరుగా నగరానికి చేరుకుంటారు. ఆదివారం నుంచి పూర్తిగా బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని కమిషన్ కార్యాలయంలోనే ఉంటూ అధికారిక పనులు చూసుకోనున్నారు. ఈనెలాఖరులోగా విచారణ పూర్తి చేయాలని సర్కారు ఆదేశించిన తరుణం లో ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. సాధ్యమైనంత వేగంగా నివేదిక తయారుచేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి గానీ, సీఎం రేవంత్‌రెడ్డికి గాని అందించే అవకాశం ఉందని తెలిసింది.

ఇద్దరు యువకుల దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఘటన

నవతెలంగాణ-ఆమనగల్

ఇద్దరు యువకులు దారుణహత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీలో జరిగింది. కడ్తాల్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన జలకం రవి కడ్తాల్ సమీపంలో ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీలోని 3/4/5 విల్లాలను బుధవారం రాత్రి అద్దెకు తీసుకున్నాడు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజుగౌడ్, మరికొంత మందిని అక్కడికి పిలిపించుకున్నాడు. వీరితో పాటు గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివ (27), గుండెమోని శివ (25)నూ అక్కడికి పిలిపించాడు. కాగా, రాత్రి అక్కడే వీరి మధ్య గొడవ జరగడంతో శేషుగారి శివ, గుండెమోని శివను నిందితులు అతి కిరాతకంగా చంపి అక్కడి నుంచి పారిపోయారు. గురువారం ఉదయం మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, కడ్తాల్ ఆమనగల్ సీఐలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్, ఎస్ఐలు వరప్రసాద్, బాల్ రామ్.. ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాల ఆందోళన

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వారి బంధువులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. హత్యకు కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు తమ ఆందోళన విరమించారు. హత్యకు గురైన శేషుగారి శివ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. గుండెమోని శివ చికెన్ షాప్‌లో పనిచేస్తుండే వాడని స్థానికులు తెలిపారు.

నిమ్స్‌లో మంత్రి పొన్నంకు వైద్యపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ విభాగం సీనియర్ వైద్యులు ప్రొఫెసర్ సాయిసతీష్, జనరల్ మెడిసిన్ వైద్యులు ప్రొఫెసర్ నావెల్ చంద్ర, పల్మనాలజీ సీనియర్ వైద్యులు పరంజ్యోతి ప్రత్యేక పర్యవేక్షణలో ఆయనకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వారికి నిమ్స్‌లో అందిస్తున్న సేవల గురించి ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ మంత్రికి వివరించారు. పేద రోగులకు అందుతున్న సేవలపై పొన్నం సంతృప్తిని వ్యక్తం చేశారు.

మూల్యాంకనం కేంద్రాల వద్ద
నేటినుంచి దశలవారీ కార్యక్రమాలు : టీజీజేఎల్ఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

ఇంటర్ వార్షిక పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం నుంచి మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

9న గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 897 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 4.03 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు
- బడి పిల్లలకు యూనిఫారాలు పంపిణీ చేయాలి
- రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి : కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 9న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆమె గురువారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు యూనిఫారాల పంపిణీ తదితర అంశాలను సీఎస్ ప్రస్తావించారు. రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి చెప్పారు. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతోపాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమించామని అన్నారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కోఆర్డినేటర్‌ను కూడా నియమించామన్నారు. బయోమెట్రిక్ హాజరు కోసం ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ఏదైనా సమస్య తలెత్తితే తగిన సంఖ్యలో బయోమెట్రిక్ పరికరాలను కూడా అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లా కలెక్టర్లకు కూడా పరీక్షల ఏర్పాట్లపై తగు ఆదేశాలు జారీ చేశామనీ, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందని సీఎస్ చెప్పారు. గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పరిస్థితిని నిశితంగా పరిశీలించేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

బ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను సీఎస్ అభినందించారు. రాబోయే మూడు వారాల పాటు ఇదే నిఘా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్యాక్ చేసిన విత్తనాలను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సీజన్ ముగిసే వరకు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను భద్ర పరుచుకునేలా చూడాలనీ, తద్వారా అవసరమైతే నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకునేందుకు వీలవుతుందని అన్నారు. కేంద్ర గోడౌన్ల నుంచి మండల స్థాయి వరకు ఎరువుల తరలింపును పర్యవేక్షించి సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనీ, దుకాణాల్లో నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభించే నాటికి ఒక జత యూనిఫారం విద్యార్థులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ దివ్య, టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. డీజీపీ రవిగుప్తా, ఇతర పోలీసు అధికారులు పోలీస్ అకాడమి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

జులై 10న డీసెట్

- రేపటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2024 రాతపరీక్ష వచ్చేనెల పదో తేదీన జరగనుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 30వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇంటర్ లేదా తత్సమాన పరీక్షల్లో 50 శాతం మార్కులు వచ్చిన వారే దరఖాస్తు చేసేందుకు అర్హులనీ, ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులొచ్చినా దరఖాస్తు చేయొచ్చని సూచించారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలని వివరించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో డీసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సబ్‌ఎడిటర్ కరుణాకర్‌రెడ్డికి పితృవియోగం

- నవతెలంగాణ జిల్లా సభ్యుల నివాళి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సంతాపం



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

నవతెలంగాణ ఖమ్మం రీజియన్‌లో సబ్‌ఎడిటర్‌గా పని చేస్తున్న శాబాద్ కరుణాకర్‌రెడ్డి తండ్రి శాబాద్ నారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామం వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో వారం రోజుల కిందట ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నవతెలంగాణ ఖమ్మం ఉమ్మడి జిల్లా బృందం సందర్శించి నివాళి అర్పించారు. మృతదేహంపై నవతెలంగాణ మాజీ జనరల్ మేనేజర్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు, రీజనల్ మేనేజర్ ఎస్‌డీ జావీద్ పూలమాల వేసి జోహర్లు అర్పించారు. నవతెలంగాణ నుంచి దహన సంస్కార నిమిత్తం ఆర్థిక సాయంగా రూ.10వేలు అందజేశారు.

శాబాద్ కరుణాకర్‌రెడ్డిని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పారు. నివాళర్పించిన వారిలో నవతెలంగాణ నల్గొండ రీజనల్ మేనేజర్ పుప్పాల మట్టయ్య, ఖమ్మం డెస్క్ ఇన్‌చార్జీ వీరేష్, ప్రాంతీయ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, సబ్‌ఎడిటర్లు వెంకటేశ్వర్లు, ఉపేంద్ర, విలేకరులు ఇరుగు వెంకటేశ్వర్లు, నారాయణ, శివారెడ్డి, వీరారెడ్డి, గుమ్మడి నర్సయ్య, అంజయ్య ప్రసాద్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, జక్కంపుడి కృష్ణ తదితరులు ఉన్నారు. నవతెలంగాణ సీజీఎమ్ ప్రభాకర్, ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్, మఫిషల్ డెస్క్ ఇన్‌చార్జి మేణుమాధవ్ సంతాపం తెలిపారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి సంతాపం

శాబాదు నారాయణరెడ్డి మరణవార్త తెలిసిన వెంటనే ఆయన కుమారుడు కరుణాకర్ రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్ ఫోన్ ద్వారా సంతాపం తెలిపారు. తాము అందుబాటులో లేకపోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులు మనో నిబ్బరంతో ఉండాలని తెలిపారు. సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఊరడి సుదర్శన్ రెడ్డి, సీపీఐ నాయకులు దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

గుప్తనిధి పేరిట రూ.80 వేల టోకరా

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ముఠాను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ రమేష్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గుప్త నిధుల పేరిట రూ.80 వేల టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమాయకులకు నిధుల ఆశ చూపి మంత్రాలు, చేతబడులు చేస్తామని నమ్మబలికిన ముఠాను ఆసిఫాబాద్ జిల్లా సిరూర్(టి) మండల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ దికొండ రమేష్ గురువారం వివరాలు వెల్లడించారు. కౌటాల మండలానికి చెందిన మీసాల బాపురావు తనకు దేవరా వస్తుందని, ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే భూత వైద్యం చేసి నయం చేయడంతోపాటు గుప్తనిధుల తవ్వకాలు చేస్తానని మండలానికి చెందిన జోజప్పకు పరిచయం చేసుకున్నాడు. సిర్పూర్-టి డౌనల్ ఏరియాలోని మీ మామ ఇంట్లో గుప్తనిధి ఉందని జోజప్పకు చెప్పాడు.

అతని మాటలు నమ్మిన జోజప్ప మామ ఇంట్లో ఉన్న నిధిని తీసేందుకు ఒప్పుకున్నాడు. నిధిని బయటకు తీయాలంటే పూజలు చేయాలని, పూజ సామాగ్రి కొనుగోలు చేయడానికి రూ.80 వేలు కావాలన్నాడు. దీంతో జోజప్ప ఆ డబ్బులను బాపురావుకు ఇచ్చాడు. గత సంవత్సరం డిసెంబర్ 4న బాపురావుతో పాటు చింతకుంట గ్రామానికి చెందిన మరో ఇద్దరు లవుద్యా శ్రీధర్, అజ్మీర ప్రసాద్‌తో కలిసి ఇంటికొచ్చి అర్ధరాత్రి పూజలు చేశారు. ఇంట్లో తవ్వుతున్న సమయంలో జోజప్పను బయట ఉండాలని చెప్పారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మళ్లీ లోపలకు పిలిచి తవ్వుతుండగా మట్టి నుంచి మూట ఒకటి బయట పడిందని, అందులో నిధి ఉందని, దానిని ఎవరూ చూడకూడదు.. విప్పకూడదని చూస్తే చనిపోతారని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండు నెలల తర్వాత బాపురావు చింతకుంట గ్రామంలోని ఓ మహిళ ఇంటికి వైద్యం చేయడానికి వచ్చాడు. మీ ఇంట్లో గుప్తనిధి ఉందని నమ్మించి పూజలు చేసి తవ్వకాలు మొదలు పెట్టారు. ఆమెను కూడా కొద్దిసేపు బయట ఉండమని చెప్పి తమ వెంట తెచ్చిన నకిలీ బంగారు బిస్కెట్‌ను ఒక గంజులో పెట్టి బట్టకట్టి పూడ్చిపెట్టారు. తర్వాత ఆమెను లోపలికి పిలిచి మట్టిని తొలగించి బట్టకట్టిన గంజును బయటకు తీశారు. అర కేజీ బంగారం బిస్కెట్ లభ్యమైనట్టు చెప్పారు.ఈ క్రమంలో తాను మోసపోయినట్టు తెలుసుకున్న జోజప్ప తన రూ.80 వేలు ఇవ్వాలని బాపురావును అడగ్గా.. డబ్బులు ఇచ్చేవరకు బంగారం బిస్కెట్‌ను దగ్గర ఉంచుకోవాలని ఇచ్చాడు.

దాన్ని తీసుకెళ్లి అతను పరీక్షించగా.. నకిలీదని తేలింది. దాంతో జోజప్ప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విజయం బయటపడింది. విచారణ చేపట్టిన పోలీసులు ఆ దొంగ ముఠాను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. గుప్తనిధుల పేరుతో మళ్లీ ఎవరైనా వచ్చి మాయమాటలు చెబితే నమ్మొద్దని ఎస్ఐ ప్రజలకు సూచించారు. అలాంటివి వారు ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పర్యావరణ అనుకూల
బల్క్ రవాణాకు రైల్వేలు సాధనం

- రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారతీయ రైల్వేలు పర్యావరణ అనుకూల బల్క్ రవాణాకు ఒక సాధనాలని రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా'మన భూమి, మన భవిష్యత్' నినాదంతో బుధవారం సికింద్రాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ కాలుష్యం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, వనరులు, ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడం, సుస్థిరతకు దోహదం చేయడం ద్వారా పర్యావరణంపై సానుకూల ప్రభావాన్ని చూపే నిరంతర కార్యక్రమాలను రైల్వేలు చేపడుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలను చెల్లించాలి


- సీఎం రేవంత్‌రెడ్డికి పీఆర్టీయూ తెలంగాణ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను మంజూరు చేయాలనీ, నాలుగు డీఏలను చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని తెలిపారు. భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. 13 జిల్లాలకు పెండింగ్‌లో ఉన్న స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరారు. మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, అన్ని రకాల గురుకుల సొసైటీల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని తెలిపారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లను నియమించాలని కోరారు.

సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లండి

ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్



నవతెలంగాణ - హయత్ నగర్

ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల కేసులలో పట్టుబడిన 83 బైకులను ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో భద్రపరిచినట్టు ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వాహనాల యజమానులకు నోటీసులు ఇచ్చి సమాచారం తెలియపరిచినట్టు చెప్పారు. ఆ వాహన యజమానులు వచ్చి సరైన పత్రాలు చూపించి.. వాటిపై ఉన్న చలాన్లను క్లియర్ చేసి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. సమాచారం కోసం 8712662773 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'అనుమతులు లేని కళాశాలలను సీజ్ చేయాలి'

నవతెలంగాణ - సంతోష్‌నగర్



ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేని ప్రైవేట్ కళాశాలలను సీజ్ చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్మీడియట్ బోర్డు ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ.. అనుమతులు లేని ప్రైవేట్ కళాశాలల శ్రీ చైతన్య, నారాయణలను సీజ్ చేయకపోతే ఆ కళాశాలలను ధ్వంసం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఓర్షూకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, సహాయ కార్యదర్శి మాజిద్, కళ్యాణ్, అనిల్, రాజు, మహేష్ పాల్గొన్నారు.



పార్కు స్థలాన్ని కాపాడండి

- నందీహిల్స్ కాలనీవాసులు

నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నందీహిల్స్ కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలని కోరుతూ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి నందీహిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందీహిల్స్ రెసిడెన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలోని నందీహిల్స్ కాలనీ రోడ్డు నెంబర్ 8లో దాదాపు 2100 గజాల పార్కు స్థలం ఉందన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గంలోని ప్రధాన వ్యక్తి కబ్జా చేసేందుకు తప్పుడు పత్రాలు సృష్టించి అమ్మేశాడని ఆరోపించారు. కొనుగోలు చేసిన వ్యక్తి పార్కు స్థలంలో సిమెంట్ కడ్డీలను వేసి, పెన్సింగ్ చేస్తున్నాడని చెప్పారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పెన్సింగ్ తొలగించి పార్కు స్థలాన్ని కాపాడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రామిడి నర్సిరెడ్డి, నందీహిల్స్ కాలనీ ఫేజ్ -1 అధ్యక్షుడు చల్లా సురేందర్ రెడ్డి, నందీహిల్స్ కాలనీ ఫేజ్-2 అధ్యక్షుడు సిద్ధప్ప, చంద్రశేఖర్ రెడ్డి, మధు, కొల రమేష్, శేషిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు ఉన్నారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

వర్షాకాలం.... అప్రమత్తమైన జీహెచ్ఎంసీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

గత నెల చివరి వారంలో భారీ వర్షాలతో నగరం హడలెత్తిపోయింది. గ్రేటర్‌లోని పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. రహదారులు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలావుండగా నగరంలో గురువారం భారీ వర్షంతో తడిసిముద్దయింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురియడంతో నగరం అతలాకుతలమైంది. పలు చోట్ల రోడ్లపై మోకాల్లోతు వరద నీరు చేరింది. దాంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో విస్తరించడంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్స్, మాన్‌సూన్ టీమ్స్ అప్రమత్తం

2020 సంవత్సరంలో నరగంలో కురిసిన భారీ వర్షాలకు గ్రేటర్‌లోని బస్తీలు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమైన విషయం తెలిసిందే. ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదీగూడ, నిజామ్‌పేట్‌తోపాటు వందలాది ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లలోనికి వరద నీరు చేరాయి. మురుగు నీటితో కంటిపై కునుకు లేకుండా స్థానికులు గడిపారు. జీహెచ్ఎంసీ సిబ్బంది పడవలపై వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు అధికారులు అన్ని చర్యలపై దృష్టి సారించారు. పాత భవనాలు, ఇండ్లపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం వాటి పటిష్టతను పరిశీలిస్తున్నారు. అవసరమైతే వాటిని కూల్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలో భాగంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్స్, మాన్‌సూన్ టీమ్స్‌లను అప్రమత్తం చేశారు. ఈ బృందాలు ఎక్కడ వాటర్ నిలిచిన క్లియర్ చేయడం, చెట్లు విరిగిపడిపోయినా సహాయక చర్యలు అందించేలా పనిచేయనున్నాయి.

చెత్తా చెదారంతో నిండిపోతున్న వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు

నగరంలో భారీ వర్షం ముంచెత్తిన సమయంలో నగరవాసుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో బస్తీలు, కాలనీలు, రహదారులు చెరువులను తలపిస్తాయి. స్థానికుల ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. ఇక సాయంత్రం వేళ వర్షం పడిందంటే చాలు ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు ఉద్యోగులు అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది. కిలోమీటర్ ప్రయాణాన్ని గంటల తరబడి వెళ్లాల్సి వస్తుంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రధాన రహదారులపైన వున్న వాటర్ స్టాగ్నెట్ అవ్వడంతో ఎక్కువగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. నగరంలో అధికారులు 339 వాటర్ లాగిన్ పాయింట్లను గుర్తించారు. ఈ బ్లాక్ పాయింట్స్ మెయిన్ రోడ్లపై, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద, లింగంపల్లి రైల్వే అండర్ పాస్, యూసఫ్ గూడా మెయిన్ రోడ్, రాజ్ భవన్ రోడ్, ఫిల్మ్ నగర్, మూసాపేట్ మెట్రో స్టేషన్, బాలానగర్ బస్ స్టాప్, చింతల్ రోడ్, జీడిమెట్ల హై టెన్షన్ రోడ్, మలక్ పేట సహా పాతబస్తీలో పలు ఏరియాల్లో నీరు నిలిచి డేంజర్ స్పాట్స్‌గా ఉన్నాయి. ఈ వాటర్ లాగిన్ పాయింట్స్ అన్నీ కూడా వర్షం, మురుగు నీరుతో నిండి పోతున్నాయి.

అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలి : కమిషనర్

నగరంలో వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించిన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ శేరిలింగంపల్లి జోన్ మాదాపూర్ సర్కిల్ బాటా షోరూం, యశోద హాస్పిటల్, శిల్పారామం తదితర ప్రాంతాలలో వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లను జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలుసూచనలు సలహాలను అందించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

- కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హయత్ నగర్ డివిజన్ హై కోర్ట్ కాలనీలోని పలు విధుల్లో ఉన్న రోడ్లపై నీరు నిలిచి, ప్రమాదకరంగా మారడంతో





స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. మాన్ సూన్ టీమ్ సహాయంతో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించారు. ఈ సహాయక చర్యల్లో ఎస్ఈ అశోక్ రెడ్డి, ఈఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి



నవతెలంగాణ - చైతన్యపురి

జాతీయ లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు జూన్ 8న (రెండవ శనివారం) రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇది వరకు కోర్ట్ ముందుకు రాని కేసులు కానీ, కోర్ట్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునే/రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసు లోక్ అదాలత్‌కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు. ఈ లోక్ అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృధా కాకుండా ఉంటుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం



- కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం డివిజన్ పరిధిలోని భవాని నగర్, శ్రీరామ హిల్స్ కాలనీ, గణేష్ నగర్ ఫేస్-1లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న కురిసిన చిన్నపాటి వర్షానికే డ్రైయినేజీ పొంగిపొర్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమన్వయంతో అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గణేష్ నగర్ ఫేస్-1, రామ్ రాజ్ కాటన్ వద్ద నుండి చేపడుతున్నటువంటి స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు నత్తనడకనగా సాగడం వలన గణేష్ నగర్ ఫేస్-1లోని రోడ్లన్నీ డ్రైయినేజీ మురుగు నీటితో దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సివరేజ్ మ్యాన్ హెూల్స్ కవర్స్ డ్యామేజ్ అయిన వాటిని తక్షణమే రిపేర్ చేయాలన్నారు.

రోడ్ భవనాల శాఖ అధికారులు పనామా వద్ద నుండి చేపడుతున్న నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధి పనులను వేగంగా చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, వాటర్ వర్క్స్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఆయా కాలనీ వాసులు సత్యనారాయణ, పద్మారావు, రాజశేఖర్, జైపాల్ రెడ్డి, నర్సింహ, జవాన్ శ్రీనివాసరావు ఉన్నారు.

బీజేపీ ఎంపీలకు ఘన సన్మానం





నవతెలంగాణ - బడంగ్ పేట్

మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ, మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్‌లు విజయం సాధించిన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం వారి వారి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 8 ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం ప్రధాని నరేంద్ర మోడీ పనితనానికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ అవతరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు పున్న భిక్షపతి, జంగారెడ్డి, ఢిల్లీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్

రాష్ట్ర అధ్యక్షురాలిగా శృతి

నవతెలంగాణ - వనస్థలిపురం

తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్‌లో గురువారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. దీంట్లో తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ముకిరి శృతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు శృతి మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన వెయిట్ లిఫ్టర్లను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ వెయిట్ లిఫ్టింగ్ గేమ్స్ పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తి కలిగిన యువతను అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్లుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. టి డబ్ల్యూ ఏ ఆదర్శనీయంగా ముందుకు నడిపి గ్రామీణ స్థాయి యువతీ యువకులను కూడా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి కనీసం ఐదుగురు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి కావాల్సిన సదుపాయాలను సమకూర్చడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ పి.వెంకటరమణ, ట్రెజరర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొండ విశ్వేశ్వర్ రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ - బడంగ్ పేట్

చేవెళ్ల ఎంపీగా విజయం సాధించిన కొండ విశ్వేశ్వర్ రెడ్డిని గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి వెంట బీజేపీ సీనియర్ నాయకులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో..

చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సింగల్ విండో చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బడంగ్ పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత



పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. భిక్షపతిచారి, రాజశేఖర్, జె.శ్రీశైలం, ఆర్.మహేంద్ర రెడ్డి, గోపి, నరేష్, మానోజ్, శేఖర్ రెడ్డి, నరేందర్, కృష్ణ నర్సింరావ్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో నిర్మించిన 'సెంటినరీ కన్వెన్షన్ సెంటర్'ను ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు గురువారం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇందుకు స్పందించిన సీఎం తప్పకుండా హాజరవుతానని రామేశ్వర్‌రావుకు హామీ ఇచ్చారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- చిగిరింత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగిరింత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ, మున్సిపల్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ





రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది

- ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - నాగోల్

అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం అమావాస్య అన్నదానం సందర్భంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానాలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యదర్శి కటకం శ్రీనివాస్ గుప్త, ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బెలిదే రవి కుమార్ గుప్త, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర వైస్



ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్ర శేఖర్ గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ గుప్త, యూత్ అధ్యక్షుడు కట్ట రవి కుమార్, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్ గుప్త, వేంకటేశ్వర రావు, బుషెట్టి శ్రీనివాస్, నారాయణ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - చైతన్యపురి

గురువారం అమావాస్య సందర్భంగా ఓం శ్రీ మాత్రే నమః మహిళ సంఘం ఆధ్వర్యంలో చైతన్య పురిలో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో- కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల, రాజు, ఇందిరా, నిర్మల, స్వాతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ధర్నా

నవతెలంగాణ - సంతోష్‌నగర్

క్రీడా కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని యూనియన్ అధ్యక్షులు మీసాల శ్రావణ్ కుమార్ కోరారు. సంతోష్ నగర్ హైదరాబాద్ సౌత్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆఫీస్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినా అధికారులు స్పందించడం లేదన్నారు. వ్యవసాయ పరిశోధన కార్యాలయంలోని డైరెక్టర్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రోజురోజుకూ కార్మికులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మేనేజ్మెంట్ ఆలోచించి యూనియన్ నాయకులతో చర్చలు జరిపి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వెంకటేష్ గౌడ్, ప్రభాకర్, రఘు పాల్గొన్నారు.



మాజీ సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-కాప్రా

ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి ,బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్లాట్ కబ్జా... తండ్రి కొడుకులపై కేసు

నవతెలంగాణ-ఘట్‌కేసర్

పైసా పైసా కూడగట్టుకుని ఓ వాచ్ మెన్ కొనుగోలు చేసిన ప్లాటును కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడిన చౌదరిగూడ మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, అతని కుమారుడు విఘ్నేష్ గౌడ్ లపై కేసు నమోదైంది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధి చౌదరిగూడలో జరిగింది. పోచారం ఐటీసీ ఇన్ స్పెక్టర్ రాజువర్మ తెలిపిన ప్రకారం.. చౌదరిగూడ పంచాయతీ లోని సర్వే నెంబర్ 756 లోని ప్లాట్ నెంబర్ 261 పార్ట్‌ను నగరంలోని బేగంపేటకు చెందిన వాచ్ మెన్ మల్లారెడ్డి 2005లో కొనుగోలు చేశాడు. అదే పంచాయతీ మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, అతని కుమారుడు విఘ్నేష్ గౌడ్ లు అతని ప్లాటును కబ్జా చేసి దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరింపులకు దిగారు. చుట్టు ఉన్న ప్రహారిగోడ, బోర్‌ను ధ్వంసం చేశారు. ప్లాటు వద్దకు వెళితే బెదిరింపులకు దిగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ ప్రవేశపెట్టిన ప్రజావాణిలో బాధితుడు ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు పోచారం ఐటీ కారిడార్ పోలీసులను విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణ జరిపిన పోలీసులు.. నిందితులు బైరు రాములు గౌడ్, బైరు విఘ్నేష్ గౌడ్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలన్నందుకు మహిళ హత్య

- కేసును చేధించిన మేడిపల్లి పోలీసులు, నిందితుడు అరెస్ట్

నవతెలంగాణ-బోడుప్పల్

అప్పుగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమన్నందుకు ఓ మహిళకు ఫోన్ చార్జింగ్ వైర్‌ను మెడకు బిగించి హత్య చేసిన దారుణ ఘటనలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్‌లో ఓ అద్దె గదిలో ఈ నెల 1వ తేదీన మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెంది కనిపించిన సంగతి తెలిసిందే. ఈ కసు చేధించినట్లు పోలీసులు తెలిపారు. బెంగుళురుకు చెందిన సత్యనారాయణ పటేల్ బోడుప్పల్ మల్లికార్జున్ నగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. స్థానికంగా రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ చేస్తున్నాడు. అదే కాలనీలో ఉషారాణి (60) అనే మహిళ తన కూతురు విదేశాలలో ఉన్నందున్న ఓ అపార్ట్మెంట్‌లో ఒంటిరిగా నివాసం ఉంటోంది. అయితే ఉషారిణి కూడా రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ చేయడంతో సత్యనారాయణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఉషారిణి వద్ద సత్యనారాయణ రూ.1.50 లక్ష అప్పుగా తీసుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వాలని గత కొన్నాళ్ల నుంచి ఉషారాణి అడగడంతో పాటు డబ్బులు ఇవ్వకపోతే పరువు తీస్తాననడంతో సత్యనారాయణ ఓ రోజు డబ్బులు ఇస్తానని నమ్మబలకి ఇంటికి రమ్మన్నాడు, ఇంట్లోకి రావడంతోనే దారుణంగా ఫోన్ చార్జింగ్ వైర్‌ను మెడకు చుట్టి హత్య చేసి ఇంటి నుంచి పరారయ్యాడు. దర్యాప్తులో భాగంగా సత్యనారాయణను గురువారం ఉప్పల్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు పాల్పడినట్టు తెలపడంతో రిమాండ్‌కు తరలించిట్టు పోలీసులు తెలిపారు



ఘనంగా వైఎస్ఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఘట్కేసర్

రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు,ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీ తాళ్ల వెంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నోజిగూడ శివ ఫంక్షన్ హాల్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైఎస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యం లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 100 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం ఎంపీపీ కేక్ బదులు పిల్లలకు చదువుకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను కార్యకర్తలు, అభిమానులు, నాయకులు వారికి అంద జేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా విశ్రాంత కలెక్టర్ ఎం.వి రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రా రెడ్డి నియోజకవర్గ మున్సిపల్ కార్పొరేషన్ మండల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-కాప్రా

వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రాస్ రోడ్డులో అమావాస్య అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం కుషాయిగూడకు చెందిన పేద వద్దురాలు మాలే వరమ్మకు నెల పింఛను రూ 1000 అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రామిని తిరుమలేశ్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంపా కష్ణ, ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణి, నంగునూరి అశోక్, కార్యదర్శులు బాచిల్లి నవీన్, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్, ఉప్పల ఆంజనేయులు, సభ్యులు ఉప్పల శ్రీనివాస్, భగవాన్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు


ఆర్థిక సహాయం చెక్కులు అందజేత

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పారిశ్రామిక వాడలోని షీలా ఫోమ్ కంపెనీలో పనిచేసే కార్మికులు కె.శంకర్, అహ్మద్ బేగం లు ఇటీవల కాలంలో మరణించారు.



వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు కార్మిక సంక్షేమ నిధి మరణ ప్రయోజన పథకం కోసం బీఆర్టీయూ జిల్లా జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్‌లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేయించారు.కాగా వారికి మంజూరైన చెక్కులను గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కార్మిక సహాయ అధికారి యాదయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్థిక సహాయం మంజూరుకు సహకరించిన మల్కాజ్ గిరి ఎమ్మెల్యే, యూనియన్ గౌరవ అధ్యక్షులు మర్రి రాజశేఖర్ రెడ్డి, సలహాదారు పి.నారాయణలకు కతజ్ఞతలు తెలియజేశారు.





బీజేపీ నేతలకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-మేడ్చల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బీజేపీ మేడ్చల్ మండల అధ్యక్షుడు గోపన్నగారి సింగిరెడ్డి నరేందర్ రెడ్డిల జన్మదినం సందర్భంగా గురువారం పలువురు బీజేపీ నాయకులు వేర్వేరుగా వారి నివాసంలో కలసి శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లంపేట జగన్ గౌడ్,అసెంబ్లీ కన్వీనర్ అమర మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి,బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి,మండల కార్యదర్శి మహేష్,గోవిందా రెడ్డి,మహేష్ ఉన్నారు.

కాంగ్రెస్ నేతలు అభివృద్ధి నిరోధకులు

- మాపై కావాలనే కుట్రలు చేస్తున్నారు
- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

కాంగ్రెస్ నేతలు అభివృద్ధి నిరోధకులని, తమపై కావాలనే కుట్రలు చేస్తున్నారని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని ఐదు నెలలుగా కాంగ్రెస్ నాయకులు చేయని కుట్రలు, డ్రామాలు, అనైతిక చర్యలు అందరికీ తెలుసన్నారు. దీంతో కార్పోరేషన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం, డెవలప్మెంట్ పై చేసే క్రమంలోనే తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందని, ఈ క్రమంలో అవిశ్వాస ప్రక్రియను ముగించుకొని ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు చేయాలని తన మీద, తానే బల నిరూ పణకు వెళ్లినట్టు తెలిపారు. అయితే బలనిరూపణకు వెళ్లే సమయంలో తనపై కలెక్టర్ కు, ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పోరేటర్లు తనకు మద్దతుగా ఉన్నారన్నారు.. తదనంతరం ప్రలోభాలకు లొంగి తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగా 2024 మే 6వ తేదీన తన సహచర మెజార్టీ కార్పోరేటర్ల మద్దతుతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం దరఖాస్తు పెట్టుకున్నానని తెలిపారు. మే 7వ తేదీన కాంగ్రెస్ గూటికి చేరిన కార్పోరేటర్లు కలెక్టర్‌కు, 'మమ్మల్ని తప్పుదోవపట్టిస్తూ సంతకాలు పెట్టించుకున్నారని, కాబట్టి సంతకాలను పరిగణలోకి తీసుకోవద్దు అని ఓ ఫిర్యదు చేశారని తెలిపారు. ఈ రెండు దరఖాస్తును స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఈ రెండు దరఖాస్తులను కూడా పరిశీలించి సమగ్ర విచారణ, సంతకాలపై మున్సిపల్ అధికారుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి 2024 జూన్ 5వ తేదీన అవిశ్వాసం పెట్టాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఈ క్రమంలోనే జూన్ 5వ తేదీన ఉదయం 11.00 గంటలకు పీర్జాదిగూడ మున్సిపల్ అధికారులు అవిశ్వాసం కోసం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారన్నారు.

కానీ అవిశ్వాసం జరుగుతుందనగా జిల్లా కలెక్టర్ ... జూన్ 5న ఉదయం 11.50 గంటలకు అవిశ్వాసం నిలుపుదల చేస్తూ ఆర్డర్ జారీ చేశారన్నారు. మేడిపల్లి పోలీసు స్టేషన్ లో మేయర్ పై నమోదైన కేసు నేపథ్యంలో అవిశ్వాసం నిలుపుదల చేస్తున్నట్లు కలెక్టర్ తన ఆర్డర్ లో పేర్కొన్నారన్నారు. ఓ ముగ్గురు కార్పోరేటర్లు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై జూన్ 1వ తేదీన కేసు నమోదు అయితే.. కలెక్టర్ జూన్ 5వ తేదీన ఆర్డర్ జారీ చేశారని చెప్పారు. కలెక్టర్ ఐదు రోజులు గడువు ఎందుకు తీసుకున్నారో ప్రజలు గమనించాలన్నారు.అసలు ఈ కేసుకు, రాజ్యాంగ బద్ధంగా ప్రకటించిన అవిశ్వాసానికి సంబంధం ఏమిటి..?వాళ్ల అవిశ్వాసం ఎదుర్కోలేకనే, వాయిదా వేయించాలనే కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసు పెట్టారన్నారు. అది మీడియా మిత్రులతో పాటు పోలీసులకు, కలెక్టర్ కూడా తెలుసు అన్నారు. అలాగే ఈ కేసుపై మేడిపల్లి పోలీసులు ప్రాథమిక విచారణ కూడా జరపలేదు కానీ ఆ కేసు నిరూపణ, నిర్ధారణ కానప్పుడు కలెక్టర్ ఏ విదంగా ఈ కేసును పరిగణలోకి తీసుకొని అవిశ్వాసాన్ని రద్దు చేశారని ప్రశ్నించారు. ఇదొక్కటే కాదు.. కాంగ్రెస్ నాయకులకు బలం లేక అవిశ్వాసాన్ని ఆపేందుకు 2024 మే 19వ తేదీన ఔటర్ రింగు రోడ్డుపై తనను హత్యా చేసేందుకు ప్రయత్నం చేశారని, తనతో పాటు తనకు మద్దతుగా ఉన్న కార్పోరేటర్లను కిడ్నప్ చేసేందుకు యత్నించారని తెలిపారు. ఈ ఘటనపై ఘట్కేసర్ పోలీసు స్టేషన్ లో నమోదైన కేసు పెండింగ్ లో ఉందన్నారు.అలాగే అవిశ్వాసం ఆపాలని హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారని, కానీ వాళ్లకు కోర్టులోను భంగపాటు తప్పలేదని చెప్పారు. అవిశ్వాసం సభ్యుల ప్రాథమిక హక్కు కాబట్టి ఆ ప్రక్రియను ఆపలేమని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, అవిశ్వాసం నిర్వహించే జూన్ 5వ తేదీలోపు కాంగ్రెస్ కార్పోరేటర్లు చేసిన ఫిర్యాదును కూడా డిస్పోజ్ చేయాలని కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు వాళ్లు దాఖలు చేసిన రిట్ పిటీషన్ ను కూడా కోర్టు డిస్పోజ్ చేసిందన్నారు. కిడ్నప్ విషయంలోను, హైకోర్టులోను కాంగ్రెస్ నాయకులకు చుక్కెదురైందన్నారు. కానీ ఎలాగైన అవిశ్వాసంను అడ్డుకోవాలని చివరి ప్రయత్నంగా పోలీసు స్టేషన్ లో తప్పుడు ఫిర్యాదు చేయించి అవిశ్వాసంను అడ్డుకున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తేవడంతో కలెక్టర్ చట్ట విరుద్ధంగా అవిశ్వాసం ఆపాలని ఆర్డర్ జారీ చేశారని ఆరోపించారు. అవిశ్వాసం ప్రక్రియను పూర్తి చేసేందుకు కోర్టు అభ్యంతరం లేకున్నా, సభ్యుల ప్రాథమిక హక్కుకు భంగం కలిగిస్తూ, మున్సిపల్ యాక్టు క్లాజ్ 10(1) పేజీ నంబర్ 416కి విరుద్ధంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ తనకు లేని అధికారాలను కల్పించుకొని అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఆర్డర్ జారీ చేశారన్నారు. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న కలెక్టర్, చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన కలెక్టర్ ఇలా చేయడం సమంజసం కాదన్నారు. బలం ఉంటే కాంగ్రెస్ నాయకులు తమతమ బలాన్ని అవిశ్వాసంలో నిరూపించుకోవాలని కానీ ఈ నంగనాచి వేశాలు ఎందుకు.? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ట్రాప్ లో పడి కలెక్టర్ కూడా చట్టవిరుద్ధమైన ఆర్డర్ జారీ చేయడం ఎందుకు..? అని.. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పరిణామం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బండారు రవీందర్, ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్ల సమస్యను పరిష్కరించాలి



- ఎమ్మెల్యేను కోరిన చైతన్యనగర్ స్లమ్ డెవలప్మెంట్ అసోసియేషన్ నాయకులు

నవతెలంగాణ-కాప్రా

డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను హెచ్.బి కాలనీ మీర్‌పేట్ చైతన్యనగర్ స్లమ్ డెవలప్మెంట్ అసోసియేషన్ వారు కోరారు. గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డిని వారు కలిసి సమస్యను తెలిపారు. వారు మాట్లాడుతూ చైతన్య నగర్ బస్తీవాసులం 60 ఏండ్ల నుంచి అక్కడే నివాసం ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే అట్టి స్థలంలో ఇప్పుడు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి ఉన్నారన్నారు. ప్రస్తుతం 50 కుటుంబాలు సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో ఉంటూ అద్దె కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కావున తమ యందు దయతలచి 50 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యేలా చూడగలరని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తమ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వన్నె జంబు, ఉపాధ్యక్షులు శాంతాల నరసింహ , ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, నాగరాజ, మహేష్, శివయ్య, బుజ్జి, పోచమ్మ ,కన్నెమ్మ జ్యోతి తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



- డీఈఓ విజయ కుమారి

నవతెలంగాణ-శామీర్‌పేట్

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని. నాణ్యమైన విద్యను విద్యార్థులకు బోధిస్తారని, బడిడు పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఈఓ విజయకుమారి సూచించారు. మూఢుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఏఎస్‌పీడీ రమేష్, డీఈఓ విజయకుమారి గ్రామస్తులకు బడిడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కాగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఏకరూప దుస్తులు అందిస్తున్నందున కేశవరంలోని మహిళా కుట్టు మిషన్ సెంటర్‌ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ వసంత కుమారి, సెక్టోరియాల్ ఆఫీసర్ హేమలత గ్రామ సంఘ ప్రతినిధులు, స్టిచ్చింగ్ సభ్యులు, వీఓ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యను పరిష్కరించాలి



- తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.హేమ లత

నవతెలంగాణ-కీసర

ఆశా వర్కర్ల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.హేమ లత కోరారు. గురువారం వారి ఆధ్వర్యంలో కీసర పీహెచ్ సీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనం తరం యూని యన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వసంత మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం కావాలని, 5 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నా వారికి ఇవ్వలే దన్నారు.నూతన ప్రభుత్వం వెంటనే ఫిక్స్ వేతనం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా నాయ కురాలు చంద్రకాంత మాట్లాడుతూ ఆశా వర్కర్లని గత ప్రభుత్వం పట్టించుకోలేదని కొత్తగా వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆశ వర్కర్ల సమస్య పరిష్కరించాలి కోరారు. ఈ కార్యక్రమం లో రాణి, నమత, రాజయలక్ష్మి,పవిత్ర, శలిమ, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-కీసర

రాష్ట్ర బీజేపీ నాయకుడు ,ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనను బీజేపీ కీసర మండల ప్రధానకార్యదర్శి కొల బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అయోధ్య రాముల వారి ప్రతిమను బహుకరించారు. మేడ్చల్ జిల్లా యువ మోర్చ నాయకులు నల్ల వెంకట్ రెడ్డి, బీజేపీ చీర్యాల గ్రామ అధ్యక్షులు కోల మల్లేష్ యాదవ్, చీర్యాల వార్డు సభ్యులు బర్లపాటి ఆంజనేయులు, సింగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కష్ణయాదవ్, రవి, బాలు యాదవ్, రవీందర్ యాదవ్, బత్తుల చందర్, బత్తుల కుమార్, కోల శ్రీనివాస్ యాదవ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

ఘట్కేసర్ ఎంపీపీ పుట్టినరోజు వేడుకల్లో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ,కౌన్సిలర్ బిజ్జ శ్రీని వాస్ గౌడ్ ,యువ నాయకుడు కౌకుంట్ల రాహుల్ రెడ్డి , వెంకటేశ్వరరావు, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



హైదరాబాద్‌లో దంచి కొట్టిన వాన

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో గురువారం భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్సార్ నగర్, ఖైరతాబాద్, కోఠి, అబిడ్స్, ముషీరాబాద్, చిక్కడపల్లి, వీఎస్టీ, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మియాపూర్, శేరిలింగంపల్లి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, బాలానగర్, సికింద్రాబాద్, హబ్సీగూడ, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్‌నగర్‌లో వాన పడింది. దీంతో ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.









తహశీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు పంపించండి

- సీసీఎల్ఏకు టీజీటీఏ వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసీ ఆదేశాల తో బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు పంపించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) కోరింది. ఈ మేరకు టీజీటీఏ ప్రతినిధులు గురువారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఒకే జిల్లాలో మూడేండ్ల కంటే ఎక్కువ కాలంగా పని చేస్తున్న, సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్లను బదిలీ చేయాల్సిందిగా అసెంబ్లీ ఎన్నికల ముందు ఈసీ ఆదేశించినట్టు గుర్తు చేశారు. ఈ మేరకు అనేకమంది తహశీల్దార్లు వారు పని చేస్తున్న జిల్లాల నుంచి చాలా దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీరంతా పిల్లల చదువులు, తల్లిదండ్రుల వృద్ధాప్యం, అనారోగ్య సమస్యల కారణంగా కుటుంబాలను తాము పని చేస్తున్న దూర ప్రాంతాలకు తీసుకెళ్లలేకపోతున్నట్టు వివరించారు. ప్రస్తు తం అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంటు ఎన్నికలూ ముగిసినందున తహశీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. 2009 ఎన్నికల నుంచి ఇలా ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తహశీల్దార్లను ఎన్నికలు పూర్తి కాగానే తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేస్తున్న విషయాన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు తహశీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.రాములు, జనరల్ సెక్రటరీ పాక రమేష్, సెక్రటరీ, జనరల్ పూల్ సింగ్ చౌహాన్, మహిళా ప్రెసిడెంట్ రాధా, ట్రెజరర్ శ్రీనివాస్ శంకర్, పుష్పమి, లావణ్య, శ్రీదేవి, సరిత, విశ్వనాథ్, టి.భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పొన్నం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ ఆస్పత్రిని పొన్నం ప్రభాకర్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజీ విభాగం సీనియర్ వైద్యులు ప్రో.సాయిసతీశ్, జనరల్ మెడిసిన్ వైద్యులు ప్రో.నావెల్ చంద్ర, పల్మనాలాజీ సీనియర్ వైద్యులు పరంజ్యోతి ప్రత్యేక పర్యవేక్షణలో వైద్య బృందం సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం మంత్రికి నిమ్స్‌లో ఆరోగ్య శ్రీ, ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు అందిస్తున్న సేవల గురించి డైరెక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణతో కలిసి వివరించారు. పేద రోగులకు అందుతున్న సేవలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారిక వెబ్ సైట్‌లో నోటిఫికేషన్ జాబితా

- **హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకట్**

నవతెలంగాణ-సిటీబ్యూరో



జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో స్టాఫ్ నర్సు, వైద్యాధికారుల పోస్టుల కోసం జారీ చేసిన నోటిఫికేషన్ జాబితాలను జిల్లా అధికారిక వెబ్ సైట్ www. hyderabad. telangana.gov inలో పొందుపర్చినట్టు హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. జాబితాలను చూసుకుని అభ్యంతరాలుంటే పైన పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం సంబంధిత సర్టిఫికెట్లు తీసుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, పాట్నీ సెంటర్, సికింద్రాబాద్‌లో సంప్రదించాలని కోరారు.

చిరు వ్యాపారులపై కక్ష సాధింపు తగదు



- **పేదల షెడ్లను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేయడం దారుణం**
- **కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆగ్రహం**

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేదలు ప్రధాన రహదారిపై చిరు వ్యాపారులు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ భార్య పిల్లలను పోషించు కుంటూ జీవనం సాగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బస్తీవాసులు గత కొన్ని సంవత్సరాలుగా పొట్ట కూటికోసం రోడ్డు పక్కన షెడ్లు వేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు సిబ్బందితో నిరుపేదలైన చిరువ్యాపారాలపై నిర్దాక్షిణ్యంగా విరుచుక పడ్డారని రవీందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరులైన చిరు వ్యాపారులు ఎంత ప్రాధేయ పడినా వినకుండా షెడ్లను నేలమట్టం చేసి పేదల కడుపు మీద కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలంలో కార్పొరేవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో పేదలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదల పొట్ట కొడుతూ దారుణం సృష్టించి ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే నిరుపేదల చిరు వ్యాపారులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని కార్పొరేటర్ రవీందర్ రెడ్డి హెచ్చరించారు.



మాజీ సర్పంచ్, 33వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌ల నాయకులు, కే.ఎస్.ఆర్ అభిమానులు, ప్రజలు వారిని కలిసి, శాలువాలతో సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి వారందరి సమక్షంలో కేక్ కటింగ్ చేశారు.

నవతెలంగాణ-దుండిగల్

నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి

- **అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
- **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలతో కూడుకుని ఉండాలని, పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. గురువారం వీసీ మీటింగ్ హాల్ లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, స్కూల్ యూనిఫాం తయారీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో భాగంగా 286 స్కూల్స్ లో చేపట్టిన త్రాగునీరు, టాయిలెట్స్, మైనర్ రిపేర్, మేజర్ రిపేర్, బాలికల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్ వంటి పనులను ఇప్పటివరకు ఎన్ని పూర్తయినవి, ఇంకా ఎన్ని పనులు చేపట్టవలసి ఉన్న, ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకొని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను లక్ష్యంగా నిర్దేశించుకుని స్కూల్ తెరచే లోపు పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యత చేయించాల్సిన బాధ్యత ఆయా యజమాన్యాలపై ఉందని అన్నారు. నిధుల అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి నిధుల కొరత లేనందున త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, పనులు చేపట్టిన తర్వాత ఫోటోలు పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ లను పాఠశాల పునః ప్రారంభం కావడానికి ముందే ఆయా పాఠశాలలకు సకాలంలో అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే బాధ్యత స్వయం సహాయ సంఘాలకు అప్పగించడం జరిగిందని, ఇప్పటి వరకు ఎన్ని జతల యూనిఫామ్ లను సిద్ధం చేశారని, ఇంకా ఎన్ని జతల బట్టలు కుట్టవలసి ఉందని, మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయా అని, ప్రతిరోజు సగటున ఎన్ని యూనిఫామ్ లు తయారు చేస్తున్నారని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా యూనిఫాంలో తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. యూనిఫాంలో తయారీకి సంబంధించిన ప్రగతి నివేదికను రోజువారీగా అందించాలని అధికారులకు కోరారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డిఆర్ డి ఓ పి డి .సాంబశివరావు, జిల్లా విద్యాధికారి విజయ కుమారి, మెప్మా అధికారి అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలని వినతి



- **కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్ నందు పలు సమస్యల మీద కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధంరాజుల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా కేపీహెచ్ బీ కాలనీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన రమ్య గ్రౌండ్ ప్రహరీ కూడా పూర్తి దీనావస్థితిలో ఉందని, తక్షణమే దానికి మరమ్మతులు చేయకపోతే పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రమ్య గ్రౌండ్‌లోన బాత్రూంలో పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయని తక్షణమే వాటికి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని తొమ్మిదో ఫేసు మెయిన్ రోడ్ మీద ఉన్న మున్సిపల్ పార్క్ గత దశాబ్ద కాలంగా ఆదరణకు నోచుకోకుండా చెత్తతో నిండిపోయిందని వెంటనే మున్సిపల్ అధికారులు పార్కును తిరిగి ఉపయోగించే రీతిలో తయారు చేయాలని కోరారు. కేపీహెచ్‌బీ 6వ ఫేసు, సర్దార్ పటేల్ నగర్‌లోని మోడల్ రైతు బజార్లను పూర్తిగా నిర్వీర్యం చేసి, కొంతమంది ప్రయివేట్ వ్యక్తులకు దార దత్తం చేసి, దాని ద్వారా వచ్చే కిరాయిలను కొందరు ప్రయివేట్ వ్యక్తులకు చేరడం జరుగుతుందన్నారు. ఇందుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని నాయకులు తెలిపారు. తక్షణమే నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఈ విషయాల్లో జోక్యం చేసుకొని సత్వర న్యాయం కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావు, సురేష్, రాజేష్, సుబ్బు, వనజ, వీణ, సుజాత, సరోజ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్, 33వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ తేజశ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాటేపల్లి ఫణి వారిని కలిసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫణి సిల్వర్ షీట్ పై ముద్రించిన సకల దేవతల అష్టోత్తర శతనామావళిని బహుకరించడం జరిగింది.

నవతెలంగాణ-దుండిగల్



బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, లావణ్య వివాహ వేడుక సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానందని కలిసి పలు శుభకార్యాలకు ఆహ్వానించారు. మరికొందరు కాలనీలలో నెలకొని ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. దానిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులు నిత్య "సాధన-ప్రతిభ"తో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు...

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సూరారం డివిజన్‌కు చెందిన "సాధన హై స్కూల్" గాజుల రామారం డివిజన్‌కు చెందిన "ప్రతిభ హై స్కూల్" విద్యార్థులు గురువారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 10/10 పాయింట్లతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు బి. హేమంత్, సిహెచ్. రమ్యశ్రీ, త్రిష, జోహా అఫిన్‌లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సాధన గ్రూప్ అఫ్ స్కూల్స్ వారు రూ. 11,112 క్యాష్ ప్రైజ్ కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా నలుగురు విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు నిత్య "సాధన"తో విద్యను అభ్యసిస్తే తమ "ప్రతిభా"పాటలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని పేర్కొన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సాధన స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ కవితా రెడ్డి, ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ సబిత, అకాడమిక్ ఇన్‌చార్జి జి.సంతోష్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు, గర్భిణీ స్త్రీలకు సేవ చేయాలనే ఆశ...

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన "ఆశ వర్కర్లు" ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని గురువారం కలిశారు. దుండిగల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గర్భిణీ స్త్రీలకు ప్రసూతి నిర్వహించాలంటే నగరంలోని నీలోఫర్ వంటి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని, ఒక్కోసారి అత్యవసర పరిస్థితుల్లో రాత్రిపూట గర్భిణీ స్త్రీలకు ప్రసవం నిర్వహించడం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికే గాగిల్లపూర్, దుండిగల్ ప్రాంతాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వీటిలో ఒకదానిని జీహెచ్ఎంసీ పరిధిలోకి మారిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. కుత్బులాపూర్ మున్సిపాలిటీ ప్రాంతంలోని గర్భిణీ మహిళల ప్రసవాల కోసం మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి ప్రత్యేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేనందున సుదూర దూరాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. అదే జీహెచ్ఎంసీ పరిధిలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే గర్భిణీ స్త్రీలతో పాటు ఆశా వర్కర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ నిరుపేదలకు, గర్భిణీ స్త్రీల కోసం ఎంతో ఉపయోగపడే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానన్నారు.



మహిమాన్విత మలేషియా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మొక్కులు తీర్చుకున్న వేళ: ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను గురువారం కలిసి "మలేషియా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ" ప్రసాదాన్ని అందజేశారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మొక్కులు మొక్కుకున్నారు. కాగా 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఎమ్మెల్యే గెలుపొందిన సందర్భంగా ఇటీవల తమ మొక్కులను చెల్లించుకున్నామన్నారు. బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, శ్రమశక్తి అవార్డు గ్రహీత ఎత్తరి మారయ్య, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్‌లు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని మంత్రిగా చూడాలని కోరుకుంటున్నామన్నారు.



250 మందికి అన్నదానం



- **మేము సైతం మీకోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోక్షిత్ బాబు పుట్టినరోజు వేడుకలు**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేము సైతం మీ కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోక్షిత్ బాబు మొదటి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సూరారంలో నివసిస్తున్నటువంటి శశికాంత్ తన మేనల్లుడు పుట్టినరోజు సందర్భంగా సూరారం పరిధిలో ఆకలితో ఉన్న 250 మందికి కడుపునిండా అన్నం పెట్టడం జరిగింది. శశికాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, వర్ధంతి నాడు డబ్బుని వృధా చేయకుండా బయట ఆకలితో చాలామంది ఒక్కపూట అన్నం దొరికితే చాలు ఈరోజు గడిసిపోతుంది అనుకునేవాళ్ళు చాలామంది ఉంటారు. అలాంటి వారి ఆకలి ఒక్కరోజైనా తీరుతే చాలు.. అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మీకోసం ఫౌండేషన్ చైర్మెన్ కట్టెబోయిన శివకుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు, నల్లమల్ల కోటేశ్వరరావు, సభ్యులు భాగ్యశ్రీ యాదవ్, స్రవంతి ట్రాఫిక్ పోలీస్, ఓంకార్, నర్సింగ్, ఎండి.షరీఫ్, కూరగాయల షాప్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎస్‌పీవీ, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ టోల్ ప్లాజా వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌బి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వేలోని పలువురు సీనియర్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొని, ఆ ప్రదేశంలో మొక్కలు నాటారు. ప్రస్తుత పరిస్థితిలో పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం గురించి సిబ్బందికి, కార్మికులకు కంపెనీ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా వివరించారు. వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. మరింత స్వచ్ఛమైన గాలి కావాలంటే మరిన్ని మొక్కలు నాటాలని చెప్పారు. తద్వారా భావి తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించగలమని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, చెట్లు పెంచుతామని, ఇంధనాన్ని వృధా కానివ్వమని, మానవ నిర్మిత విధ్వంసాల నుంచి భూమాతకు రక్షణ కల్పిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

బీసీపీఎల్-2024 విజేతగా పవర్ హిట్టర్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో

యశ్ జోషి నేతృత్వంలోని వైడిఐ ఈవెంట్స్ బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ మూడవ సీజన్ అత్తాపూర్‌లోని స్ట్రెయిట్ డ్రైవ్ లో ఆహ్లాదంగా జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ హాజరై ప్రారంభించారు. అమ్రత్ కుమార్ జైన్, అరుణ్ కుమార్ డకోటియా, వేద్ ప్రకాష్ జోషి, ఇతరులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొన్నాయి. పవర్ హిట్టర్స్ జట్టు విజేతగా నిలవగా, ఫూర్ బాయ్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. "బీసీపీఎల్ 2024 అద్భుతమైన విజయాన్ని సాధించింది, ఇందులో పాల్గొన్న జట్ల ప్రతిభ మరియు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది" అని డివైఐ ఈవెంట్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ యష్ జోషి అన్నారు. "ఈ ఈవెంట్‌ను అద్భుతంగా విజయవంతం చేసేందుకు సహకరించిన మా స్పాన్సర్‌లు, భాగస్వాములు, ఖండాల్ విప్ర సమాజ్‌ల మద్దతుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము" అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com



చిరాగ్ అలీలోని జీపీఎస్ కూచే ప్రభుత్వ పాఠశాలలో ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జీ హెచ్ఎం కె. ఏంజలీనా అర్పిత, టీచర్లు తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

నవతెలంగాణ కేపీహెచ్‌బీ



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ జీ. వెంకట నర్సింహా రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రిన్సిపాల్ జీ.వెంకట నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సివిల్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్స్ యూనివర్సిటీ ఎన్విరాన్ మెంట్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పద్మావతి, కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. పద్మావతి, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ శోభా రాణి పలువురు విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలో యూనివర్సిటీ రిజిస్టార్ డా. కె.వెంకటేశ్వర్ రావు, పలువురు యూనివర్సిటీ డైరెక్టర్‌లు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

8న చేప ప్రసాదం పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఈనెల 8న చేప ప్రసాదం పంపిణీ చేపడుతున్నట్లు బత్తిని అమర్నాథ్ గౌడ్ తెలిపారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈనెల 8న చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లను ఫిషరీ జాయింట్ కమిషనర్ శంకర్ రాథోడ్, అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, నాంపల్లి మండల తహసీల్దార్ ప్రేమ్ కుమార్, హైదరాబాద్ జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటిలు పరిశీలించారు. ఈ సందర్భంగా బత్తిని అమర్నాథ్ గౌడ్ మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా చేప ప్రసాదాన్ని ఆస్తమాతో ఇబ్బంది పడుతున్న వారికి చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నామన్నారు. 32 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 400 మంది వాలంటీ ర్లను నియమించామన్నారు. చేప ప్రసాదం తీసుకునే వారికి ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా ముందుగా టోకెన్లను అందిస్తామన్నారు. టోకెన్లు తీసుకున్న వారు క్యూలైన్ల ద్వారా వచ్చి చేప ప్రసాదాన్ని తీసుకోవచ్చని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆరు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఈ శిబిరంలో వైద్యం పొందవచ్చునని సూచించారు. ఇప్పటికే వందలాదిగా వివిధ రాష్ట్రాల నుంచి చేప ప్రసాదం తీసుకునేందుకు పెద్ద ఎత్తున ఆస్తమాతో ఇబ్బంది పడుతున్న వారు చేరుకున్నారు. వారికి త్రాగునీరు, ఆహారాన్ని స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలోనే చేప ప్రసాదం పంపిణీ నిర్వాహకులు చంద్రశేఖర్, ఉపేందర్,నాంపల్లి క్లస్టర్ ఎస్ పి హెచ్ ఓ డాక్టర్ నాగేంద్రబాబు, ఆగాపురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రీన్, స్టాఫ్ నర్స్ నాగరాణి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'హైదరాబాద్‌లో సరికొత్త స్టోర్‌ను ప్రారంభించిన ఈజీబై'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రతిష్ఠాత్మక ల్యాండ్‌మార్క్ గ్రూప్ కు చెందిన, సమకాలీన విలువ కలిగిన ఫ్యాషన్ బ్రాండ్ అయిన ఈజీబై తాజా స్టోర్‌ను హైదరాబాద్ నగరంలో ప్రారంభించినట్లు ఈజీబై సీఈఓ కరణ్ మెహతా తెలిపారు. ఈ అత్యాధునిక స్టోర్ లో వృద్ధి చెందుతున్న ఈజీబై నెట్‌వర్క్‌లో 9వ స్టోర్ కాగా తెలంగాణలో 12వ స్టోర్ గా నిలిచిందని, ప్రస్తుతం భారతదేశంలో ఈజీబైకి 140కి పైగా స్టోర్ లు ఉన్నాయన్నారు. తమ కొత్త స్టోర్‌లు, కస్టమర్ లకు మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడంలో తమ నిబద్ధతను ప్రతిబింబిస్తాయని, మా బ్రాండ్ 1,000 కంటే ఎక్కువ స్టైల్స్ ను రూ.499 కంటే తక్కువ ధరలో అందిస్తుందని, ప్రతి పదిహేను రోజులకు కొత్త కలెక్షన్ అందుబాటులో ఉంచుతుందని, వినియోగదారులు తమ స్టోర్ ను సందర్శించిన ప్రతిసారి కొత్తదనాన్ని అందించనున్నామన్నారు. తాము పునరుద్ధరించిన ఫార్మాట్, సమకాలీన చిత్రాలతో కొత్త మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నామని, ఈజీబై వేగంగా అభివృద్ధి చెందుతున్న నెట్‌వర్క్ హైదరాబాద్ నగరంలో తమ స్టోర్స్ నెట్ వర్క్‌కు ఓల్డ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ స్టోర్స్ సరైన జోడింపు అని ఆయన పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మహిళ అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ జిన్సి చౌరాహి, వాల్మీకి దేవాలయ ప్రాంతానికి చెందిన బాలాజీ భార్య ప్రభావతి బట్టల దుకాణంలో పని చేస్తుంది. ఈ గత నెల 9న ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి రాత్రి ఎంతకీ తిరిగి రాలేదు. కుటుంబీకులు స్థానికంగా రక్త సంబంధికులు, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఎంతకీ ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేర్ ఆఫ్ అడ్రస్ 'తెలంగాణ'



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్రం నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని సోషలైట్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాజైన్, పాండురంగ హ్యాండ్లూమ్స్ చిట్టిమల్ల పాండు, నంది అవార్డు గ్రహీత హైదరాబాద్ సమయ్ హిందీ డైలీ న్యూస్ పేపర్ ఎడిటర్ మహమ్మద్ షరీఫ్‌లు కలిసి బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చేనేత కళాకారుల ఉత్పత్తులను దేశ, విదేశాలకు పంపి చేనేత కళాకారుల ప్రతిభను చాటిచెప్పడం తమ లక్ష్యమని, చేనేత వస్త్రాలను కొనుకొనేలాగా వారు చేనేత ఉత్పత్తులను ధరించేలా చేయడమే తమ కోహినూర్ స్టోరీ ఉద్దేశమన్నారు. చేనేత ఉత్పత్తులను తయారు చేసే వారిని ప్రోత్సహిస్తూ తమవంతుగా చేయూతనివ్వడమే తమ ధ్యేయమని, చేనేత కళాకారుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు తాము దోహదపడతామన్నారు. విభిన్నమైన, అరుదైన చేనేత ఉత్పత్తులను వినియోగదారులకు అందించడంతో పాటు వాటి పట్ల ఆదరణ పెంచడమే తమ ఉద్దేశ్యమని దేశవ్యాప్తంగా ఉన్న చేనేతనేత కార్మికులను గౌరవించడం, ప్రోత్సహించడమే ఈ కోహినూర్ ఉద్దేశ్యమని తెలిపారు. మార్కెట్‌లో లభించే నకిలీ పట్టు వస్త్రాలను ఎలా తెలుసుకోవాలో, నాణ్యమైన చేనేత వస్త్రాలను ఎలా గుర్తించాలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. నాణ్యమైన చేనేత వస్త్రాలను డైరెక్ట్ టూ కస్టమర్ అనే ఆలోచనతో తక్కువ ధరలకే అందిస్తూ చేనేత కళాకారులను ప్రోత్సాహిస్తున్నట్లు తాను చేయబోయే తదుపరి చిత్రం గిరిపుత్రిక లోను చేనేత వస్త్రాలను కళాకారుల (కాస్ట్యూమ్స్) కోసం వినియోగిస్తామని నిర్మాత దర్శకుడు రమేష్ రాజ చెప్పారు.



వీధులలోని పారిశుధ్య కార్మికులకు ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సంధ్య రాణి తమ సేవా కార్యక్రమంలో భాగంగా అల్పాహారం మజ్జిగను పంపిణీ చేశారు. ప్రతి ఏటా వివిధ సందర్భా లలో పేదలకు పురోహితులకు ఇలా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, లలిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లల బట్టలే కుడుతున్నామని..

యూనిఫామ్స్ కుట్టండి

- బాగా కుడితే వచ్చే విద్యసంవత్సరంలోనూ మీకే ఆర్డర్ ఇస్తాం..
- మహిళల ఆర్థిక అభివృద్ధికి సర్కారు ప్రత్యేక కృషి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంవత్సరం పాటు మన్నికగా ఉండేలా యూనిఫామ్స్ కుట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి యూనిఫామ్స్ కుడుతున్న మహిళలకు సూచించారు. గురువారం హైదరాబాద్ రాంనగర్ మేడి బాయి బస్తీలోని బాలాజీ, మహమ్మదీయ, శ్రీలక్ష్మి, శ్రీ వినాయక, మల్లికార్జున స్వయం సహాయక బృందాల బట్టలు కుట్టు కేంద్రంలో పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిఫామ్స్ కుడుతున్న మహిళలతో మాట్లాడారు.

మీకు ఎన్ని యూనిఫామ్స్ ఇచ్చారు, రోజుకు ఎన్ని కుడుతున్నారు, ఇప్పటివరకు ఎన్ని కుట్టారు, ఎప్పటివరకు పూర్తవుతాయని అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్స్ దుస్తులను మీ పిల్లలవి అనుకొని బాగా కుట్టాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించిందన్నారు. దుస్తులు మన్నికగా కుట్టండని వచ్చే విద్యా సంవత్సరంలోనూ మీకే దుస్తులు కుట్టే బాధ్యతను అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూసీడీ జాయింట్ కమిషనర్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్ రావు, సిబ్బంది మధు, ఉస్మాన్, మంజుల, స్వయం సహాయక బృందాలు, తదితరులు పాల్గొన్నారు.

కులాల వారీగా పథకాల వివరాలు వెల్లడించాలి

- సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ



నవతెలంగాణ-ముషీరాబాద్

కులాల వారీగా పథకాల వివరాలు వెల్లడించాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల కాలంలో ఎస్సీ మాల మాదిగ ఇతర ఉప కులాలకు, ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాలు ఎస్సీ కార్పొ రేషన్ రుణాలు, దళిత బంధు, మూడెకరాల భూమి పంపిణీ, అంబేద్కర్ ఓవర్సీస్ స్కీం లాంటి తదితర పథకాల పంపిణీ చేసిన వివరాలు కులాల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గురువారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల సంక్షేమ పథకాల వాటాలు వాస్తవాలు" అనే అంశంపై డాక్టర్ మంచాల లింగస్వామి అధ్యక్షత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మామిడి నారాయణ హాజరై మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం అవుతున్న సందర్భంలో వివరాలు ప్రభుత్వమే ప్రజల ముందు ఉంచాలని సూచించారు. సమాజంలో కులాల మధ్య అపోహలు ఉన్నప్పుడు సమాజప్రగతికి ఆటంకాలు ఏర్పడుతాయన్నారు. నిత్యం ఇతర కులాల పై ప్రభుత్వానిపై దుమ్మెత్తి పోస్తున్న వారికి ప్రభుత్వం విడుదలచేసే శ్వేతపత్రం ఒక సమాధానం అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. గత సంవత్సరం నవంబర్ 7న సికింద్రాబాద్ జింకనా మైదానంలో మోడీ తాము ఎస్సీ కులాల రిజర్వేషన్లను వర్గీకరిస్తామని ప్రకటించి, మూడవసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అనేక ప్రశ్నలకు శ్వేతపత్రం సమాధానం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, మాల విద్యావంతుల వేదిక అధ్యక్షులు డాక్టర్ నిమ్మ బాబురావు, అల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాహుల్, సమతా సైనిక్ దళ్ నాయకులు దుబ్బాక నవీన్, దళిత బహుజన ఫ్రంట్ నవీన్,11 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పూర్వీకుల ఇంటిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

- బాధితుడు రమేష్ శ్యామ్ సుందర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తమ పూర్వీకుల ఇంటిని అక్రమించేందుకు కొందరు నకిలీ పత్రాలు సృష్టించి దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్ శ్యామ్ సుందర్ పోలీసులను కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధి తుడు రమేష్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ హైదరాబాద్ గౌలిగూడలోని వందేళ్ల పురాతన ఇంటిని స్వాధీనం చేసుకొనేందుకు కబ్జాదారులు పోలీసులను, న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కబ్జాకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మద్దతు ఇస్తూ పోలీసులను మ్యానేజ్ చేస్తున్నారని ఆరోపించారు. స్థానికులు కానీ అనురాధ, హిమబిందు అనే మహిళలు మరణిం చిన తమ పూర్వీ కుల ఇంటిని 1971లో అమ్మినట్లు పత్రాలు చూపెడుతూ తమ ఆస్తిని అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించమని పేర్కొన్నారు. కేసు కోర్టులో ఉండగా, తమ ఇంటి తాళాలు పగల గొట్టి ట్రెస్ పాస్ చేశారన్నారు. ఇంత జరుగుతున్న స్థానిక అఫ్జల్ గంజ్ పోలీసులు చూసి, చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇచ్చిన తాము అంగీకరిస్తామని, కానీ ఇలా దౌర్జన్యం చేస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదని వాపోయారు. న్యాయస్థానం తీర్పు వచ్చే వరకు ఇంటిని అక్రమించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన వేడుకున్నారు.

సుందరయ్య పార్కు వాకింగ్ ట్రాక్‌ను వెంటనే పునరుద్ధరించాలి

- హైదరాబాద్ జిందాబాద్ నాయకుల డిమాండ్







నవతెలంగాణ-ముషీరాబాద్

సుందరయ్య పార్కు వాకింగ్ ట్రాక్‌ను వెంటనే పునరుద్ధరించాలని హైదరాబాద్ జిందాబాద్ నాయకుల డిమాండ్ చేశారు. ముషీరాబాద్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన సుందరయ్య పార్కు వాకింగ్ ట్రాక్ పూర్తిగా నీటితో నిండిపోయింది. వెంటనే వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలన్నారు. గతంలో భారీ వర్షాల తో వాకింగ్ ట్రాక్ వర్షపు నీటితో నిండిపోయిన సందర్భంగా అధికారులందరికీ హైదరాబాద్ జిందాబాద్ నుండి ఫిర్యాదులు చేశామని ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది. మరొకవైపు వాకింగ్ ట్రాక్ పక్కనే ఉన్న ఇంకుడు గుంతలో చుక్క నీరు లేకుండా నిరుపయోగంగా ఉందని, వర్షం వచ్చిన ప్రతిసారీ పార్కు వాకింగ్ ట్రాక్ నీటితో నిండిపోతుందని అధికారులు ఇంకుడు గుంతలను నిర్లక్ష్యంగా వదిలేశారని, భవిష్యత్తులో వాకింగ్ ట్రాక్ వర్షపు నీటితో నిండకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంకుడు గుంతలను వినియోగంలోకి తేవాలని హైదరాబాద్ జిందాబాద్ డిమాండ్ చేశారు. సుందరయ్య పార్క్‌ను గత సంవత్సరం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఆధునికరించి మరమత్తులు చేశారు. కానీ వర్షపు నీరు పోవడానికి సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారీ పార్కు వాకింగ్ ట్రాక్ నీటితో నిండపోతుంది. పార్క్‌లో కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి. గడ్డి పైన ఆటలు ఆడుతున్నా పట్టించుకునే వారు లేక గడ్డి ఎండిపోతుంది. అన్ని చెట్లకు రెగ్యులర్‌గా నీటి సరఫరా చేయటం లేదు. పిల్లల ఆట స్థలంలో కొన్ని పరికరాలు విరిగిపోయి ఉన్నాయి. రెండు ఇంకుడు గుంతలు నీరు లేకుండా నిరుపయోగంగా ఉన్నాయి. రోజూ పార్కుకు వచ్చే వేలాది మంది సందర్శకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది ట్రాక్ నీటితో నిండిన పరిస్థితి చూసి తిరిగి వెళ్ళిపోతున్నారని వారు తెలిపారు.

కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రిలో అవగాహన

చిన్నారులకు బహుమతులను అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

వరల్డ్ క్లబ్‌ఫుట్‌డే సందర్భంగా కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ నేతత్వంలో హాస్పిటల్‌లో క్లబ్ ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షించి చికిత్సను అందజేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సన్ షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్స్టిట్యూట్ చైర్మెన్, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ ఏ.వీ. గురవారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహక గిఫ్ట్, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డా.విద్యాసాగర్ మాట్లాడుతూ వరల్డ్ క్లబ్‌ఫుట్‌డేని పురస్కరించుకొని కిమ్స్ సన్ షైన్ ఆస్పత్రిలో ప్రతి సంవత్సరం డే సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం క్లబ్‌ఫుట్ సమస్యకు ఆధునిక శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో పాటు టెక్నిక్స్‌తో పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా, క్రీడల్లో కూడా పాల్గొనవచ్చు అన్నారు. క్లబ్‌ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'క్రీడా కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు..'



నవతెలంగాణ-ధూల్‌పేట్

క్రీడా కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదని సీఐటీయు సౌత్ జిల్లా అధ్యక్షులు మీసాల శ్రావణ్ కుమార్ అన్నారు. సంతోష్ నగర్ హైదరాబాద్ సౌత్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆఫీస్ ముందు ఆరో రోజు నిరసన ధర్నా కొనసాగించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ.. వ్యవసాయ పరిశోధన కార్యాలయంలో ఉన్నటువంటి డైరెక్టర్ కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రోజురోజుకు కార్మికులను బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రతులకు గురి చేయడం సరికాదన్నారు. ఇలా వ్యవహరిస్తూ ఈ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలని క్రీడలో ఉన్నటువంటి మేనేజ్మెంట్ ప్రయత్నం చేస్తుందన్నారు. పని చేస్తున్నా కార్మికులు గొంతేమ్మ కోరికలు కోరట్లేదన్నారు. గత 30 ఏండ్లుగా పని చేస్తున్నటువంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. క్రీడా మేనేజ్మెంట్ ఆలోచించి కార్మికుల పట్ల తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. లేని పక్షాన కార్మికులందరూ సమ్మెలకు దిగుతామని, సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ మేనేజ్మెంట్ ఆలోచించి యూనియన్ నాయ కులతో చర్చలు జరిపి ఈ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షాన ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో కార్మికులతో పాటు యూని యన్ నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రభాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తరిమికొడదాం

- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నేడు సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తరిమికొట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు ఎస్.సి.హెచ్. రంగయ్య ప్రజలకు సూచించారు. గురువారం సంస్థ కార్యాలయంలో "పర్యావరణ హిత ప్రతిజ్ఞ, పర్యావరణ పరిరక్షణ కొటేషన్" పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను పూర్తిగా నిషేధించవలసిన అవసరం ఉందన్నారు. అనేక మంది మిగిలిన ఆహార పదార్థాలను ఈ ప్లాస్టిక్ సంచుల్లో వేసి పడవేయడం వల్ల మూగ జీవాలు వాటిని తిని ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. అంతే కాకుండా ఆయా సంచుల్లో ఉండిపోయిన వ్యర్థాల కారణంగా భూ ఉపరితలం దుర్గంధమయంగా మారుతుందన్నారు. నీటి వనరుల మనుగడ కోల్పోయే పరిస్థితులు నెలకొన్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రకృతిలో జీవ వైవిధ్యం దెబ్బ తింటుం దన్నారు. ప్లాస్టిక్ ప్రమాదాన్ని వివరించి కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో అక్కడి మానవ సమూహాలతో స్వచ్ఛంద ప్రతిజ్ఞ చేయించి, ఈ పోస్టర్ ఆయా సంస్థల ప్రధాన గేటు వద్ద అంటించేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. ప్లాస్టిక్ వాడకం అంటు వ్యాధిలా మారిన ప్రస్తుత తరుణంలో ప్రతిఒక్కరిలో అవగాహన రావడంతో పాటు వాడకాన్ని కట్టడి చేసేందుకు చేతులు కలపాలని ఆయన సూచించారు. అందుకోసం పెద్ద ఎత్తున ఉద్యమానికి తమ కౌన్సిల్ శ్రీకా రం చుట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్లాస్టిక్ నియంత్రణకు ఒక ప్రత్యేక చట్టాన్ని పటిష్టం చేయవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్ బోర్డును ప్రక్షాళన చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇంటర్ బోర్డులను ప్రక్షాళన చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనధికార కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డ్ విఫలం చెందిందని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో వందలాది ఇంటర్ బోర్డ్ గుర్తింపు పొందని కళాశాలలు ఉన్నాయని, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు సంయుక్తంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల 2024-25 విద్య సంవత్సర అఫిలియేషన్ పూర్తి చేయకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి, తరగతులు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు అనుమతులు ఉన్న కళాశాలలోనే చేరాలి కానీ, కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు మంజూరు కానీ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వలన నష్టపోతున్నారు. అడ్మిషన్ ఒక చోట.. తరగతులు ఒక చోట నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఈ కార్పొరేట్ కళాశాలలు మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 422 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుంటే.. వీటిలో 398 కాలేజీలకు మాత్రమే సొంత భవనాలున్నాయని వీటిలో 18 కాలేజీలు శిథిల భవనాల్లో నడుస్తున్నాయన్నారు. మరో 24 కాలేజీలకు సొంత భవనాలు లేవని, ఇవి సమీప సర్కారీ స్కూల్‌ల్లో కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో 70 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు విద్యాసంస్థల బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సర్కారు జూనియర్ కాలేజీల్లో 1,724 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిలో 1,598 పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, వీటిలో 1,392 జూనియర్ లెక్చరర్, 91 పీడీ, 40 లైబ్రేరియన్లు, 75 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయన్నారు. ఇప్పటికే జేఎల్ రాత పరీక్షలు, గ్రూప్-4 రాత పరీక్షలు ముగిశాయని, ఫలితాలు విడుదల కావాల్సిందన్నారు. బోధనేతర సిబ్బంది పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయని మొత్తంగా 2,710 పోస్టులుండగా, ప్రస్తుతం 1,339 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. 801 బోధనేత సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 611 ల్యాబ్ అటెండెంట్ పోస్టులుంటే 465 పోస్టులు ఖాళీగానే ఉన్నాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అకాడమీల పేరుతో వందలాది ఇంటర్ కళాశాలలు అక్రమంగా, యథేచ్ఛగా నడుస్తున్నాయని, ఈ కళాశాలలకు ఎటువంటి సూచిక బోర్డులను పెట్టకుండా తరగతి గదులలో మాత్రం ఇంటర్మీడియట్ పాఠాలు బోధిస్తున్నారు. సమగ్ర విచారణ చేపట్టి అకాడమీలను ఇంటర్ బోర్డ్ పరిధిలోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్ రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, మాజీద్, శేఖర్, కళ్యాణ్, విజయ్, బాలు, మహేష్, శ్రీకాంత్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా వివరణ..

ఏఐవైఎఫ్ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపడుతామని, నిర్లక్ష్యం కనబర్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయికి ఎదగాలి

- **పవర్ లిఫ్టింగ్ చాంపియన్ రవిసింగ్ బింధాల్**



నవతెలంగాణ-బాలానగర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరుపున ఆసియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ రవిసింగ్ బింధాల్ ఆధ్వర్యంలో ఓం ప్రకాష్ బింధాల్ స్మారక పవర్ లిఫ్టింగ్ పోటీలలో కుత్బుల్లాపూర్‌కు చెందిన బత్తిన కృష్ణ చైతన్య గౌడ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పవర్ లిఫ్టర్లకు కావాల్సిన సౌకర్యాలను మెరుగుపరచడంపై దృష్టి పెడతామని అన్నారు. ఈవెంట్‌లు సాంకేతికతకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తాయని ఇస్తాయని అవకాశాలను అందిపుచ్చుకుని జాతీయ స్థాయికి ఎదగాలని కోచ్ ఆకాంక్షించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- **ప్రభుత్వానికి టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ నాయకుల విజ్ఞప్తి**

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్, ఎంప్లాయీస్ జాక్ చైర్మెన్ ఎం. జగదీష్ ఆధ్వర్యంలో ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ, ప్రొ.కోదండరామ్, చెన్నారెడ్డిలతో కలిసి గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, శేషాద్రి ఐఏఎస్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిశారు. ఈ సందర్భగా వారితో వివిధ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల గురించి ప్రస్తావించారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో అన్ని సమస్యలు పరిష్కరమవు తాయని హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ముఖ్యనేతలు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేన్(ముజీబ్), వెంకట్, సత్యనారాయణ గౌడ్ శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

- **ఎంపీ ఆర్.కృష్ణయ్య**

నవతెలంగాణ-బంజారాహిల్స్

న్యాయపరమైన రిజర్వేషన్‌ల హక్కుల సాధన కోసం మిలిటెట్ పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన అనే అంశంపై బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వని ఆధిపత్య కుల పార్టీలు..కనీసం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడం బాధాకరమని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఏం మాత్రం చిత్తశుద్ధి ఉన్నా..స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తేలిన బీసీల లెక్కల ఆధారంగానైనా ఆర్డినెన్స్ తెచ్చి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వొచ్చని అన్నారు. అయితే.. ఎన్నాళు ప్రత్యేక అధికారులను పెట్టి గ్రామాలను పరిపాలించాలంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు సిద్ధం అవుతారని చెప్పారు. బీసీలను మరోసారి మోసగించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్న ఆయన..బీసీల రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి కార్యాచరణ తీదుకున్నా.. తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ..సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి త్యాగలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సమగ్ర కులగణనతోపాటు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాజారాం యాదవ్ ప్రకటించారు. ఇక ఈ నెల 15న ఇందిరాపార్కు దగ్గర బీసీ జనసభ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి బీసీ కుల, సంఘాల ఐక్య వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ఈ కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణ కుమార్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, అడ్వొకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్,



యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, బీసీ ఐక్యవేధిక చైర్మెన్ కాటం నర్సిహ్మ యాదవ్ తదితరులు పాల్గొంటున్నారు.

చంద్ర రాజేశ్వరరావు సేవలు చిరస్మరణీయం



- **సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్**

నవతెలంగాణ: జగద్గిరిగుట్ట

స్వతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్ రావు సేవలు చిరస్మరణీయమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. గురువారం 111 వ జయంతి సందర్బంగా సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన మహనీయులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం, నియోజకవర్గ సహాయకార్యదర్శి కత్తుల దుర్గయ్య, కార్యవర్గ సభ్యులు వి.హరి నాథ్ రావు, యం.సహాదేవరెడ్డి, రాములు, యువజన నాయకులు బాబు, సీపీఐ నాయకులు ఇమామ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఓయూ జేఏసీ చైర్మెన్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓయూ జేఏసీ చైర్మెన్ బాలకృష్ణ నేత మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అపూర్వ మెజారిటీతో విజయం సాధించడం పట్ల దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఉన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, నిధులను విడుదల చేయాలని, వీసీలను నియమించాలని, ఖాళీలను త్వరిత గతిన భర్తీ చేయాలని, విశ్వ విద్యాలయాలకు మెరుగైన వసతులను కల్పించాలని, పరిశోధనలను ప్రోత్సహించాలని కోరారు.

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే శ్రీ గణేష్ గురువారం మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ గీతారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గీతారెడ్డిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. ప్రజల కాంక్ష మేరకు అభివృద్ధి కోసం పని చేయాలని ఎమ్మెల్యేకు ఆమె సూచించారు.



సమస్యను పరిష్కరిస్తాం : కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ

డెడ్ లాక్ బిల్డింగ్ ప్రాంతంలో మురుగు నీరు ఉప్పొంగుతున్నదని, రోడు పై నీరు నిలిచి అస్తవ్యస్తంగా ఉందని, అలాగే తాగు నీటి సమస్య తలెత్తి లో ప్రెజర్ వస్తుందని స్థానికులు కార్పొరేటర్ సామల హేమకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి త్వరగా సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. స్థానికులతో ఆమె మాట్లాడుతూ మీకు ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్‌తో పాటు వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్, ఎస్ఎఫ్ఐ రమేష్, స్థానికులు ఉన్నారు.



మాలలకు ధన్యవాదాలు

- గ్రేటర్ హైదరాబాద్ మాల మహానాడు కమిటీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ నుంచి ఎంపీలుగా గెలుపొందిన మల్లు రవి,గడ్డం వంశీ కృష్ణలకు గ్రేటర్ హైదరాబాద్ మాల మహానాడు కమిటీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేసింది. గురువారం బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగర అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో దళితులను కాంగ్రెస్ పార్టీ నుండి దూరం చేయడానికి బీజేపీ మతవాదం ఒకటే కాకుండా కుల వాదాన్ని కూడా తీసుకువచ్చి లబ్ది చేకూర్చుకోవాలని ప్రయత్నించిందని తెలిపారు. అయినా కానీ మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో దళితులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి గంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారన్నారు. కాంగ్రెస్ ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో గెలిచిన అంశాన్ని పరిశీలిస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుందన్నారు. బీజేపీ వల్ల దేశానికి జరిగే నష్టాన్ని గుర్తించడంలో మాలలుగా ఐక్యంగా దళితులుగా ఏకమై రిజర్వుడ్ స్థానాల్లో దళితుల బలం ప్రాబల్యం ఉన్నచోట బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, ఖైరతాబాద్ యూత్ అధ్యక్షుడు శ్రీరామ్, జెట్టి గిరి, గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూ బోయిన్‌పల్లిలో అన్నదానం నిర్వహించిన ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ గురువారం అమావాస్యను పురస్కరించుకుని పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. న్యూ బోయినపల్లి బాపూజీనగర్ శ్రీ దేవి నల్లపోచమ్మ ఆల యం, జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ ఆలయం, చిన్నతోకట్ట లోని కట్ట మైసమ్మ ఆలయాలకు జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల వద్ద అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపూజీనగర్ నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, రామారావు, శ్రీకాంత్, పుట్టి నరసింహ, జహంగీర్ గౌడ్, నరేందర్, జయనగర్ నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు రాము గౌడ్, అనిల్, శశిధర్ గౌడ్, కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు జాజుల విట్టల్ రావు, క్రాంతి, సాయి, వరప్రసాద్, ముకేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ ప్రభాకర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను గురువారం ఉద్యమ కారుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బొట్టు ప్రభాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. శ్రీ గణేష్ ఎమ్మెల్యేగా గెలవడం కంటోన్మెంట్ వాసులకు శుభ సూచకమని అభినందించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు బీఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

పార్లమెంట్ ఎన్నికల ఫలితలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నగిన లోకసభ నియోజకవర్గం నుంచి 1,51,473 ఓట్లు మెజారిటీ తో అఖండ విజయం సాధించిన భీమ్ ఆర్మీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షిరాం)జాతీయ అధ్యక్షులు అడ్వకేట్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌కు భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తీగల శివకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ గెలుపు నగిన నియోజకవర్గ ప్రజలదే కాకుండా దేశవ్యాప్తం గా ఉన్న ఎస్సీ ఎస్టీ , బీసీ మైనారిటీ ప్రజల గెలుపు అన్నారు. తెలంగాణలో కూడా రానున్న రోజులో ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షిరాం)ను బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెమ్మది నాగరాజు, ఎర్ర సురేందర్, నెమ్మది రవి ప్రకాష్ పాల్గొన్నారు.



చేవెళ్ల ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ఘన విజయం సాధించినందుకు, ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా జూబ్లీహిల్స్ బిజెపి నాయకులు ప్రేమ్ కుమార్, గంగరాజు, తాత రవి, సాయి కృష్ణ, పవన్ గురువారం కలిసి ఆయనకు ధన్యవాదాలు తెలిపి ఆనందం పంచుకున్నారు.

ఐదు ఫెయిల్.... ఇంజినీరింగ్ పాస్

- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో వివిధ శిక్షణా కోర్సులు
- పరిశ్రమకు అవసరమైన అన్ని నైపుణ్యాలను అందిస్తున్న న్యాక్





నవతెలంగాణ-సిటీబ్యూరో

నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్న సంగతి తెలిసిందే. కానీ ఈ అవకాశాలను అన్వేషించడానికి అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉండాలి. నిర్మాణ పరిశ్రమలో శోషణకు అవసరమైన నైపుణ్యాలు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వివిధ శిక్షణా కోర్సులను అందిస్తోంది. ఐదో తరగతి ఫెయిల్ లేదా ఇంజనీరింగ్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ శిక్షణా కోర్సులను అభ్యసించడానికి, ఉద్యోగాలు పొందేందుకు అర్హులు. పరిశ్రమకు అవసరమైన అన్ని నైపుణ్యాలను అభ్యర్థులకు న్యాక్ అందిస్తోంది.

ఇక్కడ శిక్షణ... దేశవిదేశాల్లో ఉద్యోగులు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చైర్మెన్‌గాను, రాష్ట్ర రోడ్లు భవనాల మంత్రి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ సంస్థ ఇలాంటి మరొక్కటి దక్షిణ ప్రపంచంలోనే లేదు. నాలుగు సంవత్సరాల నుంచి ఐదు వేల మందికి పైగా సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు పరిశ్రమలో మాత్రమే కాకుండా అన్ని జిల్లా ప్రభుత్వ కార్పొరేషన్లలో శిక్షణ పొందిన వారు ప్లేస్‌మెంట్ పొందారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జలమండలి, తెలంగాణ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మొదలైనవాటితోపాటు పెద్ద కంపెనీలైన టాటా ప్రాజెక్ట్స్, మై హోమ్, ప్రణవ గ్రూప్, సుమధుర గ్రూప్, అశోక బిల్డర్స్, ఏలియన్ గ్రూప్, షాపూర్జీ పల్లోంజీ, అనుహర్ హోమ్స్, ఆనంద హోమ్స్, అరబిందో, ఎల్ అండ్ టీ గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, అల్ట్రాటెక్, వాసవీ గ్రూప్, 360లైఫ్, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, శ్రీ ఆదిత్య గ్రూప్ మొదలైనవి ఉన్నాయి. వాటిల్లో కావాల్సిన శిక్షణను న్యాక్‌లో పొందుతున్నారు. ముఖ్యంగా ప్లంబింగ్, పెయింటింగ్, వెల్డింగ్, మాసన్ వర్క్స్‌లో శిక్షణ పొందుతున్నారు. , డ్రై వాల్ అండ్ ఫాల్స్ సీలింగ్ వర్క్, సూపర్ వైజర్, స్టోర్స్ కీపర్స్, ల్యాండ్ సర్వేలో శిక్షణ పొందిన అభ్యర్థులు దుబాయ్, కెన్యా తదితర విదేశాలలో ఉద్యోగాలు పొందారు. వారిలో కొందరు వ్యవస్థాపకులుగా మారారు.

వ్యాపారవేత్తగా....

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శిక్షణ పొందిన యువకులు ఎంతో మంది వ్యాపా వేత్తలుగా తయారయ్యారు. చాలా మంది యువత మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఏ. మధు అనే యువకుడు డ్రై వాల్ ఫాల్స్ సీలింగ్‌లో శిక్షణ పొంది వ్యాపారవేత్తగా మారారు. ఆయన ఇటీవలే సెక్రటేరియట్ (సీఎం పేషీ) ఫాల్స్ సీలింగ్ పనులను పూర్తి చేశారు.

న్యాక్‌లో శిక్షణా కోర్సులకు అధిక డిమాండ్

న్యాక్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు పూర్తి డిమాండ్ ఉంది. పరిశ్రమలో ఉద్యోగాలు పొందుతున్నారు. కనీస వేతనం రూ.20,000 నుండి 30,000 వరకు పొందుతున్నారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత, స్కిల్ సెక్టార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే అసెస్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు భారత ప్రభుత్వం స్కిల్ సర్టిఫికెట్‌ను అందజేస్తుంది. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు న్యాక్‌లో 3 నెలల శిక్షణా కోర్సులో చేరడానికి అర్హులు. ఎస్సీఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, హాస్టల్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, ఆసక్తిగల సాధారణ వర్గం అభ్యర్థులు నామమాత్రపు రుసుముతో న్యాక్ నుండి సర్టిఫికేట్ పొందేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. మరింత సమాచారం కోసం 9247440625, 7097114947, 88851 93747 లేదా డబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఏసీ.ఈడీయూ.ఇన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎలాంటి సవాళ్లకైనా సిద్ధం

న్యాక్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు ప్లేస్‌మెంట్స్ పొందుతారు. ప్రత్యేక శిక్షణా కోర్సుల ద్వారా, అభ్యర్థులు మిల్టీ-స్థాయి నైపుణ్యాలను పొందుతారు. పరిశ్రమ నుండి ఎలాంటి సవాలునైనా స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారు. వీటన్నింటి కారణంగా న్యాక్‌కు నిరంతరంగా సీఐడీసీ విశ్వకర్మ అవార్డులు అందుతున్నాయి. గోల్డెన్ పీకాక్ నేషనల్ ట్రైనిం గ్ అవార్డులు 2 సంవత్సరాలపాటు ప్రదానం చేశారు. 'అసోచామ్' నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డులు, బెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లేస్‌మెంట్స్ న్యాక్ అందుకున్న కొన్ని అవార్డులు.

– ఎన్ మధుసూధన రెడ్డి, ఎం.టెక్, డైరెక్టర్ జనరల్.

ఇది అద్భుతమైన అవకాశం

పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మరియు కెరీర్‌ను మెరుగైన అవకాశాల వైపు మళ్లించడం ద్వారా మంచి ఉద్యోగాలను సంపాదించుకోవడంలో యువత తమ కలలను అన్వేషించడానికి అద్భుతమైన అవకాశాలను అందిస్తోంది. యువత ముఖ్యంగా సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ప్రయోజనం కోసం న్యాక్ అంతర్జాతీయ స్థాయి నైపుణ్య పాఠ్యాంశాలను ప్రవేశ పెడుతోంది. గ్రాడ్యుయేట్లు వారి మెరుగైన కెరీర్‌ను నిర్మించుకోవడానికి సహాయపడే న్యాక్‌లో ఇది గొప్ప అవకాశం.

ఎం.రాజిరెడ్డి
ట్రెనింగ్ అండ్ ఫైనాన్స్ డైరెక్టర్

శిక్షణలో రికార్డు

నిర్మాణ పరిశ్రమ రంగంలో న్యాక్‌లో ఐదు లక్షల తొంభై వేల మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చింది. తెలంగాణ న్యాక్ ఏర్పడిన తర్వాత లక్షా అరవై తొమ్మిది వేల మందికి శిక్షణ ఇచ్చారు. భారతదేశంలో 7 రాష్ట్రాలతో పాటు, న్యాక్ దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ వంటి వివిధ దేశాల విద్యార్థులకు కూడా శిక్షణ ఇచ్చింది.

–శాంతి శ్రీ,
ప్లేస్‌మెంట్, పీఆర్, డైరెక్టర్.



పని వద్దు.. పలకపట్టు.. బడిబాట పట్టు

- యూసుఫ్ గూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసుఫ్‌గూడా చెక్‌పోస్ట్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పరమేశ్వరమ్మ ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. బడి ముద్దు-పని వద్దు, పలక పట్టు, పలుగు వద్దు, బడి బాట పట్టు, అనే నినాదాలతో ప్ల కార్డ్స్ పట్టుకొని, ఉపాధ్యాయులు ,విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పని వైపు వద్దు, చదువు నేర్చుకో, నీ బతుకు మార్చుకో అనే నినాదంతో టీచర్‌లు విద్యార్థులతో కలిసి చెక్ పోస్ట్ పరిసర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించి స్కూల్ వద్దకు ర్యాలీగా వెళ్ళారు.

తభితా జేసన్ మాట్లడుతూ విద్యార్థిని విద్యార్థులందరు స్కూల్‌కు వచ్చే విధంగా చేసే కార్యక్రమం బడి బాట కార్యక్రమం అని అన్నారు. గురు వారం స్కూల్‌లో నూతనంగా ముగ్గురు విద్యార్థులను చేర్చుకున్నట్టు చెప్పారు. 6 వ తరగతి నుంచి 10 వతరగతి విద్యార్థులు పాల్గొన్నారు. యూసుఫ్ గూడ చెక్ పోస్ట్‌లోని హైస్కూల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మూడు భాషలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశాల కొరకు తల్లిదండ్రులు సంప్రదించి పిల్లలను చేర్పించవలసినదిగా హెచ్‌ఎం పరమేశ్వరమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మాజీ (ఎస్ఎల్ఎఫ్), స్కూల్ టీచర్స్ తబితా జేసన్ (ఇన్‌చార్జి), రమనేశ్వరి, లలిత, మాధవి, రాజేశ్వరి పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు, తల్లి దండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాట ఫలితమే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం



- ఓయూ కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టీ.మహేందర్

నవతెలంగాణ-ఓయూ

సీఐటీయూ పోరాట ఫలితంగా ఓయూలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లభించిందని ఓయూ కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టీ.మహేందర్ అన్నారు. ఓయూలో పని చేస్తున్న 382 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆరోగ్య బీమా(ఈఎస్ఐ) కార్డులను ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓయూలో కార్మికులు దాదాపుగా 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నా వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులందరినీ సమీకరించి అనేక దఫాలుగా పోరాడి ఈఎస్ఐ, పీఎఫ్ సాధించుకున్నామన్నారు. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ వ్యవస్థీకత రంగంలో ఉద్యోగులకు సామాజిక ఆర్థిక ,రక్షణను అందించే సామాజిక భద్రత పథకం అని అన్నారు. ఉద్యోగులు పని చేసే సమయంలో ప్రమాదాలకు గురైనా, ఏ రకమైన అనారోగ్య సమస్యలు ఉన్నా, అలాగే వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా కూడా చూస్తారని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉంటే మెడికల్ సెలవుల కింద సంవత్సరంలో 91 రోజులు సెలవులు తీసుకోవచ్చు అని అన్నారు. ఈ సమయంలో వేతనాలు కట్టిస్తారని తెలిపారు. అనివార్య పరిస్థితుల్లో మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ. 15000 వరకు అందిస్తారన్నారు. ఇలాంటివి అనేక సౌకర్యాలు ఉన్నాయి కావున అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కనీస వేతనాలు అమలు చెయ్యకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు దాదాపు 3 సంవత్సరాల నుంచి వేతనాలు పెంచకపోవటం బాధాకరం అని అన్నారు. రోజురోజుకి నిత్యావసర సరకుల ధరలు పెరుగుతుంటే దానికి అనుగుణంగా వేతనాలు పెరగాలని, కానీ పెరగకపోవడంతో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులందరిని సమీకరించి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శ ఆర్. సీతారాం,నాయకులు ,లక్ష్మినరమ్మ,వెంకటమ్మ,రాణి, పాల్గొన్నారు.

కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



- టీఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యద ర్శులు పి. మురళి మనోహర్, డా. యూ. సిద్దేశ్వర్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని వివిధ ప్రయివేటు జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్)అధ్యక్ష, కార్యద ర్శులు పి. మురళి మనోహర్, డా. యూ. సిద్దేశ్వర్, సమన్వయ కర్త పి. నాగయ్య, డా. యాదయ్యలు కోరారు. గురువారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శతి ఓజాను నాం పల్లిలోని వారి కార్యాలయంలో టీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత మార్చిలో మూల్యాంకనం చేసిన అధ్యాపకులకు చాలామందికి వివిధ జిల్లాలలో మూల్యాంకన రెమ్యూనరేషన్ రాలేదని, కొంతమందికి 20 శాతం డబ్బులను ఇవ్వక పోవడం, మూల్యాంకన సమయంలో సీనియర్ అధ్యాప కులను ప్రయివేటు కళాశాలలో పని చేస్తున్నారనే నేపంతో సీఎస్‌గా అవకాశం కల్పించకపోవడం జరిగిందన్నారు. కొన్ని మూల్యాంకన కేంద్రాలలో కొంతమంది అధికారులు అధ్యాపకులచే 30 పేపర్లకు బదులు అంతకంటే ఎక్కువ పేపర్లు దిద్దించడంతో పొరపాట్లకు కారణమవుతూ అధ్యాపకులను బలి చేస్తున్నారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకొవలన్నారు. అధ్యాపకులకు న్యాయం చేయాలని, పాఠాలు బోధించని అధ్యాపకులను మూల్యాంకనానికి పంపిస్తున్న కార్పోరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, సీనియారిటీ ప్రకారం అన్ని బాధ్యతలలో ప్రయివేటు అధ్యాపకులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కార్యదర్శి తక్షణం గతంలో జరిగిన మూల్యాంకన రెమ్యూనరేషన్ వారి అకౌంట్‌లో వేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపకులు మిగిలిన వారు ఎవరైనాఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని టీఎల్ఎఫ్ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా కార్యదర్శికి టీఎల్ఎఫ్ నాయకులు ధన్యవా దాలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇలాంటి లోపాలు లేకుండా చూడాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని తెలియజేశారు.


నేలకొరిగిన భారీ వృక్షం



- కూలిన కరెంటు స్తంభం, ట్రాన్స్‌ఫారం
- బంజారాహిల్స్‌లో వర్ష బీభత్సం

నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఓ భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే ఓ కరెంటు స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫారం సైతం కూలిపోవడంతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు విద్యుత్ అధికారులతో పాటు పోలీసులకు, జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు.స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్తు అధికారి హైమానంద్, ఏఈ రమేష్‌ల ఆధ్వర్యంలో అత్యవసర చర్యలు చేపట్టి డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సహ కారంతో భారీ వక్షాన్ని తొలగించారు. అలాగే కరెంటు స్తంభాలు వైర్లను సరైన రీతిలో అమర్చి విద్యుత్తుకు అంతరాయం కలగకుండా తాత్కాలిక ప్రతిపాదన ఆ ప్రాంతానికి విద్యుత్ అందేలా చర్యలు చేపట్టారు.



కార్పొరేట్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

కార్పొరేట్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఈ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. వందల సంఖ్యలో పుట్టుకొస్తున్న కళాశాలల బ్రాంచ్‌లను నియంత్రించాలని కోరారు. గురువారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శతి ఓఝాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జాజుల మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్ కాలేజీలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుతూ లక్షల రూపాయలు దోచుకుంటున్నాయన్నారు. నారాయణ, శ్రీ చైతన్య లాంటి విద్యాసంస్థలు 60 శాతం ఫీజు కడితేనే కాలేజీలో అడ్మిషన్లు ఇస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో వందల సంఖ్యలో అక్రమంగా బ్రాంచ్‌లు పెట్టి నడుపుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇంటర్ చదివే వారిలో అత్యధికలు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులేనని,వీరికి ఫీజులే ప్రధాన సమస్యగా ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కనీస వసతులు లేకుండా హాస్టళ్లు నడిపిస్తూ విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ యువజన నాయకులు గుంటి మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడానికి కృషి చేసిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలియ చేస్తూ గురువారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపని ఆధ్వర్యంలో సీతాఫల్మండిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట సంబరాలు చేసుకున్నారు. స్వీట్స్ పంచి, పటా కులు కాల్చి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ మాట్లాడుతూ కిషన్‌రెడ్డి ద్వారా రానున్న రోజుల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభివద్ధి సాధ్యం అవుతుందన్నారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపని, నాయకులు ఆర్.కష్ణ మూర్తి ,నాగేశ్వర్ రెడ్డి, కె.హరి, ప్రకాష్ గౌడ్, రవి ప్రసాద్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కన్నాభిరాం, వేణు యాదవ్, రాము వర్మ, శారద మల్లేశ్ , హనుమంతు, అనిత ,అనుష ,నాగ రాణి కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిదూత రాధిక

నిత్యం అల్లర్లతో అట్టుడికిపోయే ప్రాంతం. ఎప్పుడు ఎక్కడ దాడి జరుగుతుందో తెలియదు. అపారమైన ఖనిజ సంపద ఉన్నా ఆ ప్రాంత ప్రజలు మాత్రం భయంకరమైన పేదరికంతో అల్లాడిపోతున్నారు. అక్కడ లోపించిన శాంతి భద్రతే దీనికి ప్రధాన కారణం. అలాంటి చోట శాంతి భద్రతల్ని పెంపొందించే బాధ్యతను స్వీకరించారు మేజర్ రాధికా సేన్... 2019లో ఐక్యరాజ్య సమితితో కలిసి దక్షిణ సూడాన్‌లో ఆమె చేసిన విశేష సేవకుగానూ 'మిలటరీ జెండర్ అడ్వొకేట్ ఆఫ్ ది ఇయర్ 2023' అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు అందుకున్న రెండవ భారతీయురాలిగా చరిత్ర సృష్టించిన ఆమె పరిచయం నేటి మానవిలో...



1993లో హిమాచల్ ప్రదేశ్‌లో జన్మించిన రాధిక. బయోటెక్నాలజీ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఐఐటీ బాంబేలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. దేశానికి సేవ చేయాలనే బలమైన కోరికతో 2016లో భారత రక్షణ రంగంలోకి ప్రవేశించారు. అప్పటి నుండి ఇండియన్ ఆర్మీలో విశేష సేవలందిస్తున్నారు. 2023, మార్చి నుండి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఐరాస శాంతి పరిరక్షకురాలిగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో సేవలందించారు. ఇండియన్ రాపిడ్ డిప్లాయ్ మెంట్ బెటాలియన్ కోసం మొనొస్కో ఎంగేజ్ మెంట్ ప్లాటూన్‌కు కమాండర్‌గా పని చేశారు.



ధైర్యంగా గళమెత్తేలా...

సుమారు 13 నెలల పాటు 'యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ స్టెబిలైజేషన్ మిషన్'తో కలిసి రాధిక అక్కడ తన బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో ఉత్తర కివులోని మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఇతర భద్రతా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా కమ్యూనిటీ అలర్ట్ నెట్‌వర్క్స్ ఏర్పాటు చేసి అక్కడి కమ్యూనిటీ నాయకులు, మహిళలు, యువతకు తమ భద్రత, మానవ హక్కుల సమస్యలపై ధైర్యంగా గళమెత్తే అవకాశాన్ని కల్పించారు. తన వినయం, కరుణ, అంకితభావంతో అక్కడి ప్రజల నమ్మకాన్ని పొందారు. పిల్లలు, మహిళలతో సహా సంఘర్షణలో చిక్కుకున్న వారందరికీ భద్రత కల్పించారు.

అవగాహన కల్పించారు

కేవలం భద్రతా పరమైన విషయాలకే పరిమితం కాకుండా అక్కడి చిన్నారులకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసి తరగతులు నిర్వహించారు. వారికి ఆంగ్ల విద్యను బోధించారు. అలాగే యువతకు వృత్తినైపుణ్యాల్లో శిక్షణ కూడా అందించారు. ఆరోగ్యంపై వారికి అవగాహన కల్పించారు. ఇలా ఒక ఆఫీసర్‌గానే కాకుండా వారింట్లో మనిషిలా కలిసిపోయి వాళ్ళ సమస్యలు వినడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు అవసరమైన అవగాహన, సహకారం సైతం ఆమె అందించారు. ముఖ్యంగా అక్కడి రాజకీయ అవినీతి, అల్లర్లకు చరమగీతం పాడేందుకు తన శాయశక్తులా కృషి చేశారు. అందుకే మే 30న అంతర్జాతీయ ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షకుల దినోత్సవం సందర్భంగా మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు.

నిజమైన నాయకురాలు

యూఎన్ సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రాధిక పట్ల తన అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఆమెను 'నిజమైన నాయకురాలు, రోల్ మోడల్. ఆమె సేవ మొత్తం ఐక్యరాజ్యసమితికి దక్కిన నిజమైన ఘనత' అని ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం భారత సైన్యం తరపున ఐక్యరాజ్య సమితిలో 124 మంది మహిళలు శాంతి పరిరక్షకులుగా ఉన్నారు. దాంతో అత్యధిక సంఖ్యలో శాంతిపరిరక్షకులను అందించిన దేశాల్లో భారత్ పదకొండో స్థానంలో కొనసాగుతోంది.

నాకెంతో ప్రత్యేకం


ఈ అవార్డు గురించి రాధిక మాట్లాడుతూ 'ఈ అవార్డు నాకెంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే అనునిత్యం అల్లర్లు చెలరేగే ప్రాంతాల్లో శాంతి భద్రతలను నెలకొల్పడమంటే సాధారణ విషయం కాదు. నాలాంటి శాంతి పరిరక్షకులు పడే కష్టానికి ముఖ్యంగా సవాలు వాతావరణంలో కృషి చేస్తున్న వారికి ఈ అవార్డు ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తుంది. సమాజంలో సానుకూల మార్పు తీసుకువచ్చేం దుకు వారంత తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ కృషి చేస్తున్నారు. శాంతి పరిరక్షణ అనేది మా ఒక్కరిదే కాదు మనందరి బాధ్యత. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఆలోచించినప్పుడు ప్రపంచం ప్రశాంతమైన, ఓ అందమైన ప్రదేశంగా మారుతుంది' అంటూ పంచుకున్నారు.

లింగ సమానత్వానికై...

ఈ ప్రతిష్టాత్మక అవార్డు 2016లో స్థాపించబడింది. శాంతి పరిరక్షక మిషన్లలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం కోసం ఈ అవార్డును ప్రారంభించారు. వ్యక్తిగత సైనిక శాంతి పరిరక్షకుల అంకితభావాన్ని ఈ అవార్డు గుర్తిస్తుంది. ఇది మహిళలు, శాంతి, భద్రతపై యూఎన్ భద్రతా మండలి తీర్మానం 1325 సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది. యూఎన్ శాంతి పరిరక్షకుల ప్రకారం, అన్ని శాంతి కార్యకలాపాల నుండి ఫోర్స్ కమాండర్లు, మిషన్ల అధిపతులచే నామినేట్ చేయబడిన అభ్యర్థుల నుండి అవార్డు గ్రహీత ఎంపిక చేయబడతారు.







బెల్లం తింటున్నారా.?

బెల్లం ఆరోగ్యానికి ఎంతలా మేలు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులోని ఐరన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, సోడియం, ఫాస్పరస్ వంటివి ఆరోగ్యంగా ఉంచడంలో ఉపయోగపడతాయి. అయితే బెల్లం ఆరోగ్యానికి మేలు చేస్తుంది అనడంలో ఎంత నిజం ఉందో. కొన్ని రకాల సమస్యలతో బాధపడేవారికి మాత్రం మంచిది కాదని చెబుతున్నారు. ఇంతకీ బెల్లానికి ఎవరు దూరంగా ఉండాలో ఇప్పుడు తెలుసుకుందాం..

నిపుణుల అభిప్రాయం ప్రకారం మధుమేహ వ్యాధిగ్రస్తులు బెల్లం ఎక్కువగా తినకూడదు. ఎందుకంటే 10



గ్రాముల బెల్లంలో 9.7 గ్రాముల చక్కెర ఉంటుంది. దీన్ని ఎక్కువ మోతాదులో తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయి పెరగవచ్చు. కాబట్టి, చక్కెర సంబంధిత సమస్యలున్నవారు బెల్లం తినకూడదు.

- **బరువు తగ్గాలనుకునే వారు కూడా బెల్లానికి వీలైనంత వరకు దూరంగా ఉండాలి. 100 గ్రాముల బెల్లంలో 385 కేలరీలు ఉంటాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల తక్కువ పరిమాణంలో తింటే ఎలాంటి ప్రమాదం ఉండదు.**
- **కీళ్ల నొప్పులతో బాధపడే వారు కూడా బెల్లాన్ని తక్కువగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. బెల్లం తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.**
- **మలబద్ధకం సమస్యతో బాధపడే వారు కూడా బెల్లానికి దూరంగా ఉండాలి. బెల్లం తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.**
- **వేసవి కాలంలో బెల్లం ఎక్కువగా తింటే ముక్కు నుంచి రక్తం కారుతుంది. ముక్కు నుంచి రక్తం వచ్చే సమస్య ఉన్నా వేసవిలో బెల్లం తినకూడదు.**

ఇజ్రాయిల్ ఉన్మాదం

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి సాక్ష్యాధారాలను మాత్రం ఇవ్వలేదు. యుద్ధం ఆరంభమైనప్పటి నుండి గాజావ్యాప్తంగా యుఎన్ఆర్‌డబ్ల్యుఎ పాఠశాలలు నిర్వాసితులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

1948 యుద్ధం సమయంలో గాజాలో ఏర్పాటు చేసిన శరణార్థ శిబిరాల్లో ఒకటైన నుస్రత్ శిబిరంపై ఇప్పటికి రెండుసార్లు దాడులు జరిగాయి. సెంట్రల్‌గాజాలోని డ్ అల్‌బలాహ్ తూర్పు ప్రాంతాల్లో, బురెజి శరణార్థ శిబిరంపై తమ బలగాలు దాడులు చేపడుతున్నాయని బుధవారం మిలటరీ తెలిపింది. పట్టపగలే వైమానిక దాడులతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. కాగా మంగళ, బుధవారాల్లో జరిగిన దాడుల నేపథ్యంలో 70మృతదేహాలు తమ వద్దకు వచ్చాయని, 300మందికి పైగా గాయపడ్డారని డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ తెలిపింది. తీవ్రమైన కాలిన గాయాలు, పదునైన ఆయుధాల వల్ల తగిలిన గాయాలు, కాళ్ళు, చేతులు విరిగి అనేకమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారని, వారికి చికిత్సనందించడం కూడా భారంగా మారిందని అల్ అక్సా ఆస్పత్రి వైద్య వర్గాలు తెలిపాయి.

వారాల తరబడి దాడులు జరిపి, పెను విధ్వంసానికి పాల్పడిన తర్వాత జాబాలియా శరణార్థ శిబిరం నుండి ఇజ్రాయిల్ బలగాలు వైదొలిగాయి. కాగా అక్కడ 360 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో చాలావరకు మహిళలు, పిల్లల మృతదేహాలే వున్నాయి.

పాపం పసివాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలు 52 ఉన్నాయి. అందులో సొంత భవనాలు ఏడు మాత్రమే ఉన్నాయి. మిగతావన్నీ చాలీచాలని ఇరుకైన ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒక గదిలో నడిపిస్తున్నారు. ముస్తాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకే గదిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు సామాగ్రి కూడా అందులోనే ఉంచి, అందులోనే వంట చేస్తూ చాలా ఇబ్బందుల మధ్య గడుపుతున్నారు. ఈ నూతన విద్యా సంవత్సరంలోనైనా సెంటర్లకు భవనాల సాకారానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంతంగా గదులు అందుబాటులోకి వచ్చేదాకా సెంటర్లు అన్నింటికీ విడివిడిగా ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్టాక్ మార్కెట్‌లో అతిపెద్ద కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ అన్నారు. హోం మంత్రి మాట్లాడుతూ జూన్ 4న స్టాక్ మార్కెట్ ఎగిసిపడుతుందని, ఈలోగా మీరందరూ అందులో ఇన్వెస్ట్ చేయాలని కోరారు. ఆర్థిక మంత్రి కూడా ఇలాగే వ్యాఖ్యలు చేశారు. జూన్ 4లోగా షేర్లు కొనాలని అమిత్ షా అంటే, జూన్ 4న స్టాక్ మార్కెట్లు రికార్డులు బద్దలు కొడతాయని మోడీ వ్యాఖ్యానించారు. అసలు ప్రధాని, హోం మంత్రి ఇన్వెస్టర్లకు ఎందుకు ఇలా పెట్టుబడులు పెట్టాలని సూచనలు చేశారు." అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

రూ.30 లక్షల కోట్ల నష్టం..

ఈ సందర్భంగా రిటైల్ ఇన్వెస్టర్లు రూ.30లక్షల కోట్లు నష్టపోయారని రాహుల్ గాంధీ అన్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ఐదు కోట్ల కుటుంబాలకు వారెందుకు నిర్దిష్టంగా సూచనలు చేశారని రాహుల్ ప్రశ్నించారు. పెట్టుబడులు పెట్టాలని సూచించడం వారి పనా? స్టాక్ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడినందుకు సెబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న బిజినెస్ గ్రూప్‌నకు చెందిన ఒకే మీడియాకు ఇద్దరూ ఎందుకు ఇంటర్వ్యూలు ఇచ్చారు? బీజేపీకి, బూటకపు ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకులకు, అలాగే ఎగ్జిట్ పోల్స్‌కు ఒక రోజు ముందు పెట్టుబడులు పెట్టి, ఐదు కోట్ల మంది వేతనాలను పణంగా పెట్టి పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జించిన ఆ బూటకపు విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య గల సంబంధం ఏమిటి? అని రాహుల్ ప్రశ్నించారు. మొత్తంగా ఈ అంశంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భారత రిటైల్ ఇన్వెస్టర్లను పణంగా పెట్టి వేలాదికోట్ల రూపాయలను ఎవరో సంపాదించారు. షేర్లు కొనాలని ప్రధాని, హోం మంత్రి వారికి సూచనలు చేశారు. అందువల్లే దీనిపై సవివరమైన దర్యాప్తు జరగాలని కోరారు. ప్రధాని మోడీపై, అమిత్‌షాపై, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారిపై విచారణ చేపట్టాలన్నారు.

ఉరిమిన వర్షం

(మొదటిపేజీ తరువాయి)

పబ్బు కోసం అడవిలోకి వెళ్లగా ఈదురు గాలులు, వర్షం పడటంతో అదే ప్రాంతంలో చెట్టు కిందికి వెళ్లి నిల్చున్నారు. అదే సమయంలో వారిపై పిడుగు పడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వారి వెంట వేరే వ్యక్తులు లేకపోవడం, అడవి కావడంతో వారు మృతిచెందిన విషయం ఎవరికీ తెలియలేదు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో రెండు కుటుంబాలకు చెందిన వారు పలు ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అడవి ప్రాంతంలో ఇద్దరి కోసం గాలిస్తుండగా మల్లన్న గుట్ట దుర్గమ్మ గుడి వద్ద మృతదేహాలు కనిపించాయి. పిడుగు పడిన ప్రాంతంలో పెద్ద బండరాయి పగిలి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు. కర్నాటకలోని శివరాపురం గ్రామానికి చెందిన బిల్లిపురం గోపాల్.. మెదక్ జిల్లా కోహీర్ మండలం పిచ్చరగడి గ్రామంలో కూలీ పనికి వచ్చాడు. అదే సమయంలో పిడుగుపడి మృతిచెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బాకూరుపల్లికి చెందిన గొర్రెల కాపరి బొల్లారం ఎల్లయ్య యాదవ్(51) గొర్రెలు మేపుతుండగా గురువారం సాయంత్రం పిడుగుపడింది. ఎల్లయ్య ఛాతిలో ఎడమ భాగం కాలిపోయి స్పృహ తప్పి పడిపోయాడు. దాంతో సమీపంలో ఉన్న రైతులు, మాజీ సర్పంచ్ రవి గుప్తా కలిసి మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్లు తెలిపారు.

మూగజీవాల మృత్యువాత

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం భరంపూర్ గ్రామానికి చెందిన రైతు సంపత్ రామన్న.. చేను పని ముగించుకొని ఎండ ఉండటంతో తన రెండు ఎద్దులను చెట్టు కింద కట్టేశాడు. మధ్యాహ్నం వర్షంతో పాటు పిడుగు పడటంతో ఒక ఎద్దు మృత్యువాత పడింది. మరో ఎద్దు గాయపడడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందించిన వెంటనే పశువైద్యాధికారి దూద్‌రాం సంఘటన స్థలాన్ని చేరుకొని గాయపడ్డ ఎద్దుకు చికిత్స అందించారు. ఎద్దు విలువ రూ.50 ఉంటుందని రైతు తెలిపారు. నిర్మల్ జిల్లా కడెం మండలం అంబారిపేట్‌కు చెందిన జింక వెంకటేష్.. రోజులాగే తన మేకల మందను మేపడానికి గ్రామ సమీపానికి తీసుకెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిడుగుపడటంతో ఐదు మేకలు, గొర్రె చనిపోయాయి. మరో రెండు మేకలు గాయపడ్డాయి. మృతి చెందిన మేకలు, గొర్రె విలువ దాదాపు రూ.80వేలపైన ఉంటుందని బాధితుడు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా, నార్నూర్ మండలం నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ జైవంత్‌రావుకు చెందిన రెండు ఆవులు రోజు మాదిరిగా వ్యవసాయక్షేత్రంలో మేత మేసి, చెట్టు కింద నిలబడ్డాయి. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపడి రెండు ఆవులు మృత్యువాతపడ్డాయి. రెండు ఆవుల ధర రూ.80 ఉంటుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్ల శ్రీనివాసులు తన వ్యవసాయ పొలంలో మేత కోసం తాడుతో పాడి ఆవును కట్టి ఉంచాడు. ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అంతలోనే పిడుగు పడటంతో ఆవు మృత్యువాత పడింది. ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని రైతు తెలిపారు.

షరతులు వర్తిస్తాయి...

(మొదటిపేజీ తరువాయి)

జనాభా గణనకు నో చెప్పలేదు. బీహార్ మార్గాన్ని చూపింది. ప్రధాని కూడా అఖిలపక్ష ప్రతినిధి బృందంలో దాన్ని వ్యతిరేకించలేదు. కుల ఆధారిత జనాభా గణన అనేది కీలకం. మేం దానిని కొనసాగిస్తాం" అని అన్నారు.

అదే విధంగా ఉమ్మడి పౌరస్మృతిపై పార్టీ అధ్యక్షుడి హోదాలో బీహార్ సీఎం నితీశ్ కుమార్ లా కమిషన్ చీఫ్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. తాము ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకం కాదని, కానీ యూసీసీపై ప్రభావితమయ్యే అన్ని వర్గాల ప్రజలతో చర్చించి ఓ పరిష్కారం అన్వేషించాలని త్యాగి పేర్కొన్నారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా తీసుకురావాలి: తేజస్వీ యాదవ్

నితీశ్ నిజంగానే కింగ్ మేకర్ అయితే బీహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా తీసుకురావాలని ఆర్జేడీ నేత తేజస్వీ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా కులగణన చేయించాలని కోరారు. ఇదే ఆయనకు మంచి అవకాశం అని అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లు ఎన్డీఏకు ఉన్నాయి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం బీహార్‌కు మద్దతుగా ఉండేలా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేలా ఉండాలన్నారు. ప్రధాని మోడీ మాయాజాలం ఇక ముగిసింది. ఆయన ఇప్పుడు ఎన్డీఏ మిత్రపక్షాలపై ఆధారపడాల్సి ఉంటుందని తెలిపారు.

అగ్నివీర్‌పై ఇండియా బ్లాక్ ..

ఇండియా బ్లాక్ ఎన్నికల మ్యానిఫెస్టోలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేసింది. మరణించిన సైనికుల కుటుంబాలకు అందించే ప్రయోజనాలలో 'వివక్ష' అని పిలిచే అగ్నిపథ్ పథకంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు.

కుల ఆధారిత జనాభా గణన కోసం ప్రతిపక్షం కూడా డిమాండ్ చేసింది. మహాఘట్‌బంధన్ ప్రభుత్వంలో నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీహార్ కూడా దీనిని నిర్వహించింది.

బీజేపీ వాదన ఇలా..

జేడీయూ అనవసర డిమాండ్లకు బీజేపీ తలొగ్గదని లీకులిస్తోంది. అదే సమయంలో మంత్రిత్వ శాఖల విభజన అయినా, మంత్రుల సంఖ్య అయినా, సహచరుల ఆందోళనలు పరిగణనలోకి తీసుకుంటామని నమ్మబలికే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు స్వతంత్ర ఎంపీలు, చిన్న పార్టీలతో బీజేపీ సంప్రదింపులు షురూ చేసింది.

నితీశ్ ఏదైనా ఫార్ములా ఇచ్చారా?

మంత్రి పదవికి సంబంధించిన ఫార్ములాను నితీశ్ ముందుకు తెచ్చినట్టు విశ్వసనీయవర్గాల నుంచి వెలుగులోకి వస్తోంది. ఈ ఫార్ములా ప్రకారం ప్రతి నలుగురు ఎంపీలకు ఒక మంత్రి పదవి ఉండాలి. దీని ప్రకారం ఆయనకు 12 మంది ఎంపీలు ఉన్నారు కాబట్టి కేంద్ర క్యాబినెట్‌లో మూడు పదవులు దక్కాలి అని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

లోక్‌సభ ఎన్నికల 'ఎన్ ఫ్యాక్టర్'

లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో నమో ఫ్యాక్టర్ ఫెయిలైంది. ఇపుడు ఎన్ ఫ్యాక్టర్ తెరపైకి వచ్చింది. ఎన్ అంటే నితీశ్, నాయుడు, నరేంద్ర మోడీ అనేది ప్రచారంలోకొచ్చింది.

పదేండ్ల పాలనలో ఎస్సీలకు ఏం చేశారో శ్వేతపత్రం ప్రకటించాలి

రీ సెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గత పదేండ్ల కాలంలో ఎస్సీలకు, వారి ఉపకులాలకు ప్రభుత్వంనుంచి అందిన సంక్షేమపథకాలు ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో 'ఎస్సీ కులాలసంక్షేమ పథకాల వాటాలు వాస్తవాలు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలంగా ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేంటో ప్రభుత్వమే ప్రజలముందుంచాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం సమాజంలో అనేక కులాల మధ్య వైరం సష్టించిందనీ, ఉపకులాల మధ్య ప్రభుత్వ పథకాల ప్రయోజనం విషయంలో అనేక అపోహలు ఉన్నాయని తెలిపారు. వాటిని నివృత్తి చేయాల్సిన భాద్యత ప్రభుత్వానిదేనన్నారు. సమాజంలో కులాల మధ్య అపోహలు ఉన్నప్పుడు సమాజప్రగతికి ఆటంకాలు ఏర్పడుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మంచాల లింగస్వామి అధ్యక్షత వహించిన సమావేశంలో ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, మాల విద్యావంతుల వేదిక అధ్యక్షులు డాక్టర్ నిమ్మ బాబురావు, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాహుల్, సమతా సైనిక్ దళ్ నాయకులు దుబ్బాక నవీన్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు పులి నవీన్ తోపాటు 11 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంకు సొంత జిల్లా అంటూ ఉండదు...

రాష్ట్రమంతా ఆయనదే :ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సొంత జిల్లా అంటూ ఉండదని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రమంతా ఆయనదేనన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బీజేపీ వద్ద సుపారి తీసుకున్నారని ఆరోపించారు. అందుకే మహబూబ్ నగర్ పార్లమెంట్లో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. ఆయన తమ కుటుంబం కోసం లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలను మోసం చేశారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.. ఎన్ని కుట్రలు చేసినా అసెంబ్లీ ఎన్నికల్లో 65 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరిగిందన్నారు. బీజేపీ పార్టీది బలుపు కాదనీ, అది వాపు అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మద్దతుతోనే కమలం పువ్వు వికసించిందని తెలిపారు. బీఆర్ఎస్...గులాబీ దళపతిని ఇప్పటికైనా మార్చి దళితుడికి అప్పగించాలని కోరారు. అహంకారంతో విర్రవీగిన కేసీఆర్‌కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిన జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 శాతం ఓట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రిగా ఏమీ చేయలేదు

ఇక ఇప్పుడేం చేస్తారూ?

కిషన్‌రెడ్డికి చనగాని దయాకర్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లపాటు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ఏమీ చేయలేదనీ, ఇక ఇప్పుడేం చేస్తారని టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ సహకారంతోనే బీజేపి విజయం సాధించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ఓటుబ్యాంకును బీజేపీకి బదిలీ చేసిందని ఆరోపించారు. కమలం పార్టీకి ఎనిమిది సీట్లు గెలిచినంత మాత్రాన రాష్ట్రానికి ఒరిగేమీ లేదని చెప్పారు.

వాల్మీకి కార్పొరేషన్ వివాదం

కర్నాటక మంత్రి బి. నాగేంద్ర రాజీనామా

బెంగుళూరు : మహర్షి వాల్మీకి ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో కర్నాటక ఎస్టీ సంక్షేమం, యువజన సాధికారిత, క్రీడా శాఖ మంత్రి బి.నాగేంద్ర గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు తన రాజీనామా లేఖను అందచేశారు. ఈ వివాదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే తాను రాజీనామా చేసినట్టు తెలిపారు. రాజీనామా కోసం తనపై ఎవ్వరూ ఒత్తిడి చేయలేదని చెప్పారు. తన మనస్సాక్షి ప్రకారమే రాజీనామా చేస్తున్నానని, ఈ ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా చూస్తానని చెప్పారు. బళ్లారి రూరల్ నియోజకవర్గం నుంచి నాగేంద్ర నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన సిద్ధరామయ్య ప్రభుత్వంలో రాజీనామా చేసిన తొలి మంత్రిగా నిలిచారు.

కాగా, వాల్మీకి కార్పొరేషన్ నుంచి అక్రమంగా నగదును బదిలీ చేసుకున్నారని నాగేంద్ర మీద కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. కార్పొరేషన్‌లో రూ. 88 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ముంబయి ప్రధాన కార్యాలయంగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో సీబీఐ ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. ఈ కేసును సీబీఐకి అప్పగించడంపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర బుధవారం తెలిపారు. ఈ కేసును ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ చేస్తోంది.

నవచిత్రం

సత్యభామగా సరికొత్త కాజల్‌ని చూస్తారు


శశికిరణ్ తిక్క

'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో ప్రతిభ గల దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు శశికిరణ్ తిక్క. ఆయన ప్రెజెంటర్, స్క్రీన్ ప్లే రైటర్‌గా వర్క్ చేసిన మూవీ "సత్యభామ". కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా అవురమ్ ఆర్ట్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మించింది. శ్రీనివాసరావు తక్కలపల్లి, బాబీ తిక్క నిర్మించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. నేడు (శుక్రవారం) ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న నేపథ్యంలో మూవీ హైలైట్స్ గురించి చిత్ర సమర్పకులు, స్క్రీన్ ప్లే రైటర్ శశికిరణ్ తిక్క మీడియాతో పంచుకున్నారు.

- తాజాగా ప్రీమియర్స్ వేశాం. చూసిన వాళ్ల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. యూకేలో ఉండే మా మిత్రులు రమేశ్, ప్రశాంత్ చెప్పిన కథతో ఈ సినిమా జర్నీ మొదలైంది. ఆ పాయింట్ నచ్చి నేను, దర్శకుడు సుమన్ డెవలప్ చేశాం. అప్పుడు 'మేజర్' సినిమా జరుగుతోంది. కాజల్‌కి ఈ కథ చెప్తే ఆమెకు వెంటనే నచ్చింది. అలా ప్రాజెక్ట్ బిగిన్ అయ్యింది.

- నాకు దర్శకుడిగా చేయాల్సిన ప్రాజెక్ట్స్ ఉన్నాయి. నా స్క్రిప్ట్స్ ప్రిపేర్ చేసుకుంటున్నాను. అందుకే ఈ సినిమాకు దర్శకత్వం వహించలేదు. పైగా మా అవురమ్ ఆర్ట్స్ పై మరిన్ని మూవీస్ చేయాలనుకుంటున్నాం.

- మూవీ ప్రెజెంటర్‌గా సినిమా మేకింగ్‌లో మరో కోణాన్ని చూశాను. దర్శకుడిగా నేను ప్రొడక్షన్ కాస్ట్‌ను చెప్పినంతలో చేస్తాననే పేరుంది. ఈ సినిమాతో నిర్మాత అనుభవాలు ఎలా ఉంటాయో తెలిసింది. చాలా విషయాలు నేర్చుకున్నాను. సినిమా మేకింగ్‌ను వైడ్ యాంగిల్ నుంచి తెలుసుకున్నా. దర్శకత్వం అమ్మలాంటి పని అయితే నిర్మాతగా ఉండటం నాన్న లాంటి బాధ్యత.

- కాజల్ వెరీ యాక్టివ్. ఆమె అలసిపోయి ఉండటం ఎప్పుడూ చూడలేదు. షూటింగ్ టైమ్‌లో ఆమె ఎనర్జీ మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేది. ఈ సినిమాలో కాజల్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు చాలా స్పెషల్. అవి ప్రేక్షకులను అలరిస్తాయి. సత్యభామగా సరికొత్త కాజల్‌ని చూస్తారు. అలాగే ఎమోషన్ ఈ మూవీలో ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. ఎన్నో పోలీస్ స్టోరీస్ వచ్చినా ఎమోషనల్‌గా ఈ సినిమా స్పెషల్‌గా ఉంటుంది. ఈ తరం ఆడియెన్స్‌కు తగినట్టు ఫ్రెష్ స్టోరీ టెల్లింగ్‌తో ఉండబోతోంది.

- దర్శకుడు సుమన్ చిక్కాల, నేను, శ్రీచరణ్ పాకాల మేమంతా ఫ్రెండ్స్. కలిసే మూవీస్ చేస్తుంటాం. దర్శకుడిగా సుమన్ వర్క్ ఆకట్టుకుంటుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా మా మూవీ ఉంటుంది.

అత్యంత సహజంగా రక్షణ


ప్రణదీప్ ఠాకోర్

హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకోర్ దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం 'రక్షణ'. పాయల్ రాజ్‌పుత్ మెయిన్ లీడ్‌గా నటించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఇప్పటికే చిత్ర టీజర్, ట్రైలర్ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. సినిమా రిలీజ్ నేపథ్యంలో దర్శక, నిర్మాత ప్రణదీప్ ఠాకోర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- దర్శకుడు గుణ శేఖర్ వద్ద 'ఒక్కడు, సైనికుడు, రుద్రమ దేవి' సినిమాలకు అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. ఆనంద్ రంగా 'ఓయ్' చిత్రానికి, బొమ్మరిల్లు భాస్కర్ 'ఆరంజ్ ' సినిమాకి కో-డైరెక్టర్‌గా పని చేశాను. ఓ పెద్ద కథను పట్టుకుని చాలా మంది వద్దకు వెళ్లాను. కానీ వర్కౌట్ కాలేదు. అందుకే ఓ చిన్న సినిమాను నేనే తీయాలని అనుకున్నాను.

- ఈ సినిమా మొత్తం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుంది. బాధితుల కోసం పోరాడే పాత్ర, వారిని రక్షించే కారెక్టర్ కాబట్టి.. సినిమాకు రక్షణ అనే టైటిల్ పెట్టాం. దాని కంటే ముందు రక్షక్ అని తెలంగాణ పోలీసుల వాహనాల పేర్లను కూడా అనుకున్నాం. చివరకు రక్షణ టైటిల్‌ను ఫిక్స్ చేశాం. పూర్తిగా రియలిస్టిక్ అప్రోచ్‌లో సినిమా ఉంటుంది. కథ రాస్తున్నప్పుడు ఎవ్వరినీ దృష్టిలో పెట్టుకోలేదు. పోలీస్ పాత్రకు తగ్గ ఫిజిక్ ఉండాలని అనుకున్నాను. ఆ టైంలో ఆర్‌ఎక్స్ 100 వచ్చింది.

- పోలీస్ ఆఫీసర్ పాత్రకు పాయల్ రాజ్‌పుత్‌కు ఈ పాత్ర బాగుంటుందని అనుకున్నాం. అప్రోచ్ అయ్యాం. ఆమెకు కథ బాగా నచ్చింది. అలా సినిమా స్టార్ట్ అయింది. పాయల్ తన పాత్రలో అద్భుతంగా నటించారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఉన్న ఇమేజ్ వేరు.. చేస్తున్న సినిమా వేరు.. అని చాలా మంది అన్నారు. కానీ కొత్త కొత్త పాత్రలు చేసినప్పుడే హీరో, హీరోయిన్లను జనాలు ఆదరిస్తుంటారు. అందుకే పాయల్ ఈ పాత్రకు బాగుంటుందని అనుకున్నాను. ఈ సినిమా తరువాత పాయల్ ఇమేజ్ పూర్తిగా మారుతుంది. కొత్త పాయల్ రాజ్‌పుత్‌ను చూస్తారు. ఆమెకు ఇకపై మరింత పవర్‌ఫుల్ రోల్స్ వస్తాయి.

- ఓ పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటనను స్ఫూర్తిగా తీసుకుని కల్పిత కథను అల్లుకున్నాను. ఈ సినిమాలో సందేశం కూడా ఉంటుంది. అలా అని సూక్తులు బోధించినట్టుగా, ఉపన్యాసాలు ఇచ్చినట్టుగా ఉండదు. నాకు నా కథ, నా సినిమా మీద నమ్మకం ఉంది. నాకు మంచి డిస్ట్రిబ్యూటర్లు దొరికారు. సినిమాను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నాను. ఓటీటీ, శాటిలైట్ రైట్స్ ఇంకా అవ్వలేదు. ట్రైలర్, టీజర్ నచ్చితే.. మా సినిమాను థియేటర్లో మాత్రమే చూడండి.

- ఓ సరికొత్త అప్రోచ్‌తో చేసిన ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. సినిమా విజయం సాధించడం ఖాయం.

మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు



యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన సినిమా "భజే వాయు వేగం". ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా నటించింది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషించారు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. రీసెంట్‌గా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చిన ఈ సినిమా అన్ని చోట్ల నుంచి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, 'మంచి సినిమా కాబట్టే ప్రేక్షకులు తమ మౌత్ టాక్‌తో అందరికీ తెలిసేలా చేశారు. మా సినిమాకు ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్‌కు థ్యాంక్స్' అని తెలిపారు.

'ఈ సినిమా నాకు హీరోగా ఎంతో సంతృప్తినిచ్చింది. ఎలాంటి సినిమా చేయాలి అని అర్థం కాని టైమ్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నాకు దారి చూపించడంతో పాటు విజయం అనే టార్చిలైట్ ఇచ్చాడు. ఏడాది టైమ్‌లో రెండో సక్సెస్ అందుకున్నా. బెదురులంక తర్వాత ఈ సినిమా విజయాన్ని ఇచ్చింది. గతంలో నా గురించి రాసేప్పుడు మరో అపజయం అందుకున్నాడు అని రాసేవారు. ఇప్పుడు అనదర్ హిట్ అని రాస్తున్నారు. అవి చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ సినిమా రిలీజ్ అయ్యాక మా డైరెక్టర్ ప్రశాంత్ కలెక్షన్స్, షోస్ పెరగడం గురించి మాట్లాడుతుంటే నేను రిలాక్స్ అవుతూ ఉండేవాడిని. ఒక మంచి మూవీ చేశాం అనే సంతృప్తి నాకు మిగతా అన్నింటికన్నా హ్యాపీనెస్ ఇచ్చింది. ఒక మంచి సినిమా అవుతుందని మేము పెట్టుకున్న నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. ఇకపై నేను చేసే సినిమాలు మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా జాగ్రత్తలు తీసుకుంటా. ఆర్‌ఎక్స్ 100 తర్వాత మళ్లీ మరో మంచి సినిమా చేశావంటూ నా ఫ్రెండ్స్, ఫ్యామిలీ చెబుతున్నారు. ఈ సినిమా అంగీకరించినప్పట్నుంచి ప్రతి స్టేజ్‌లో మూవీ బెటర్ అవుతూ, మా నమ్మకం పెరుగుతూ వచ్చింది. అది ఇవాళ థియేటర్స్‌లో ఆదరణ రూపంలో కనిపిస్తోంది. నాతో కలిసి నటించిన ఐశ్వర్య, రాహుల్, డైరెక్టర్ ప్రశాంత్, యూవీ బ్యానర్, మా మూవీ టీమ్ మెంబర్స్ అందరికీ థ్యాంక్స్' అని హీరో కార్తికేయ చెప్పారు.


ఎడిటర్ సత్య జి మాట్లాడుతూ, 'నేను, డైరెక్టర్ ప్రశాంత్ ఫ్రెండ్స్. యూవీలో 'రన్ రాజా రన్' నుంచి వర్క్ చేస్తున్నాం. ఇప్పుడు నేను ఎడిటర్‌గా, ప్రశాంత్ డైరెక్టర్‌గా సక్సెస్‌ఫుల్ సినిమా చేసి ఈ వేదిక మీద నిలబడి మాట్లాడుతుండటం సంతోషంగా ఉంది. ఈ సినిమాతో డైరెక్టర్‌గా ప్రశాంత్‌కు హిట్ రావడం నాకు ఆనందాన్నిచ్చింది' అని తెలిపారు.

'ఈ సినిమాకు విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ఈ సక్సెస్‌తో కార్తికేయ హీరోగా వంద అడుగులు ముందుకు వేశాడని భావిస్తున్నా. దర్శకుడు ప్రశాంత్ ప్రతిభకు దక్కిన చిన్న విజయమిది. ఇలాంటి సినిమాలో ఛాన్స్ రావడం ఆనందంగా ఉంది' అని రాహుల్ టైసన్ చెప్పారు.

ప్రయివేటీకరణ కూత ఎటు..?

ఎన్డీఏ అడుగులపైనే చర్చ

- ప్రయివేటీకరణ వద్దనే ఈ ఫలితాలు: కార్మిక సంఘాల నేతలు



న్యూఢిల్లీ : ఎన్నికల ఫలితాలు వచ్చాయి, బీజేపీ స్వంతంగా 240 సీట్లు తెచ్చుకోగలిగింది. తెలుగుదేశం, జేడీయూ మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా బీజేపీ అడుగులు వేస్తోంది. అయితే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముందుగా అనుకున్నట్లుగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణ ప్రణాళికతో విజయవంతంగా ముందుకు సాగగలదా లేదా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.

ఇండియన్ పీఎస్‌యూ డాట్ కామ్ ఈ అంశంపై అనేకమంది కార్మిక సంఘాల నేతలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంది. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి థామస్ ఫ్రాంకో మాట్లాడుతూ, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించరాదని ప్రజలు బలంగా కోరుకుంటున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి స్పష్టమైన గుణపాఠాన్ని నేర్పాయని వ్యాఖ్యానించారు. రెండు బ్యాంకులను ప్రయివేటీకరిస్తామని రెండేండ్ల క్రితం ప్రకటించినా భయంతోనే వారు ఆ చర్యను అమలు చేయలేదు. ఎల్‌ఐసీలోని 3.5శాతం వాటాలు ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడం వల్ల అది ఎల్‌ఐసీకి ఏ రకంగానూ ఉపయోగపడలేదు. బీజేపీ సాధించామని గొప్పగా చెప్పుకుంటున్న ముద్ర రుణాలు, పీఎం ఎస్‌హెచ్‌జీ రుణాలు, అతల్ పెన్షన్ యోజన వంటి పథకాలన్నీ కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులే చేశాయన్నారు. పైగా కార్మిక సంఘాలు కూడా కఠినమైన వైఖరి అవలంబించాయి. దాంతో మన దేశంలో ప్రయివేటీకరణ జరగలేదు. బీజేపీ విధానాలను వ్యతిరేకించిన ప్రజలు ఈ తీర్పునిచ్చారు. అందువల్ల ప్రయివేటీకరణపై బీజేపీ తన వైఖరి మార్చుకోవాల్సి వుందని అన్నారు.

ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ విభాగాలను కార్పొరేటీకరించాలన్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ఈ దేశ ప్రజలు తిరస్కరించారని తాజా ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ప్రస్తుతం ప్రధాన రాజకీయ పార్టీలకు స్పష్టమైన మెజారిటీ దక్కని పరిస్థితి నెలకొందని, వారు ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందేనని అన్నారు. నిర్దాక్షిణ్యంగా ప్రయివేటీకరణ విధానాలను ప్రోత్సహించడం ద్వారా జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడడాన్ని ప్రజలు తిరస్కరించారని, రాజకీయ పార్టీలకు ఈ ఫలితాలు ఒక గుణపాఠాన్ని నేర్పించాయన్నారు. అందువల్ల కొత్త ప్రభుత్వం ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను సమీక్షించాలని, దేశ, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా లేని విధానాలన్నింటినీ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ప్రముఖ బ్యాంక్ ట్రేడ్ యూనియన్ నేత సంజయ్ దాస్ మాట్లాడుతూ, అధికారంలో ఎవరు వున్నా సమర్ధవంతమైన ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరమని అన్నారు. అఖండ అధికారం భ్రష్టు పట్టిస్తుందని సామెత వుంది. ప్రభుత్వంలోని లోపాలు, తపొప్పులను సరిదిద్దేందుకు సమర్ధవంతమైన ప్రతిపక్షం అవసరం. ప్రస్తుతం భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ బ్యాంకుల ప్రయివేటీకరణే పరిష్కారమార్గమనే ధోరణిని మనం చూస్తున్నాం. కానీ అది పూర్తిగా తప్పని అన్నారు. ప్రైవేటీకరణ అనేది మన దేశానికి మంచిది కాదు, దీనివల్ల గుత్తాధిపత్యం వస్తుంది. ప్రయివేట్ గుత్తాధిపత్యం ప్రయివేటీకరణ అనేవి మన దేశ ప్రయోజనాలకు అస్సలు మంచిది కాదు,కానీ భారతదేశ విధానరూపకర్తలు ప్రపంచ పెట్టుబడిదారీవాదాన్ని సమర్ధిస్తున్నారనేలా సందేశాన్ని ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారని అన్నారు. పెట్టుబడులపై మరింత మెరుగైన నియంత్రణ వుండాలంటే ప్రభుత్వం తన అదుపును కోల్పోరాదని, మార్కెట్‌కు పూర్తిగా ఆర్థిక వ్యవస్థను అప్పగించేయరాదని అన్నారు. కొత్త పెన్షన్ పథకాన్ని కొనసాగిస్తారా లేక పాత పెన్షన్ పథకానికి మళ్ళుతారా అనేది కూడా కొత్త ప్రభుత్వం ముందున్న మరో కీలక అంశంగా వుంది. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక సంఘాలు చాలాకాలంగా పాత పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఢిల్లీలో దాహం దాహం..

- 137 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని హిమాచల్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఢిల్లీలో నీటి ఎద్దడిని ఎదుర్కొవడానికి సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీకి 137 క్యూసెక్‌ల నీటిని విడుదల చేయాలని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. హత్నికుండ్ బ్యారేజీ నుంచి ఈ నీటిని వజీరాబాద్ బ్యారేజీకి విడుదల చేయాలని తెలిపింది. జస్టిస్ పి.కె.మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్ వెకేషన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లతో కూడిన యమునా రివర్ బోర్డు సమావేశం యొక్క మినిట్స్‌ను పరిశీలించిన తరువాత ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న ఢిల్లీలో రివర్ బోర్డు సమావేశం జరిగింది. అయితే ఈ ఆదేశాలపై హర్యానా (ఈ రాష్ట్రం గుండానే నీరు వెళ్లిది) అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనికి జస్టిస్ మిశ్రా స్పందిస్తూ 'మిమల్ని (హర్యానా) ఢిల్లీకి నీరు ఇవ్వమని అడగడం లేదు. నీటికి మార్గం ఇవ్వవల్సిన అవసరం ఉంది' అని తెలిపారు.హర్యానా రాజకీయాలు చేస్తోందని ఢిల్లీ తరుపున న్యాయవాది ఎ.ఎం. సింఘ్వి ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. ఈ సంక్షోభ సమయంలో ఢిల్లీకి ప్రస్తుత నెలకు 136 క్యూసెక్‌ల నీరు అవసరమని చెప్పారుఈ నెల 7న 137 క్యూసెక్‌ల నీటిని విడుదల చేయాలని హిమాచల్ ప్రదేశ్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. అలాగే హర్యానాకు నీటి విడుదల గురించి ముందస్తు సమాచారం ఇవ్వాలని కూడా ఆదేశించింది.

ఉగాండ అదరహో..

ఆటలు

టి20 ప్రపంచకప్‌లో తొలి గెలుపు





గయానా: క్రికెట్ పసికూన, ఆఫ్రికా దేశం ఉగాండ ప్రపంచకప్ టోర్నీల్లో తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. టి20 వరల్డ్‌కప్ 2024లో భాగంగా పపువా న్యూ గినియా(పిఎన్‌జి)తో జరిగిన మ్యాచ్‌లో ఉగాండ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉగాండ ఆటగాళ్లు, అభిమానులు తమ తొలి విజయాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. అభిమానుల కేరింతలు, డ్యాన్స్‌లతో గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియం హోరెత్తిపోయింది. మ్యాచ్ అనంతరం ఉగాండ ఆటగాళ్ల సంబురాలు అంబరాన్ని అంటాయి. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఉగాండ.. పపువా న్యూ గినియాను 77 పరుగులకే పరిమితం చేసింది. ఉగాండ 43ఏళ్ల స్పిన్నర్ ఫ్రాంక్ న్సుబు 4 ఓవర్లలో కేవలం 4 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ఫ్రాంక్ స్పెల్‌లో 2 మెయిడిన్ ఓవర్లు ఉండటం విశేషం. ఫ్రాంక్‌తో పాటు అల్పేశ్, జుమా మియాగి, కోస్మాస్ క్యేవుటాకు రెండేసి, కెప్టెన్ మసాబాకు ఒక వికెట్ దక్కాయి. పీఎన్‌జీ ఇన్నింగ్స్‌లో కేవలం ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోర్ చేయగలిగారు. వీరిలో హిరి హిరి(15) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఉగాండ 26 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రియాజత్ అలీ షా(33), జుమా మియాగి(13) బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసి ఉగాండను గెలిపించారు. వీరిద్దరు ఓ మోస్తరుగా రాణించడంతో ఉగాండ 18.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పపువా న్యూగినియా బౌలర్లలో అలెయ్ నావ్, నార్మన్ వనువాకు రెండేసి, చాడ్ సోపర్, అస్సద్ వలా ఒక్కో వికెట్ పడగొట్టారు.

న్సుబుగా నయా చరిత్ర...

43 ఏళ్ల ఉగాండ బౌలర్ ఫ్రాంక్ న్సుబుగా చరిత్ర సృష్టించాడు. టి20 ప్రపంచకప్ చరిత్రలో అతి తక్కువ ఎకానమీతో (1.00)తో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టి20 ప్రపంచకప్‌లో భాగంగా పపువా న్యూగినియాపై ఫ్రాంక్.. 4 ఓవర్లలో 4 పరుగులు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అతని స్పెల్‌లో ఏకంగా 2 మెయిడిన్ ఓవర్లు ఉండటం మరో విశేషం. టి20 వరల్డ్‌కప్ టోర్నీల చరిత్రలో ఇదే అతి తక్కువ ఎకానమీ బౌలింగ్.

టి20 ప్రపంచకప్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు...

1. ఫ్రాంక్ న్సుబుగా(ఉగాండ)	:4-2-4-2
2. బార్ట్‌మన్(దక్షిణాఫ్రికా)	:4-1-9-1
3. మియాజీ(ఉగాండా)	:4-0-10-2
4. ఐరే(నేపాల్)	:2-0-6-1

ఫైనల్‌కు స్వైటెక్

సెమీస్‌లో గాఫ్‌పై గెలుపు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి పోలండ్‌కు చెందిన టాప్‌సీడ్ ఇగా స్వైటెక్ ప్రవేశించింది. గురువారం జరిగిన తొలి సెమీస్‌లో స్వైటెక్ 6-2, 6-4తో 3వ సీడ్, అమెరికా సంచలనం కోకా గాఫ్‌పై వరుససెట్లలో విజయం సాధించింది. తొలి సెట్‌ను సునాయాసంగా నెగ్గిన స్వైటెక్.. రెండోగేమ్‌లో ఒక బ్రేక్ పాయింట్‌తో మ్యాచ్‌ను ముగించింది. ఈ మ్యాచ్‌లో గాఫ్ మూడు ఏస్‌లను సంధించినా ప్రయోజనం లేకపోయింది. అలాగే నాలుగు డబుల్స్ ఫాల్ట్స్ కూడా గాఫ్ ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. శనివారం జరిగే టైటిల్ పోరులో స్వైటెక్.. పోలిని(ఇటలీ), ఆండ్రీవా(రష్యా) మ్యాచ్ విజేతతో తలపడనుంది.

జకోవిచ్ సర్జరీ సక్సెస్

ఫ్రెంచ్ ఓపెన్ నుంచి గాయం కారణంగా వైదొలిగిన టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్ మోకాలికి సర్జరీ చేయించుకున్నాడు. తన కుడి మోకాలికి విజయవంతంగా ఆపరేషన్ అయిందని గురువారం జకోవిచ్ వెల్లడించాడు. త్వరగా కోలుకొని కోర్టులో అడుగు పెడుతానని ట్విటర్(ఎక్స్)లో పోస్ట్ చేశాడు. 'మోకాలి గాయం కారణంగా క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఆడకుండానే వైదొలగాల్సి వచ్చింది. నాకు సర్జరీ సక్సెస్ అయింది. ఈ కష్ట సమయంలో నాకు అన్నివిధాలా తోడుగా ఉన్న వైద్య బృందానికి, నాకు మద్దతుగా నిలుస్తున్న అభిమానులకు అభినందనలు. త్వరలోనే కోర్టులో అడుగుపెడుతాను' అని జకోవిచ్ తెలిపాడు. జూలై 1 నుంచి జరిగే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌తోపాటు జూలై 27 నుంచి జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో జకోవిచ్ ఆడే చాన్స్ విషయం ఆ తర్వాత తెలియపరుస్తానన్నాడు. ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్స్‌లో జకోవిచ్ అర్థాంతరంగా తప్పుకున్నాడు. కాపర్ రూడ్‌తో బుధవారం జరగాల్సిన క్వార్టర్ ఫైనల్లో మోకాలి గాయం కారణంగా మ్యాచ్ ముందే కోర్టును వీడాడు. 2023లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లుకొల్లగొట్టిన జకో.. పురుషుల టెన్నిస్ చరిత్రలో 24గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో నయా చరిత్ర సృష్టించాడు. అలాగే 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును సైతం కైవసం చేసుకున్నాడు.

ఒమన్‌పై కష్టంగా నెగ్గిన ఆసీస్



బార్బడోస్: గ్రూప్-బిలో ఆస్ట్రేలియా జట్టు ఒమన్‌పై కష్టంగా నెగ్గింది. కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా గురువారం ఒమన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 164పరుగులే చేసింది. ఛేదనలో ఒమన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్ల నష్టానికి 125పరుగులు చేసి ఓటమిపాలైంది. ఆసీస్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టాయినిస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో ఓపెనర్ వార్నర్(56), స్టాయినీస్ (67నాటౌట్; 36బంతుల్లో 2ఫోర్లు, 6సిక్సర్లు) రాణించాడు. ఒమన్ ఆటగాడు మెహ్రాన్‌ఖాన్ బౌలింగ్‌లో స్టాయినీస్ ఏకంగా నాలుగు సిక్స్‌లు (2, 6, 6, 0, 6, 6) బాది 26 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ మెరిసి 19 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టాయినీస్‌కు లభించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

టాటా ఈవీ కొత్తగా ఈజీ టు ఈవీ ప్రచారం

న్యూఢిల్లీ : టాటా మోటార్స్‌కు చెందిన అనుబంధ సంస్థ టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ (టీపీఈఎం) విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని పెంచడానికి కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. ఈజీ టు ఈవీ పేరుతో ఈవీలపై వినియోగదారులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొంది. ఇందులో విద్యుత్ వాహనాలతో కలిగే ప్రయోజనాలు సహా అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొంది. 2023-24లో ఈ రంగంలో 90 శాతం వృద్ధి నమోదయిందని తెలిపింది.

సామ్‌సంగ్ నుంచి స్మార్ట్ మానిటర్స్

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా ఏఐ పవర్డ్ మానిటర్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. కొత్త ఒడిస్సెయ్ ఎల్ఈడీ జీ6 గేమింగ్ మానిటర్లను కొత్త రక్షణ టెక్నాలజీతో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. పని ప్రదేశాల్లో ఇవి మరింత సామర్థ్యంగా పని చేస్తాయని సామ్‌సంగ్ పేర్కొంది. ఒడిస్సెయ్ జీ6 మోడల్ ధరను రూ.92,399గా, స్మార్ట్ మానిటర్ ధరను రూ.15,399గా, ఫినిటీ మానిటర్ల ధరను రూ.21,449గా నిర్ణయించింది.

యోకోగావా చేతికి అడెప్ట్ ఫ్లూయిడిన్

పూణె : ఎలక్ట్రో మాగ్నెటెక్స్ తయారీ కంపెనీ అడెప్ట్ ఫ్లూయిడిన్‌ను కొనుగోలు చేసినట్లు జపాన్‌కు చెందిన యోకోగావా ఎలక్ట్రిక్ కార్పొరేషన్ వెల్లడించింది. పూణె కేంద్రంగా పని చేస్తోన్న అడెప్ట్ కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యిందని యోకోగావా ఇండియా లిమిటెడ్ ప్రకటించింది. ఈ విషయాన్ని యోకోగావా వైస్ ప్రెసిడెంట్ సజీవ్ నాథ్, అడెప్ట్ ఫ్లూయిడిన్ ఎండి వినాయక్ గాద్రే తెలిపారు. యోకోగావా నీటి సరఫరా, మురుగునీటి నెట్‌వర్క్‌ల కోసం రిమోట్ పర్యవేక్షణ, నీటి శుద్ధి సౌకర్యాల కోసం నియంత్రణ వ్యవస్థల పరికరాలను అందిస్తోందన్నారు.

రెండో రోజూ మార్కెట్లకు లాభాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరసగా రెండో రోజూ లాభపడ్డాయి. కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ మళ్లీ 75వేల పాయింట్ల మార్క్‌ను దాటింది. ఉదయం 75,079 వద్ద ప్రారంభమైన సూచీ ఇంట్రాడేలో 75,298 గరిష్టాన్ని తాకింది. తుదకు 692 పాయింట్ల లాభంతో 75,075కు చేరింది. నిఫ్టీ 201 పాయింట్లు రాణించి 22,821 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లే ఇండియా, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు అధిక నష్టాలు చవి చూశాయి.

సేవింగ్ ఖాతాలపై బీమాకు ప్రాధాన్యం

ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ వెల్లడి

హైదరాబాద్: మెట్రోలు, నాన్-మెట్రోలు రెండింటిలోనూ బ్యాంకింగ్ కస్టమర్‌లు తమ ప్రీమియం సేవింగ్స్ ఖాతాలలో భాగంగా కాంప్లిమెంటరీ ఆఫర్‌లు, విలువ ఆధారిత సేవలను ఎక్కువగా ఆశిస్తున్నారని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధ్యయనంలో తేలింది. ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో మెట్రోయేతర కస్టమర్లలో 42 శాతం మంది ప్రమాదవశాత్తు రూ.10 లక్షల బీమా కవరేజీని అందించే ప్రీమియం సేవింగ్స్ ఖాతాలపై ఆసక్తి చూపుతున్నారన్నారు. దీనికి విరుద్ధంగా 67 శాతం మెట్రో కస్టమర్‌లు షాపింగ్, ప్రయాణానికి సంబంధించిన ఆఫర్‌లపై ఆసక్తి చూపుతున్నారు. ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ 400కు పైగా శాఖలలో ఈ సర్వేను చేపట్టినట్టు పేర్కొంది.

వెల్‌స్పన్‌లో పర్యావరణ కార్యక్రమం

హైదరాబాద్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్‌స్పన్ హైదరాబాద్ మొక్కలు నాటింది. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు తమ తపనను చూపుతున్న ప్రతి ఉద్యోగికి కృతజ్ఞతలని ఆ కంపెనీ తెలిపింది. పర్యావరణ సస్టెయినబిలిటీ, పర్యావరణ సారధ్యం పట్ల తమ నిబద్ధతను వెల్‌స్పన్ ప్రదర్శిస్తుందని పేర్కొంది. మన భూగోళాన్ని రక్షించుకోవడానికి చేపట్టే సమ్మిళిత కార్యక్రమాల ప్రభావాన్ని ఆ కంపెనీ ఉద్యోగులకు వివరించింది.

కార్తీ చిదంబరానికి ఊరట


న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరానికి చైనా వీసా కేసులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు గురువారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.త లక్షరూపాయల వ్యక్తిగత బాండ్, ఇదే మొత్తానికి ఇద్దరు పూచీకత్తుపై ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా బెయిల్ మంజూరు చేశారు. కాగా, 263 మంది చైనా పౌరులకు వీసాలు ఇప్పించేందుకు తన సహచరుడి ద్వారా పంజాబ్‌కు చెందిన బెల్ టూల్స్ అనే సంస్థ నుంచి రూ. 50 లక్షలు లంచం అందుకున్నట్లు కార్తీ చిదంబరంపై ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) ఇటీవల కార్తీ చిదంబరం, ఎస్ భాస్కరరామన్ వంటి పలువురిని నిందితులుగా పేర్కొంటూ ఫిర్యాదును దాఖలు చేసింది. మార్చి 19న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులోని ఏడుగురు నిందితులకు సమన్లు జారీ చేసింది.

అరకు లోక్‌సభ స్థానంలో..

బీజేపీని నిలువరించిన సీపీఐ(ఎం)

- ఎర్రజెండాకు ఏజెన్సీలో పెరిగిన ఆదరణ

పాడేరు : సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించిన 'కూటమి' విజయానికి అరకు లోక్‌సభ స్థానంలో మాత్రం సీపీఐ(ఎం) బ్రేక్ వేసింది. ఈ ఎన్నికల్లో కూటమి తరుపున అరకు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత విజయాన్ని సీపీఐ(ఎం) అభ్యర్థి పి.అప్పలనర్స అడ్డుకున్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ఆదివాసీ వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం సాగిస్తున్న సీపీఐ(ఎం) ఈ సారి ఇక్కడి పార్లమెంట్ బరిలో నిలిచింది. ఇదిలా ఉండగా గతంలో వైసిపి తరపున అరకు ఎంపిగా గెలిచిన కొత్తపల్లి గీత ఈసారి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆమె అభ్యర్థిత్వం పట్ల ఏజెన్సీ అంతటా వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ ఎన్‌డిఎ కూటమిలోని టీడీపీ చలువతో ఆమె విజయం సాధిస్తుందని పలువురు భావించారు. ఆ అంచనా ఇప్పుడు తప్పయింది. అరకు లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా వాటిలో ఐదు స్థానాల్లో టిడిపి, జనసేన అభ్యర్థులు గెలిచారు. కేవలం అరకు, పాడేరుల్లో మాత్రమే వైసిపి గెలుపొందింది. ఈ లెక్కన బీజేపీ అభ్యర్థి గీత తప్పనిసరిగా గెలుపొందాలి. వాస్తవానికి అరకు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూటమి అభ్యర్థులకు 5,50,000 ఓట్లు వచ్చాయి. ఈ అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లన్నీ ఎంపి అభ్యర్థి గీతకు వచ్చి ఉండుంటే ఆమె సునాయాసంగా గెలిచేది. కానీ ఆమెకు 4,26,425 ఓట్లు వచ్చాయి. సరిగ్గా విజయానికి ఆమె 50,580 ఓట్లు దూరంలో ఉండిపోయారు. ఆమె విజయానికి సీపీఐ(ఎం) అభ్యర్థి పి.అప్పలనర్స బ్రేక్ వేశారన్న చర్చ ఏజెన్సీలో సాగుతోంది. ముఖ్యంగా అరకు, పాడేరు, రంపచోడవరం



అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో వైసీపీ 97,656 ఓట్లు సాధించింది. సరిగ్గా ఈ ఓట్లే ఆదివాసీ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న బిజెపిని నిలువరించాయి.

అంకెల్లో ఇలా..

అరకు అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపి అభ్యర్థి గీత 29, 254 ఓట్లతో మూడో స్థానంలోకి పడిపోయారు. ఇక్కడ సీపీఐ(ఎం) అభ్యర్థి అప్పలనర్స 45,109 ఓట్లతో బీజేపీ పై 15,855 ఓట్ల ఆధిక్యత కనబరిచారు. అలాగే రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్‌లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష దేవి సాధించిన ఓట్లు 90, 087 కాగా అక్కడ బీజేపీ ఎంపి అభ్యర్థి గీతకు 75, 766 ఓట్లు మాత్రమే లభించాయి. 15 వేల ఓట్ల పైచిలుకు క్రాస్ జరిగాయి. ఇక్కడ సీపీఐ(ఎం) ఎంపి అభ్యర్థి అప్పలనర్సకు 24,847 ఓట్లు వచ్చాయి. అలాగే ఇక్కడ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుకు 21,265 ఓట్లు రాగా ఎంపి అభ్యర్థికి ఆ సంఖ్యకు అదనంగా 3,582 ఓట్లు పడ్డాయి. పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 48,832 ఓట్లు రాగా అరకు ఎంపి అభ్యర్థి గీతకు 35,836 ఓట్లు మాత్రమే పడ్డాయి. ఇక్కడ 12,996 ఓట్లు క్రాస్ అయ్యాయి. ఈ సెగ్మెంట్‌లో సీపీఐ(ఎం)ఎంపి అభ్యర్థి అప్పలనర్స 27,700 ఓట్లు సాధించారు. అల్లూరి జిల్లాలోని ఈ మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇండియా బ్లాక్ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థుల కంటే సిపిఎంకు అధికంగా ఓట్లు పోలయ్యాయి. పార్టీలకతీతంగా ఎర్రజెండాను ఆదివాసీలు ఆదరించారు. మొత్తానికి అరకు పార్లమెంట్ స్థానంలో బిజెపి ఓటమిలో సిపిఎం కీలకంగా మారింది.

గెలిచినా పార్లమెంట్ స్థానంలో పట్టుకోల్పోయిన వైసీపీ

అరకు పార్లమెంట్ స్థానాన్ని వైసిపి దక్కించుకున్నా తన పట్టును ఈసారి కోల్పోయింది. గత ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ విజయం సాధించి, ఎంపీ స్థానాన్ని సైతం దక్కించుకున్న ఆ పార్టీ ఈసారి ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటమి పాలయ్యింది. కేవలం పాడేరు, అరకుల్లో మాత్రమే ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వైసిపి అసెంబ్లీ అభ్యర్థులకు, ఎంపి అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ లేకుండా ఇంచుమించుగా సరిసమానంగా ఓట్లు రావడంతో ఎంపి స్థానాన్ని వైసిపి నిలబెట్టుకోగలిగింది.

అరకు పార్లమెంట్ స్థానంలో ఎవరికెన్ని ఓట్లు

గుమ్మ తనూజారాణి (వైసిపి)	477005
కొత్తపల్లి గీత (బిజెపి)	426425
పి.అప్పలనర్స (సిపిఎం)	123129

కోలాహలంగా చంద్రబాబు నివాసం

- కరకట్టపై రెండోరోజూ రద్దీనే

అమరావతి : టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు నివాసంలో సందడి నెలకొంది. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు చంద్రబాబును,టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసేందుకు గురువారం కూడా క్యూకట్టారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, వినుకొండ, విశాఖపట్నం తూర్పు, తుని, ప్రత్తిపాడు, మైలవరం, రాజమండ్రి రూరల్, కొత్తపేట, ఉరవకొండ, మండపేట, సాలూరు, పాయకరావుపేట, మైదుకూరు, పర్చూరు, గురజాల, నెల్లూరు రూరల్, విజయవాడ సెంట్రల్, పలమనేరు, పెనమలూరు, చంద్రగిరి, రాజాం నియోజకవర్గాల నుంచి గెలిచిన జివి ఆంజనేయులు, వెలగపూడి రామకృష్ణ, యనమల దివ్య, బి రామాంజనేయులు, వసంత వెంకట కృష్ణప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బండారు సత్యనారాయణ, పయ్యావుల కేశవ్, వి జోగేశ్వరరావు, వంగలపూడి అనిత, పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు సాంబశివరావు, యరపతినేని శ్రీనివాస్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బొండా ఉమామహేశ్వరరావు, ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, బోడె ప్రసాద్, పులివర్తి నాని, కొండ్రు మురళీమోహన్, చంద్రబాబు, లోకేష్‌లను కలిశారు. ఎన్నికల్లో ఘనం విజయం సాధించిన ఎంపి, ఎమ్మెల్యేలను వారు అభినందించారు. వీరితో పార్టీ నేతలు మంతెన సత్యనారాయణరాజు, బుద్ధా వెంకన్న



జలీల్‌ఖాన్, నెట్టె రఘురాం, నన్నపనేని రాజ్యలక్ష్మి, కెఎస్ జవహర్ తదితరులు కలిశారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు పార్టీ నేతలు చంద్రబాబు ఇంటికి వరుస కట్టడంతో ఉండవల్లి కరకట్టపై వాహనాల రద్దీ పెరిగింది.

ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి : చంద్రబాబునాయుడు

ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాలా కృషిచేస్తానని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘ నాయకులకు హామీ నిచ్చారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సెక్రటేరి యట్ ఉద్యోగుల సంఘ నాయకులు రామకృష్ణ గురువారం ఉండ వల్లిలోని చంద్రబాబునాయుడు, లోకేష్‌ను వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులను వారిరువురికి వివరించారు. ఉద్యోగ సంఘం పేరుతో కొంతమంది నాయకులు సెక్రటేరియట్‌ను రాజకీయ వేదికగా మార్చుకున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు భవిష్యత్‌లో ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. వారి సంక్షేమం కోసం ఏమిచేయాలో అంతా చేస్తామని భరోసా ఇచ్చారు.

ఏపీ సీఎం ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ రవిచంద్ర?


ఏపీ సీఎం ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్రను నియమించే అవకాశముంది. సీఎం పేషీలో మరి కొందరు అధికారుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతున్నట్టు సమాచారం. మరో వైపు రాష్ట్రంలోని సలహాదారులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 40 మంది సలహాదారులను తొలగిస్తూ సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 4వ తేదీ నుంచి తొలగింపు అమల్లోకి వస్తుందని పేర్కొంది.

ఏపీ, బీహార్‌లకు ప్రత్యేక హోదా నెరవేరుస్తారా..?

- మోడీకి జైరాం రమేష్ ప్రశ్నలు

న్యూఢిల్లీ : ఆంధ్ర ప్రదేశ్, బీహార్‌లకు ప్రత్యేక హోదా ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నెరవేరుస్తారా? అని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు సంబంధించి నాలుగు ప్రశ్నలు సంధిస్తూ 'ఎక్స్'లో ఓ వీడియో పోస్టు చేశారు.

"ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని ఏప్రిల్ 30, 2014న తిరుపతి వేదికగా మోడీ హామీ ఇచ్చారు. తద్వారా భారీస్థాయిలో పెట్టుబడులు వస్తాయని చెప్పారు. ఈ హామీ ఇచ్చి ఇప్పటికి పదేళ్లయ్యింది.. కానీ, అది జరగలేదు. ఇప్పుడు ఆ హామీ నెరవేరుతుందా? ఏపీకి ప్రధానమంత్రి ప్రత్యేక హోదా కల్పిస్తారా?" అని జైరాం రమేశ్



ప్రశ్నించారు. అలాగే.. వైజాగ్ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని, దీన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాయన్నారు. ఇప్పుడైనా ఆ ప్రైవేటీకరణను అడ్డుకుంటారా? అని మోడీని నిలదీశారు.

ఎన్‌డిఎ కూటమిలోనే ఉన్న నీతీశ్‌కుమార్ ఎంతోకాలంగా బిహార్‌కు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తున్నారని.. దీనిపై ప్రధాని మాత్రం మౌనం వీడటం లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ డిమాండ్ నెరవేరుస్తారా..అని ప్రశ్నించారు. అలాగే బీహార్‌లో కాంగ్రెస్, ఆర్‌జెడి, జెడి(యు) ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కులగణన చేపట్టామన్నారు. దీనిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని, నీతీశ్ కూడా ఇందుకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఇలా దేశం మొత్తం కులగణన చేపడతామని ప్రధాని హామీ ఇస్తారా? అని జైరాం రమేష్ ప్రశ్నించారు.

కాన్వాయ్ వెళ్తున్న ప్రాంతంలో ట్రాఫిక్ ఆపొద్దు

- భద్రతా సిబ్బందికి చంద్రబాబు సూచన

అమరావతి: ఉండవల్లి కరకట్టతోపాటు ఇతర ప్రాంతాల్లో తన కాన్వాయ్ వెళ్తున్న సమయంలో ట్రాఫిక్‌ను ఆపొద్దని భద్రతా సిబ్బందికి టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లి నుంచి గురువారం ఢిల్లీకి వెళ్తున్న క్రమంలో సాధారణ ప్రజల వాహనాలను పోలీసులు నిలిపివేశారు. విఐపి భద్రత పేరుతో కాన్వాయ్ వెళ్లే దారిలో గంటల తరబడి వాహనాలు నిలిపివేసే విధానాలకు స్వస్తి పలకాలని చెప్పారు. తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అతి తక్కువ సమయం మాత్రమే పౌరుల వాహనాలు నియంత్రించి వాహనదారులు ఇబ్బందిపడకుండా చూడాలని సూచించారు. భద్రతా చర్యలు పాటిస్తూనే సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తన రాకపోకలు ఉండేలా చూడాలని ఆదేశాలిచ్చారు. బారికేడ్లు, పరదాలు, రోడ్లు మూసివేత, షాపుల బంద్ వంటి పోకడలకు స్వస్తి చెప్పాలని పేర్కొన్నారు.

పనిచేయని సర్వర్‌లు

- సచివాలయాల్లో నిలిచిన సేవలు

అమరావతి : సర్వర్లు పనిచేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనులు నిలిచిపోయాయి. ఉద్యోగులు డ్యూటీలోకి రాగానే వేసే అటెండెన్స్ కూడా గురువారం మ్యాన్యువల్‌గా వేశారు నూతన ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో రాష్ట్ర సచివాలయంలో ఐటి విభాగం సర్వీసులను నిలిపివేసింది. కీలకమైన డేటా బయటకు వెళ్లి ఉంటుందనే అనుమానంతో పోలీస్ విజిలెన్స్ విభాగం బుధవారం నుంచి తనిఖీలు చేపట్టింది. తనిఖీల నేపథ్యంలో సచివాలయాల శాఖ వినియోగించే అన్ని లాగిన్లను నిలిపివేయాలని అధికారులకు సూచించింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో గురువారం ప్రజలకు అందించే సేవలు నిలిచిపోయాయి. క్లౌడ్ విధానంలో సమా చారం నిక్షిప్తం చేయడంతో డేటా మొత్తం సచివాలయాలశాఖ ఐటి విభాగంలోని కొందరు ఉద్యోగుల ద్వారా ఐ ప్యాక్‌కు అంది ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, విచారణలో సమాచారం బయటకు వెళ్లిందనే సమాచారం వెలుగులోకి వస్తే, ఇందుకు సంబంధించి ప్రభుత్వంలోని పెద్దలపై కేసులు నమోదు చేసే అవకాశం కూడా లేకపోలేదనే చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది.

రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో పిచ్చిమొక్కల తొలగింపు

తుళ్లూరు : అమరావతి రాజధాని నిర్మాణానికి ఉద్దండ్రాయుని పాలెంలో ప్రధాని మోడీ శంకుస్థాపన చేసిన ప్రదేశంలో సిఆర్‌డిఎ అధికారులు గురువారం పిచ్చి మొక్కలను తొలగించారు. 2015 అక్టోబర్ 22న ఉద్దండరాయుని పాలెం వద్ద అమరావతి నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు. అప్పటి టిడిపి ప్రభుత్వం ఇక్కడ మ్యూజియం ఏర్పాటు చేసి రాజధాని నమూనాను భద్రపరిచింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పవిత్ర జలాలు, మట్టిని సంరక్షించేందుకు పోలీసులను కాపలా పెట్టింది. వైసిపి అధికారంలోకి వచ్చాక మ్యూజియం గురించి పట్టించుకోలేదు. రక్షణ చర్యలను క్రమేపీ ఎత్తివేసింది. దీంతో ఇటీవల కొంతమంది మ్యూజియంలోని రాజధాని నమూనాలను ధ్వంసం చేశారు. నిర్వహణ లేకపోవడంతో మ్యూజియం పరిసరాలన్నీ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. రైతులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.

'ఇండియా'కే మద్దతు

- మేఘాలయ విపిపి పార్టీ

షిల్లాంగ్ : జాతీయ స్థాయిలో ఇండియా బ్లాక్‌కే తమ మద్దతు అని మేఘాలయ వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ (విపిపి) గురువారం ప్రకటించింది. జాతీయ స్థాయిలో ఏర్పడబోయే ఎన్‌డిఎ కూటమికి మీరు మద్దతు ఇస్తారా? అని విపిపి నేత అర్డెంట్ మిల్లర్ బసయామోయిట్‌ని మీడియా ప్రశ్నించింది. ఈ ప్రశ్నపై మిల్లర్ స్పందించారు. 'సైద్ధాంతిక విబేధాల కారణం వల్లే మా పార్టీ జాతీయస్థాయిలో కూడా కాషాయ పార్టీతో ఏకీభవించడం లేదు. విపిపి పార్టీ లౌకికవాదానికి, అన్ని మతాలను గౌరవించేందుకు కట్టుబడి ఉంది.

రష్యాపై పాశ్చాత్య దేశాల ఆంక్షలు

తమను తాముగాయపరుచుకుంటున్నాయి : రష్యా ఆర్థిక మంత్రి

రష్యాపై ఆంక్షలు విధించడం ద్వారా పాశ్చాత్య దేశాలు తమను తాముగాయపరుచుకుంటున్నాయని సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ (ఎస్పిఐఇఎఫ్)లో ఆర్థిక మంత్రి అంటోన్ సిలువానోవ్ అన్నాడు. 'కొనుగోలు శక్తి సామర్థ్యం' (పిపిపి) పరంగా ప్రపంచంలోని మొదటి నాలుగు ఆర్థిక వ్యవస్థలలో రష్యా స్థానం పొందడంపై ఆయన వ్యాఖ్యానించాడు. 2021 నుండి రష్యా జపాన్, జర్మనీలను అధిగమించి ప్రపంచంలో నాల్గొ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిం దని ప్రపంచ బ్యాంక్ గత వారం పేర్కొంది. " దీనికి ఆంక్షలు కారణమని నేను భావిస్తున్నా. పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడం ఆనందంగా ఉంది. కానీ వారు అలా చేస్తూ తమను తాము గాయపరుచుకుంటున్నారు. వారి ఆర్థిక వ్యవస్థలు స్తబ్దుగా ఉన్నాయి. మాది అభివృద్ధి చెందుతోంది. అందువల్ల, రష్యా ఆర్థిక వృద్ధి ప్రక్రియ వేగవంతమైంది "అని సిలువానోవ్ రష్యన్ ఆర్థిక వ్యవస్థ కోసం నిర్దేశించిన

లక్ష్యాలపై జరిగిన చర్చ సందర్భంగా చెప్పాడు.

గతేడాది రష్యా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 3.6 శాతం పెరిగింది. 2024 లో రష్యా ఆర్థిక వ్యవస్థ అన్ని అధునాతన ఆర్థిక వ్యవస్థల కంటే వేగంగా వృద్ధి చెందు తుందని ఏప్రిల్‌లో ఇంటర్నేషనల్



మానెటరీ ఫండ్ (ఐఎమ్ఎఫ్)అంచనా వేసింది. అమెరికా వృద్ధి రేటు 2.7 శాతం, ఇంగ్లాండ్ వృద్ధి రేటు 0.5 శాతం, జర్మనీ వృద్ధి రేటు 0.2శాతం, ఫ్రాన్స్ వృద్ధి రేటు 0.7 శాతం కంటే ఎక్కువగా రష్యా వృద్ధి రేటు 3.2 శాతం ఉంటుందని ఐఎమ్ఎఫ్ అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కోవిడ్ -19 మహమ్మారి, ఆంక్షలు వంటి అత్యంత కష్టతరమైన, కల్లోల పరిస్థితులను రష్యా అధిగమించడానికి కారణం అది ఆమోదించిన ద్రవ్య, బడ్జెట్ విధానాలేనని సిలువానోవ్ అన్నాడు. ఇదే చర్చలో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ రష్యా గవర్నర్ ఎల్విరా నబియుల్లినా మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద నిలువరించాలని లక్ష్యంగాపెట్టుకున్నట్లు చెప్పింది. ఏప్రిల్ నెలలో రష్యాలో వినియోగదారుల ధరల సూచిక 7.8 శాతం వద్ద ఉంది. 2022లో ఉక్రెయిన్ వివాదం చెలరేగిన తర్వాత మాస్కోపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించాక, ఆ సంవత్సరం ఏప్రిల్‌లో రష్యాలో ద్రవ్యోల్బణం దాదాపు 18 శాతానికి పెరిగింది. సెంట్రల్ బ్యాంక్ తన కీలక వడ్డీ రేటును 20 శాతానికి పెంచడం ద్వారా ప్రతిస్పందించింది. ఇది ఏప్రిల్ 2023లో ద్రవ్యోల్బణాన్నిక్రమంగా 2.3 శాతానికి తగ్గించడంలో సహాయపడింది. అనేక సర్దుబాట్లను అనుసరించాక రష్యాలో కీలక వడ్డీ రేటు ప్రస్తుతం 16 శాతం వద్ద ఉంది. పాశ్చాత్య దేశాలు గత రెండేండ్లుగా రష్యాపై కనీవినీ ఎరుగని రీతిలో ఆర్థిక ఆంక్షలను విధించాయి. డాలర్-డినామినేటెడ్ ఆర్థిక వ్యవస్థను తగ్గించడం, అంతర్జాతీయ బ్యాంకు బదిలీల నుండి దేశంలోని బ్యాంకులను నిరోధించడం, వాణిజ్యాన్ని పరిమితం చేయడం, సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన ఆస్తులను స్తంభింపజేయడం వంటి ఆంక్షలనురష్యాపై విధించింది. ఆంక్షల ఒత్తిడిలో భాగంగా, రష్యా నుంచి సహజ వాయువు, చమురు, ఇతర సహజ వనరుల దిగుమతులు నిషేధించబడ్డాయి లేదా పరిమితం చేయబడ్డాయి. ఇది ఇంధన ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు రష్యా వాణిజ్యాన్ని ఆసియాకు మార్చింది. వాణిజ్యంలో అమెరికాడాలర్‌ను విడిచిపెట్టి, దానికి బదులుగా జాతీయ కరెన్సీలను ఉపయోగించు కోవడానికి కషి చేసింది.

పోలీసుల ఆధీనంలోకి ముఖ్య కార్యాలయాలు



- ఫైబర్‌నెట్, సిఐడి ఆఫీసులకు తాళాలు

అమరావతి : కీలక కార్యాలయాల్లో ఫైళ్ల తస్కరణకు, మార్పిడికి అవకాశం ఉందంటూ నిఘా వర్గాలు చేసిన హెచ్చరికతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్య కార్యాలయాల వద్ద పోలీసుల భద్రతను పెంచింది. కుంచనపల్లిలోని సిట్ కార్యాలయానికి ఏకంగా తాళాలు వేశారు. అక్కడ సిబ్బంది మొత్తాన్ని బయటకు పంపించేశారు. కుంచనపల్లిలో సిట్ కార్యాలయంలో చంద్రబాబు నాయుడి విచారణ జరిగిన సంగతి తెలిసిందే. ఆ విచారణకు సంబంధించిన సమాచారం అంతా అక్కడే ఉంది. దాన్ని తారుమారు చేస్తారన్న అనుమానంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. ఎపీ ఫైబర్ నెట్, డిజిటల్ కార్పొరేషన్ కార్యాలయాలకు కూడా తాళాలు వేశారు.

ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలోని ఐటి విభాగం వద్ద ఉన్న డేటా మొత్తాన్ని సేకరించారు. డిలీట్ చేయడానికి వీల్లేకుండా ఆదేశాలు ఇచ్చారు. ఎస్‌డిఆర్ఐ కార్యాలయాన్ని కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంగళగిరిలోని ఎపిఐఐసి కార్యాలయంలో ఉన్న సిసిఎల్ఎలోనూ ఎటువంటి ఫైళ్లు బయటకు వెళ్లకూడదని ఆదేశించినట్లు తెలిసింది. వీటితోపాటు అనేక ప్రభుత్వ శాఖలపైనా నిఘా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆర్థికశాఖలో ఎటువంటి లావాదేవీలు జరపొద్దని ఆదేశించారు. సిబ్బందిపైనా నిఘా ఏర్పాటు చేశారు. తమకు ఆర్థికపరమైన అంశాల్లో ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించారంటూ బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు సిఎస్, ఆర్థికశాఖ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. తాడిగడపలోని మైనింగుశాఖ కార్యాలయంలోనూ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. రాష్ట్రంలో జరిగిన అత్యంత అవినీతి వ్యవహారంలో ఇసుక కూడా ఉంది. దీంతో అక్కడ సిబ్బంది వివరాలు, వారు చేసే పనులు, పాస్‌వర్డులు ఎవరివద్ద ఉంటాయి. సమాచారాన్ని ఎవరు మానిటరింగ్ చేస్తారనే విషయాలన్నీ నమోదు చేసుకున్నారు. ప్రసాదంపాడులోని అబ్కారీ శాఖ కార్యాలయాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇక ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అశోక్ నగర్‌లోని పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులకు ఫైళ్లు కదిలించవద్దంటూ ఆదేశాలు జారీ అయ్యాయి.

సమాచార కమిషనర్ విన్నపానికి తిరస్కరణ

సమాచారశాఖ కమిషనర్ తుమ్మా విజయకుమార్ రెడ్డి డిప్యుటేషన్ రద్దు కోరుతూ ప్రభుత్వానికి విన్నవించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇటువంటి విన్నపాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని, కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం.